
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 173

మంగళవారం 12-9-2023



మన పరుగుల వాన

కోహ్లి, రాహుల్ సెంచరీలు. పాక్‌పై భారత్ ఘనవిజయం -12లో



24... తగ్గేదేలే

జొకోవిచ్ ఖాతాలో 24వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ -12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కీలక వ్యూహాత్మక భాగస్వామి

జీ20 సదస్సులో భాగంగా ఢిల్లీకి విచ్చేసిన సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

వివరాలు 6లో ▸



ఉత్తరప్రదేశ్‌లో కుంభవృష్టి

యూపీలో భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. 24 గంటల్లో వర్షసంబంధ ఘటనల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



దేవెగౌడ మనవడికి చుక్కెదురు

జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ ఎన్నిక చెల్లదంటూ కింది కోర్టు ఇచ్చిన తీర్పు అమలును నిలిపి వేయాలన్న పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.

వివరాలు 6లో ▸



నిఫ్టీ @ 20,000

మార్కెట్ విశ్లేషకుల నిరీక్షణకు తెర దించుతూ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సూచీ తొలిసారి 20,000 పాయింట్లను ముద్దాడింది.

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

ఉద్యమ ఆకాంక్షలను కేసీఆర్ తుంగలో తొక్కారు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఏర్పాటైంది. దీనికి చైర్మన్‌గా ఎన్నికైన రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కేసీఆర్‌పై మండిపడ్డారు.

- వివరాలు 2లో▶

సింగరేణిలో 'గుర్తింపు'నకు గ్రీన్‌సిగ్నల్



సింగరేణిలో వాయిదా పడుతూ వస్తున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర కార్మిక శాఖ ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపింది.

- వివరాలు 5లో▶

బీఆర్‌ఎస్ అభివృద్ధిలో.. విపక్షాలు తిట్లలో పోటీ



బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడుతుంటే.. విపక్షాలు తిట్లలో పోటీ పడుతున్నాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఐటీ ఉత్పత్తుల్లో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందన్నారు.

- వివరాలు 2లో▶

బండ్లకు సుప్రీంలో ఊరట



గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆయన వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించి ఉత్తర్వులు ఇచ్చింది.

- వివరాలు 2లో▶

NECC Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్లు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు

గుడ్ల రిటైల్ ధర ₹ 61 డజన్

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 141

రిటైల్ లైవ్ బర్డ్ 163

డ్రెస్డ్ స్కిన్‌తో 236


స్కిన్‌లెస్ 269

Conditions Apply

జైల్లో ఉండను మా ఇంట్లో ఉంటా

హౌస్ రిమాండ్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టులో చంద్రబాబు పిటిషన్

- సాక్ష్యాలను తారుమారు చేయడం.. సాక్షులను ప్రభావితం చేయడం
- జరగవన్న బాబు న్యాయవాది లూథ్రా.. వెంటనే తీర్పు వెలువరించాలని పట్టు
- బయటకన్నా జైల్లోనే చంద్రబాబుకు భద్రత ఎక్కువ
- ఆయన భద్రతకు జైలులో అన్ని చర్యలు తీసుకున్నాం
- అసలు హౌస్ రిమాండ్ పిటిషన్‌కు విచారణార్హతే లేదు..
- ఈ పిటిషన్ గురించి ఏ చట్టంలోనూ ప్రస్తావన లేదు
- ఏసీబీ కోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు
- ముగిసిన వాదనలు.. నేటి మధ్యాహ్నానికి తీర్పు వాయిదా



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్ కేసులో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్ (ఇంటి వద్ద)లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు సోమవారం ముగిశాయి. వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది. దీనిపై మంగళవారం మధ్యాహ్నం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అయితే ఉదయమే తీర్పు వెలువరించాలన్న చంద్రబాబు తరఫు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అభ్యర్థనను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ఆ సమయంలో తమకు విచారించాల్సిన కేసులు చాలానే ఉన్నాయని కోర్టు పేర్కొంది. మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబును విచారించేందుకు కస్టడీకి అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులకు ఏసీబీ కోర్టు సూచించింది. కౌంటర్లు దాఖలైన తరువాత

మిగతా 10వ పేజీలో ▶

పీటీ వారంట్!

- 'ఇన్నర్ రింగ్ రోడ్డు' అక్రమాల కేసులో చంద్రబాబు విచారణకు 'సిట్' పిటిషన్
- చంద్రబాబు, చినబాబు సూత్రధారులుగా భూ కుంభకోణం
- నారాయణ, లింగమనేని ప్రధాన పాత్రధారులు

10లో

అంతా హైకమాండ్ కంట్రోల్‌లోకి..

టీ కాంగ్రెస్ వ్యవహారాలు టేకోవర్ చేసిన అధిష్టానం

- స్పష్టం చేస్తున్న ఇటీవలి పరిణామాలు, నిర్ణయాలు.. గాంధీభవన్ వర్గాల్లోనూ చర్చ
- ఏ పార్టీలతో చర్చలయినా, కమ్యూనిస్టులతో పొత్తయినా అన్నీ హస్తిన నుంచే
- సీడబ్ల్యూసీ నియామకాలు, సీఈసీ కూర్పులోనూ ఏఐసీసీ మాటే
- సీడబ్ల్యూసీ నిర్వహణ నిర్ణయం కూడా టెన్ జన్‌పథ్‌దే..
- రాష్ట్ర పార్టీలో కుమ్ములాటలు పుట్టి ముంచుతాయన్న అభిప్రాయమే కారణం?

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు తరుముకొస్తున్న వేళ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలన్నింటినీ ఏఐసీసీ హ్యాండోవర్ చేసుకుందా? ఈసారి తెలంగాణలో గెలుపు అవకాశాలున్నాయనే అంచనాల నేపథ్యంలో టీపీసీసీకి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ ఢిల్లీలోనే జరుగుతున్నాయా? రాష్ట్ర పార్టీ నేతల అభిప్రాయాలను గౌరవిస్తున్నామన్న భావన కల్పిస్తూనే చేయాల్సిందంతా అధిష్టానమే చేస్తోందా? తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని తాజా పరిణామాలను గమనిస్తే.. అవుననే సమాధానమే వస్తోంది. పార్టీ కమిటీల ఏర్పాటు నుంచి టికెట్ల కేటాయింపు వరకు అంతా ఢిల్లీ కనుసన్నల్లోనే జరిగేలా ప్రణాళిక అమలవుతోందని, ఇటీవలి అన్ని పరిణామాలు టీపీసీసీకి పూర్తిస్థాయిలో సమాచారం లేకుండానే జరిగాయనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. తెలంగాణ పార్టీలో ఉన్న కుమ్ములాటలు పుట్టి ముంచుతాయనే అభిప్రాయానికి వచ్చిన టెన్ జన్‌పథ్ వర్గాలు పూర్తిస్థాయిలో తెలంగాణ వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నాయని, అప్పుడప్పుడూ బెంగళూరు నుంచి అందే సంకేతాలు కూడా ఏఐసీసీ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు.



రాష్ట్ర నాయకత్వానికి తెలియకుండానే..


రాష్ట్రాల్లోని ఇతర పార్టీల విషయంలో అవలంబించాల్సిన వైఖరిపై జాతీయ పార్టీలు సాధారణంగా ఆయా రాష్ట్రాల్లోని పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకుంటాయి. కాంగ్రెస్ పార్టీలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కానీ వైఎస్సార్‌టీపీ నేత షర్మిలతో చర్చలు, వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో పొత్తుల గురించి ఢిల్లీలో నిర్ణయం తీసుకున్న తర్వాతే రాష్ట్ర పార్టీ నేతలకు తెలియడం గమనార్హం. షర్మిల బెంగళూరులో డి.కె.శివకుమార్‌ను కలిసినప్పటి నుంచే

మిగతా 2వ పేజీలో ▶

ర్యాలీలు.. సభలు

కేడర్‌లో జోష్ పెంచేలా బీఆర్‌ఎస్ కార్యక్రమాలు

- 15న తొమ్మిది జిల్లాల్లో కనీసం 15 వేల మందితో ర్యాలీలు
- 16న పాలమూరు ఎత్తిపోతల ప్రారంభం సందర్భంగా భారీ సభ
- 17న 'జాతీయ సమైక్యత దినోత్సవం' పేరిట జాతీయ పతాకాల ఆవిష్కరణ
- నెలాఖరులో పొరుగు రాష్ట్రంలోని సోలాపూర్‌లో సభ
- అక్టోబర్ 16న వరంగల్‌లో ఎన్నికల శంఖం పూరించనున్న కేసీఆర్
- 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ, ప్రభుత్వ పరంగా పెద్దయెత్తున సభలు, కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా క్షేత్ర స్థాయిలో కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు అధికార బీఆర్‌ఎస్ సిద్ధమవుతోంది. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు చేసుకుంటూనే మరోవైపు ఇతర రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపైనా దృష్టి సారిస్తోంది. అదే సమయంలో పార్టీలో అసమ్మతిని నిశితంగా గమనిస్తున్న అధిష్టానం ఆ మేరకు అవసరమైన చర్యలు చేపడుతోంది.

15న 9 వైద్య కళాశాలల ప్రారంభం

ఈ నెల 15న ఏకకాలంలో తొమ్మిది కొత్త మెడికల్ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ సందర్భంగా కాలేజీలు మొదలయ్యే జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో కనీసం 15 వేల నుంచి 20 వేల మందితో ర్యాలీలు తీసే బాధ్యతను సంబంధిత జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు అప్పగించారు. సీఎం కేసీఆర్ ఏదో ఒకచోట కొత్త మెడికల్ కాలేజీని ప్రారంభించనుండగా, సిరిసిల్లలో మంత్రి కేటీఆర్, కామారెడ్డిలో మంత్రి హరీశ్‌రావు ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. కాగా ఈ నెల 16న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా కొల్లాపూర్‌లో బహిరంగ సభ నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు లక్షన్నర మంది రైతులను ఈ సభకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకోవైపు ఈ నెల 17న 'జాతీయ సమైక్యత దినోత్సవం' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ పతాకాలు ఎగురవేయాల్సిందిగా బీఆర్‌ఎస్ శ్రేణులను పార్టీ

మిగతా 2వ పేజీలో ▶

ఇక పరిశీలన పర్వం

- ఆశావహుల దరఖాస్తులపై బీజేపీ దృష్టి
- జిల్లాలు, నియోజకవర్గాల వారీగా కసరత్తు.. వడపోతకు సమయం పడుతుందంటున్న పార్టీ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ టికెట్ల కోసం దాఖలైన దరఖాస్తుల పరిశీలనకు రాష్ట్ర బీజేపీ సిద్ధమౌతోంది. ఆశావహులు అధిక సంఖ్యలో ఉండటంతో ఇప్పుడు వాటి పరిశీలన కీలకంగా మారింది. ఈ నెల 4 నుంచి 10వ తేదీల మధ్య అప్లికేషన్లు స్వీకరించగా మొత్తం 6,003 దరఖాస్తులు అందాయి. నియోజకవర్గాల వారీగా వివిధ స్థాయిల్లో వీటిని పరిశీలించి, వడపోతకు సిద్ధం చేసేందుకు కొంత సమయం పడుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దరఖాస్తులను జిల్లాలు, నియోజకవర్గాల వారీ గా కట్టలు కట్టి, ఓ జాబితా రూపొందించేందుకు పార్టీ కార్యాలయంలో కసరత్తు సాగుతోంది. ఈ ప్రక్రియ ముగిశాక దరఖాస్తుల పరిశీలనకు పార్టీ రాష్ట్ర నాయకత్వం నలుగురైదుగురు నేతలతో ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఒక్కో నియోజకవర్గానికి

మిగతా 2వ పేజీలో ▶



సోమవారం హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

ఆశ వర్కర్ల డిమాండ్ • హైదరాబాద్‌లో భారీ నిరసన ప్రదర్శన

సుల్తాన్ బజార్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిగా ఆశవర్కర్లు తరలివచ్చారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ తామంతా సుశిక్షితులమని, ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజాసేవ చేస్తున్నామని చెప్పారు. రోగుల

మిగతా 5వ పేజీలో ▶

కేంద్రాలకు తాళం వేసి సమ్మెకు..

- రాష్ట్రవ్యాప్తంగా సోమవారం విధులు బహిష్కరించిన అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు
- డిమాండ్లు ఒప్పుకునే వరకు సమ్మె విరమించబోమని సంఘాల స్పష్టీకరణ

5లో

ఇదండీ సంగతి



మేమూ అంతే సార్!
దొరకనన్ని రోజులూ దొరలాగే బతికాం!

పెరుగు అడిగితే చంపేశారు!

- కస్టమర్‌పై హోటల్ సిబ్బంది విచక్షణారహిత దాడి
- పోలీసులు వచ్చాక వారి సమక్షంలోనూ అదే దాష్టీకం
- పంజగుట్ట పరిధిలోని మెరీడియన్ హోటల్‌లో ఘటన
- ఇరు వర్గాలను ఠాణాకు తీసుకువెళ్లిన పోలీసులు
- బాధితుడు ఊపిరి అందట్లేదన్నా పట్టించుకోని వైనం
- ఆలస్యంగా ఆస్పత్రికి తరలించడంతో దక్కని ప్రాణం



లియాకత్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: బిర్యానీ తింటూ అదనంగా రైతా(పెరుగు) అడిగిన పాపానికి రెస్టారెంట్ సిబ్బంది ఓ యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. పోలీసులు వచ్చినా వారి ముందు కూడా కొట్టడం.. పోలీస్‌స్టేషన్‌లో ఊపిరి ఆడటం లేదని చెప్పినా పోలీసులు సైతం పట్టించుకోకుండా చివరి నిమిషంలో ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే పరిస్థితి విషమించి చనిపోయాడు. పంజగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని మెరీడియన్ రెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. మినరల్ వాటర్ వ్యాపారం చేసే పాతబస్తీ చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ లియాకత్ (32) ఆదివారం రాత్రి 10:30 ప్రాంతంలో తన స్నేహితులైన తొమ్మిది మందితో కలిసి పంజగుట్ట కూడలిలో ఉన్న మెరీడియన్ రెస్టారెంట్‌కు వచ్చారు. బిర్యానీ తింటున్న సమయంలో లియాకత్ రైతా అదనంగా కావాలని వెయిటర్‌ను కోరారు. రెండు సార్లు అడిగినా వెయిటర్ నుంచి నిర్లక్ష్యపు సమాధానం, పరుషపదజాలం రావడంతో లియాకత్‌కు, అతడికి

మిగతా 5వ పేజీలో ▶

కొత్త మెడికల్ కాలేజీల్లో 85% సీట్లు స్థానికులకే..

జీవో 72 సమర్థనీయమే.. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15 శాతం) పోను మిగిలిన కన్వీనర్ కోటా సీట్లు (85 శాతం) స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీవో 72ను హైకోర్టు సమర్థించింది. కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే చెందుతాయన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు జీవో 72ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఎలాంటి మెరిట్ లేదంటూ కొట్టివేసింది. రాష్ట్రంలోని కొత్త మెడికల్ (ఎంబీబీఎస్, డెంటల్) కాలేజీల్లో సీట్ల కేటాయింపు వివాదంలో హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ ప్రభుత్వం గత నెల ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన వైద్య కాలేజీల్లోని కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వు కానున్నాయి. ఈ మేరకు జూలై 3న జీవో నంబర్ 72ను విడుదల చేసింది. అంతకుముందు జాతీయ కోటా 15 శాతం పోగా.. మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకు, 15 శాతం అన్‌రిజర్వుడుగా ఉండేవి. అన్‌రిజర్వుడులో తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ప్రభుత్వ తాజా జీవోతో అన్‌రిజర్వుడు అనేది ఉండదు. దీన్ని ఏపీకి చెందిన గంగినేని సాయి భావనతోపాటు మరికొందరు తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు.

వాదనలు సాగాయిలా...: ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్

మిగతా 3వ పేజీలో ▶

▶ శుభపరిణామం: మంత్రి హరీశ్



వైద్య విద్యలో మెడికల్ అడ్మిషన్లకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును శుభపరిణామంగా పేర్కొంటూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడంతోపాటు వాటి ద్వారా అందుబాటులోకి వచ్చిన ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేనని స్పష్టమైందన్నారు. హైకోర్టు తీర్పుతో మరో 520 మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకు లభిస్తున్నాయన్నారు.

క్లుప్తంగా...

15న బీఆర్ఎస్‌పీపీ భేటీ
ఎంపీలు హాజరుకావాలన్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 18 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, ఈ నెల 15న ప్రగతిభవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుంది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో.. పార్లమెంట్ సమావేశాల్లో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వైఖరి, ఇతర అంశాలపై చర్చ జరుగుతుందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు తప్పని సరిగా హాజరుకావాలని కేసీఆర్ కోరారు. జమిలి ఎన్నికలు, మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం వంటి కీలక అంశాలు ఈ సమావేశంలో చర్చకు వస్తాయని భావిస్తున్నారు.

కేటీఆర్‌తో డొమినికన్ రిపబ్లిక్ రాయబారి భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో భారత్‌లో డొమినికన్ రిపబ్లిక్ రాయబారి డేవిడ్ పోయుగ్ భేటీ అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో.. ఇటీవలి కాలంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పారిశ్రామిక రంగంలో తెలంగాణ వేగంగా సాధిస్తున్న పురోగతిని కేటీఆర్ వివరించారు. ఐటీ, ఆవిష్కరణలు, ఫార్మా, ఉన్నత విద్యా రంగాల్లో డొమినికన్ రిపబ్లిక్‌తో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. కాగా కరీబియన్, మధ్య అమెరికా ప్రాంతంలో ఆర్థికంగా అతివేగంగా ఎదుగుతున్న దేశాల జాబితాలో డొమినికన్ రిపబ్లిక్ ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో డొమినికన్ రిపబ్లిక్ రాయబారితో మంత్రి కేటీఆర్ భేటీకి అధిక ప్రాధాన్యత ఏర్పడింది.

వారి గెలుపు నా కష్టమే
ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రజాప్రతి నిధులను తానొక్కడినే గెలిపించుకున్నానని, వారి గెలుపులో ఎవరి సహకారం లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు తిన్నింటి వాసాలు లెక్క పెట్టకుండా పనిచేయాలని హితవు పలికారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం జరిగిన రైతు విశ్రాంత భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను ఎప్పుడూ గ్రూపు రాజకీయాలు చేయలేదని పేర్కొన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని వివరించారు.

దళిత, బీసీబంధులో అక్రమాలు
సీఎం కేసీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి లేఖ



సాక్షి, యాదాద్రి: దళితబంధులో జరిగిన అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఈమేరకు ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. తెలంగాణలో మీరు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు, బీసీబంధు పథకాలు పేద ప్రజలకు అందుతాయని ఆశించారని, కానీ.. వారం రోజులుగా తాను ఉమ్మడి నల్లగొండ జిల్లా నియోజక వర్గాల పరిధిలోని దళితబంధు, బీసీబంధు మంజూరైన లిస్ట్ పరిశీలిస్తే అక్రమాలు జరిగా యన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో 566 మంది దళిత కుటుంబాలు ఉంటే..12 యూనిట్‌లు కూడా మీ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులకు ఇచ్చారని పేర్కొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 30 శాతం కమీషన్ తీసుకుంటూ బీసీబంధు, దళిత బంధు యూనిట్లు మంజూరు చేశారని ఆరోపించారు. తిరుమలగిరి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రూ.180 కోట్లు మంజూరు చేస్తే 60 కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

కేసీఆర్.. ఇక్కడ పోటీ చేసి గెలవండి: పొంగులేటి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మూడు జనరల్ స్థానాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేసి విజయం సాధించాలంటూ సీఎం కేసీఆర్‌కు తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. కొత్తగూడెంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌తో పాటు మైనార్టీలు ఎక్కువగా ఉండే కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేస్తున్నారని, వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తే బాగుంటుందని అన్నారు. ఒకవేళ కేసీఆర్ ఇక్కడ పోటీకి దిగితే ఆయనపై బ్యాలెట్ పోరుకు తాను సిద్ధమేనని తెలిపారు. తనకు, కుటుంబానికి ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసినా కుటుంబసభ్యులతో చర్చించాకే బీఆర్ఎస్‌ను వీడానని పొంగులేటి చెప్పారు.

ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కారు

సీఎం కేసీఆర్‌పై జస్టిస్ చంద్రకుమార్ ధ్వజం
- మోదీ చేతిలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసం
- అవినీతికి వ్యతిరేకంగా పోరాడదామని పిలుపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ జస్టిస్ చంద్రకుమార్ చైర్మన్‌గా కొత్త వేదిక ఏర్పాటు
- వామపక్షాలు, ప్రజాస్వామిక సంస్థలతో కలిసి స్థాపన



సోమవారం విలేకరుల సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, వినాయక్ రెడ్డి, చలపతిరావు గోవర్ధన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) ఏర్పాటైంది. ఇందులో సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ (యూ), ఆర్ఎస్‌పీ, బీఎల్ఎఫ్, భారత జాతీయ ఉద్యమ సంఘం తదితర అనేక లౌకిక ప్రజాసంఘాలు కలిసి టీఎస్‌డీ ఎఫ్‌ను ఏర్పాటు చేశాయి. ఈ వేదికకు చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, కో కన్వీనర్లుగా పార్టీకొకరు చొప్పున ఉండాలని నిర్ణయించారు. రాష్ట్ర సమన్వయకర్తగా నైనాల గోవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీఎస్‌డీఎఫ్ విధాన పత్రం, ఉమ్మడి కార్యాచరణను నాయకులు ప్రకటించారు. చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలను పూర్తిగా తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతి, నియంతృత్వ పాలనకు వ్యతిరే కంగా వామపక్ష పార్టీలు, లౌకిక ప్రజాస్వామిక సంస్థలు కలిసి ఈ వేదికను ఏర్పాటు చేశాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం అదానీ, అంబానీ లాంటి కొద్దిమంది పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ చేతిలో రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసమయ్యాయన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలు, బడా సంపన్న అనుకూల విధానాలు, పేదల వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పని చేస్తామన్నారు. ముఖ్యంగా కేసీఆర్ కుటుంబం అడ్డూ అదుపులేని అవినీతికి పాల్పడుతోందని దుయ్యబట్టారు. తెలంగాణలో అవినీతి ప్రపంచ రికార్డులను కూడా బద్దలు కొట్టిందన్నారు. ఈ అవినీతి తెలంగాణ ప్రజల పురోభివృద్ధికి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా మారిందని, అందుకే అంతా కలిసి అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జువ్వాడి చలపతిరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు బాల మల్లేశ్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు హన్మేష్, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తుకారాం, ఇతర నాయకులు గుర్రం విజయ్ కుమార్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌డీఎఫ్ విధాన పత్రం ముఖ్యాంశాలు ఇవీ..
- ప్రతి మండలంలో అవసరమైనన్ని నాణ్యమైన పాఠశాలలు స్థాపించాలి.
- నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. ప్రతి ఐదు వేల మంది జనాభాకు ఒక రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని నెలకొల్పాలి.
- స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి.
- ప్రతి ఒక్కరికి ఉద్యోగ హక్కును కల్పించాలి. లేకుంటే నిరుద్యోగులందరికీ జీవించే నిరుద్యోగ భృతిని ఇవ్వాలి.
- భూమిలేని పేదలకు భూములను పంపిణీ చేయాలి. దళితులకు 3ఎకరాల భూమి ఇవ్వాలి.
- కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కుల ప్రాతిపదికగా జన గణన జరగాలి.
- చట్టసభల్లో బీసీలకు, మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలి.
- కాళేశ్వరం, భగీరథ ప్రాజెక్టుల్లో జరిగిన భారీ అవినీతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి.

పూర్తి కాకుండానే 'పాలమూరు'ను ప్రారంభిస్తారా?

- ఒక్క పంపును ప్రారంభిస్తే.. ప్రాజెక్టు పూర్తయినట్టా?:టీపీసీసీ చీఫ్ రేవంత్
- కాంగ్రెస్‌లో చేరిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీతా దయాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పాలనలో పాలమూరు వలసలు ఆగలేదని, అభివృద్ధి జరగలేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పనులు పూర్తి కాకుండానే ఈనెల 16న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, ఈ ప్రాజెక్టులో మొత్తం 31 పంపులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, కేవలం ఒక్క పంపును ప్రారంభిస్తే ప్రాజెక్టు పూర్తవుతుందా అని ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీభవన్‌లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆమెను ఆహ్వానించిన అనంతరం రేవంత్ మాట్లాడుతూ గతంలో సీతా దయాకర్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు దేవరకద్రను ఎంతో అభివృద్ధి చేశారని, తొమ్మిదిన్నరేళ్లలో పాలమూరుకు కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఆమె ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి జరిగితే, ఇప్పుడున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దోపిడీ దొంగల కంటే దారుణంగా తయారయ్యారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతలకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందని, సీతాదయాకర్‌రెడ్డికి రాజకీయంగా అన్ని రకాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన తిమ్మాపూర్ నేతలు

మానకొండూరు నియోజకవర్గం తిమ్మాపూర్ మండలానికి చెందిన పలువురు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు కాలువ మల్లేశం, శ్రీనివాస్‌తో సహా పలువురు కార్యకర్తలను జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కండువాకప్పి రేవంత్ పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ విజయభేరి సభ ఏర్పాట్లకు భూమిపూజ

పాల్గొన్న మాణిక్ రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి

తుక్కుగూడ/సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (ఈ- సిటీ)లో ఈ నెల 17న కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న విజయభేరి సభ ఏర్పాట్లకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భూమిపూజ చేశారు. సభ ఏర్పాటు నుంచి, పూర్తయ్యే వరకు ఎలాంటి విఘ్నాలు ఎదురుకాకుండా చూడాలని భూమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం సభాస్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జునఖర్గేతోపాటు ఏఐసీసీ ప్రతినిధులు హాజరయ్యే ఈ సభకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. సభావేదిక, జనాలు కూర్చునే గ్యాలరీ, లోపలికి ప్రవేశించే ద్వారాలు, పార్కింగ్ ప్రదేశం ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయభేరికి సిద్ధంకండి: రేవంత్ పిలుపు

ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి బహిరంగ సభకు అందరూ సిద్ధం కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సభ నిర్వహణపై ఏఐసీసీ నియమించిన పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు, పార్లమెంటు ఇన్‌చార్జులుగా ఉన్న టీపీసీసీ ఉపాధ్యక్షులతో సోమవారం గాంధీభవన్‌లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పోలింగ్ బూత్ నుంచి సభకు కార్యకర్తలు హాజరయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఎన్నికల పరిశీలకులు దీపాదాస్ మున్షీ, మీనాక్షి నటరాజన్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మళ్లీ గెలిపిస్తే చేతికి చిప్పే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రి రూపాలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పులిమామిడి రాజు. చిత్రంలో ఈటల, కిషన్‌రెడ్డి, రఘునందన్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : ధనికరాష్ట్రంగా ఉన్న తెలంగాణ కేసీఆర్ పాలనలో పూర్తిగా దివాలా తీసిందని.. కనీసం జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి దిగజారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. మళ్లీ కేసీఆర్‌ను గెలిపిస్తే ప్రజల చేతికి చిప్పే మిగులుతుందని చెప్పారు. బీఆర్ఎస్ కౌన్సిలర్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన విజయ సంకల్పసభలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేక మద్యం టెండర్లు 6 నెలలు ముందు నిర్వహించిందని, ఓఆర్ఆర్ టెండర్లతో వచ్చిన డబ్బులతో జీతాలు చెల్లించాల్సి వస్తోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ సోని యా కుటుంబం కోసం ..బీఆర్ఎస్ కేసీఆర్ కుటుంబం కోసం..ఎంఐఎం ఒవైసీ కుటుంబం కోసం పనిచేస్తాయని చెప్పారు. ఒక్క బీజేపీ మాత్రమే అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందనే విషయం ప్రజలు గుర్తించాలన్నారు. సోనియా నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ.పది లక్షల కోట్లు అవినీతి జరిగిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు దేశంలోని అన్ని పార్టీల ఖర్చులను తానే భరిస్తానని సీఎం కేసీఆర్ చెప్పారని, అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు.

కేసీఆర్‌కు బీసీలపై నమ్మకం లేదు: ఈటల

బీఆర్ఎస్ ఉన్నంత వరకు ఆ పార్టీకి సాధారణ వ్యక్తి అధ్యక్షుడిగా ఉండే ఆస్కారం ఉంటుందా అని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. కేసీఆర్‌కు బీసీలపై నమ్మకం లేకనే మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ బాధ్యతలను కూడా తన అన్న కొడుక్కే కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉన్నంత వరకు కేసీఆర్ కుటుంబసభ్యులు మినహా ఇతరులు సీఎం కాలేరని, కేసీఆర్ కాకపోతే ఆయన కొడుకు.. మనవడే ముఖ్యమంత్రి అవుతారని, సాధారణ వ్యక్తులు సీఎం కాలేరని అన్నారు. సభలో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల, ఎమ్మెల్యే రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రకులాల రాజకీయ పెత్తనాన్ని కూలదోయాలి
డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్



నల్లగొండ టౌన్: అగ్రకులాల రాజకీయ పెత్తనాన్ని కూలదోయడానికి 93%గా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకం కావాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలో చేప ట్టిన ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొ న్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దిష్టిబొ మ్మలను దహనం చేశారు. అనంతరం విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ అగ్రకుల పార్టీల తీరుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నామ న్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీజేఎస్, సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌టీపీలకు జనాభాలో 7% కూడా లేని వెలమ, రెడ్డి, కమ్మ తదితర అగ్ర కులాలు నాయకత్వం వహించడం ఏమిటని ప్రశ్నించారు. అది పూర్తిగా సామాజిక న్యాయసూత్రానికి, భారత రాజ్యాంగ సమానత్వ భావనకు, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ధ్వజమెత్తారు. ఆ ఏడు పార్టీల నాయకత్వం నుంచి ఆయా కులాలను తప్పించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సబ్బండ కులాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాలు, 13న మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామ న్నారు.

సుప్రీంకోర్టులో కృష్ణమోహన్‌రెడ్డికి ఊరట

- ఎమ్మెల్యేగా ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పుపై స్టే
- ఎన్నికల సంఘానికి నోటీసులు
- విచారణ 4 వారాలపాటు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. గద్వాల ఎమ్మెల్యేగా తన ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టులో ఎందుకు వాదనలు వినిపించలేదని ధర్మాసనం కృష్ణమోహన్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సుందరాన్ని ప్రశ్నించింది. పిటిషనర్ సంతకం ఫోర్జరీ చేసి నోటీసులు అందినట్లు హైకోర్టును మభ్యపెట్టారని, తామెక్కడా వివరాలు దాచలేదని సుందరం తెలిపారు. అఫిడవిట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు అని మాత్రమే ఉందని, సేవింగ్స్ ఖాతాల గురించి కాదన్నారు. అయితే, సేవింగ్స్ ఖాతాల గురించి వెల్లడించకపోవడం తప్పేనని తెలి పారు. మొత్తం ఆరు ఖాతాలకు సంబంధించి వివా దం చేశారని అందులో తొలి మూడు వివాదరహిత మని చెప్పారు. వివాదాస్పద రూ.1.80 కోట్లు వ్యవసాయ భూమికి సంబంధించినవని, ఎన్నికలకు ముందుగానే ఆ భూమి అమ్మి వేసినట్లు వివరించారు. ఎన్నికల చట్టాలకు సంబంధించి అన్ని ఖాతాల వివ రాలు వెల్లడించాల్సిందేనని డీకే అరుణ తరపు సీని యర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ తెలిపా రు. డీకే అరుణను ఎమ్మె ల్యేగా గుర్తించాలని కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫి కేషన్ ఇచ్చినట్లు ధర్మాస నం దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ఎన్నికల సంఘం, ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేస్తూ హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తున్నట్లు పేర్కొంది. రెండు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ తేదీ వీలైనంత త్వరగా ఇవ్వాలని రవిశంకర్ కోరగా విచారణ నాలుగు వారాలపాటు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

వెన్నుపోటు రాజకీయాలు: కృష్ణమోహన్‌రెడ్డి

ప్రజా క్షేత్రంలో గెలవలేకనే ఫోర్జరీ సంతకాలతో వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యే కావాలని డీకే అరుణ చూస్తున్నారని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆరోపించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో కృష్ణమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తనకు నోటీసులు అందలేని అందుకే హైకోర్టుకు వెళ్లలేదన్నారు. తన సంతకం ఫోర్జరీ చేశారని తెలిసి తమ వాదనలు వినాలని హైకోర్టును అభ్యర్థించినా వినలేదన్నారు. ఎన్నికలకు ముందుగానే కొన్ని భూములు విక్రయించానని, వివరాలు అఫిడవిట్‌లో చూపాల్సిన అవసరం లేదన్నారు.

బీఆర్ఎస్ అభివృద్ధిలో.. విపక్షాలు తిట్లలో పోటీ

మంత్రి హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడుతుంటే.. విపక్షాలు తిట్లలో పోటీ పడుతున్నాయని అని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. 'పాపం టీడీపీ అధినేత చంద్రబాబు అరె స్టు అయినట్టున్నారు.. గతంలో ఆయన ఐటీ ఐటీ అనే వారు.. ఇప్పుడు మాట్లాడకూడదేమో కానీ.. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో ఐటీతో పాటు, పల్లెల్లో వ్యవసాయంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగింది' అని మంత్రి అన్నారు. ఐటీ ఉత్పత్తుల్లో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందన్నారు. సోమవారం సిద్దిపేటలో పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కోతలు లేకుండా గృహ అవసరాలకు 24 గంటల కరెంటు ఇచ్చే ఒకేఒక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా 24 గంటల కరెంటు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లు, ఎనిమిది పీజీ సీట్లు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణ వచ్చినప్పుడు 3.5 లక్షల ఐటీ ఉద్యోగాలుంటే ఈరోజు 10 లక్షల ఐటీ ఉద్యోగాలకు రాష్ట్రం నిలయంగా మారిందన్నారు. దేశ జనాభాలో 3శాతం గ్రామీణ జనాభా ఉన్న తెలంగాణ.. కేంద్రం ఇచ్చే అవార్డుల్లో 38శాతం, పట్టణాలల్లో 28శాతం అవార్డులు మనకే దక్కాయన్నారు. జీడీపీ వృద్ధి రేటులో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. త్వరలో మహిళా వర్సిటీని ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి సబితారెడ్డి తెలిపారు.

అసలైన అవకాశవాదులు మీరే
కేటీఆర్‌పై షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జీవనాడిని కలుషితం చేసిన మీరే అసలైన అవకాశవాదులని.. మంత్రి కేటీఆర్‌పై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. దొంగే.. దొంగా దొంగా.. అన్నట్లుంది మంత్రి కేటీఆర్ వైఖరని పేర్కొన్నారు. విచ్ఛిన్నకర శక్తులను తిప్పికొట్టాలని చెప్పే దొర.. కుటిల యత్నా లతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన అసలైన శక్తులు మీరే కదా?.. అని దుయ్యబట్టారు. రాష్ట్రం నెత్తిన అప్పులు మోపి రూ.లక్ష కోట్లు కాజేయడమే కాకుండా.. 9 ఏళ్లలో 8 వేల మంది రైతులను, ఉద్యోగాలు అని చెప్పి వందల మంది నిరుద్యోగులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు.

ఇక పరిశీలన పర్వం

▶ మొదటి పేజీ తరువాయి

ముగ్గురు లేదా నలుగురి పేర్లతో ఓ తాత్కాలిక జాబితాను సిద్ధం చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసి బీజేపీ పార్లమెంటరీ బోర్డుకు అభ్యర్థుల ఎంపిక నిమిత్తం పంపేందుకు మరికొంత సమయం పట్టొచ్చునని ముఖ్యనేతలు అంచనా వేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుండగానే రాష్ట్ర ఎన్నికల కమిటీని పార్టీ నాయకత్వం నియమించే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.

నేటి నుంచి జిల్లాల వారీ సమావేశాలు: మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ సమావేశాలకు ముఖ్య నేతలు తరలనున్నారు. ఈ భేటీల్లో జిల్లాల్లోని ఆయా నియోజకవర్గాల వారీగా అందిన దరఖాస్తులు, పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకులు, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమావేశానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ ధర్మపురి అరవింద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమావేశానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్, ఎంపీ సోయం బాపూరావు హాజరవుతారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు.

..హైకమాండ్ కంట్రోల్‌లోకి

▶ మొదటి పేజీ తరువాయి

ఆమె కాంగ్రెస్‌లో చేరతారన్న దానిపై ఊహాగానాలు సాగినప్పటికీ, దీనిపై నామమాత్రంగా కూడా రాష్ట్ర పార్టీ నేతలతో ఢిల్లీ పెద్దలు చర్చించకపోవడం గమనార్హం. మరోవైపు ఇండియా కూటమిలో భాగస్వాములైన సీపీఐ, సీపీఎం పార్టీలతో వచ్చే ఎన్నికల్లో పొత్తు గురించి కూడా రాష్ట్ర పార్టీ అభిప్రాయంతో పనిలేకుండా ఏఐసీసీయే రంగంలోకి దిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరిపిన తర్వాతే విషయం రాష్ట్ర నాయకత్వానికి తెలిసింది. ఇటీవల జరిగిన సంస్థాగత కమిటీల ఏర్పాటు విషయంలో కూడా తెలంగాణ నాయకత్వానికి తెలియకుండానే నిర్ణయాలు జరిగిపోవడం గమనార్హం. పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో తెలంగాణ నుంచి ఎవరికి అవకాశం వస్తుందన్న దానిపై అనేక ఊహాగా నాలు వచ్చాయి. ఫలానా నేతను టీపీసీసీ సిఫారసు చేసిందనే సమాచారం కూడా బయటకు వచ్చింది. కానీ ఎన్నడూ చర్చ జరగని ఇద్దరు నేతలకు అనూహ్యంగా సీడబ్ల్యూసీలో చోటు దొరికింది. తమ పేర్లు ఎందుకు రాలేదా అని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్లు ఆరా తీస్తున్న సమయంలోనే వారికి మరో షాక్ తగిలింది. కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)ని ప్రకటించిన అధిష్టానం రాష్ట్ర పార్టీతో సంబంధం లేకుండానే తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం కల్పించింది. అంతకంటే ముందు ఏర్పాటు చేసిన పార్టీ స్క్రీనింగ్ కమిటీలోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతతో పాటు మరో నేతను నియమించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

'సీడబ్ల్యూసీ'పై పీఈసీలో తీర్మానం!

గతంలో ఎన్నడూ లేని విధంగా సీడబ్ల్యూసీ సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. అయితే వీటి నిర్వహణ విషయంలోనూ అధిష్టానమే నిర్ణయం తీసుకుని టీపీసీసీకి సమాచారం ఇచ్చిందని అంటున్నారు. ఆ సమాచారం మేరకే సీడబ్ల్యూసీ సమావేశాలతో ఎలాంటి సంబంధం లేని ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశంలో.. సీడబ్ల్యూసీ సమావేశాలు రాష్ట్రంలో నిర్వహించాలనే తీర్మానం చేశారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఈ తీర్మానం తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఒకసారి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సమావేశాల నిర్వహణపై ఆరా తీశారు. ఆ తర్వాత ఉన్నట్టుండి సీడబ్ల్యూసీ సమావేశాల షెడ్యూల్‌ను ఏఐసీసీ ప్రకటించింది. అలాగే ఈనెల 18న సీడబ్ల్యూసీ సభ్యులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు తెలంగాణ వ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తారన్న విషయాన్ని కూడా నేరుగా అధిష్టానమే ప్రకటించింది. కేవలం సోనియాగాంధీ పాల్గొనే సభ, ఆ సభలో ప్రకటించాల్సిన ఐదు గ్యారంటీ కార్డు స్కీంల గురించి మాత్రమే టీపీసీసీకి ముందస్తు సమాచారం ఉందని, మిగిలిన అంశాల్లో ఏఐసీసీ నిర్ణయం తీసుకుని టీపీసీసీకి చేరవేసిందనే చర్చ జరుగుతోంది.

ఎందుకిలా?

రాష్ట్ర వ్యవహారాలను పూర్తిగా అధిష్టానం టేకోవర్ చేయడంపై గాంధీభవన్ వర్గాల్లో పలురకాల చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర పార్టీ నేతల మధ్య పాతుకుపోయిన అనైక్యత ఇప్పట్లో సర్దుకునే అవకాశం లేదనే భావనతోనే ఏఐసీసీ రంగంలోకి దిగిందనే చర్చ జరుగుతోంది. ప్రతి చిన్న పరిణామంపైనా తీవ్రమైన విమర్శలు, ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అన్ని విషయాలపై హస్తినలో నిర్ణయం తీసుకున్న తర్వాతనే టీపీసీసీకి సమాచా రం ఇస్తున్నారని కొందరు విశ్లేషిస్తున్నారు.పార్టీలో గ్రూపు గొడవలు సహజమే అయినా ఎన్నడూ లేని విధంగా ఇవి తారస్థాయికి చేరాయని, ఎన్నికల్లో గెలుపు అంచనాలున్న పరిస్థితుల్లో తాము రంగంలోకి దిగడమే మంచిదనే నిర్ణయానికి అధిష్టానం వచ్చిందంటున్నారు. మరోవైపు రాష్ట్ర పార్టీలో జరుగుతున్న ప్రతి చిన్న పరిణామంపైనా ఢిల్లీకి నివేదికలు వెళ్తున్నాయని, ఈ నివేదికల నేపథ్యం కూడా ఏఐసీసీ ఆజమాయిషీకి కారణమని తెలుస్తోంది.

ర్యాలీలు.. సభలు

▶ మొదటి పేజీ తరువాయి

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశించారు.

3 లక్షల మందితో సోలాపూర్ సభ

ఈ నెలాఖరులో మహారాష్ట్రలోని సోలాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. సుమారు 3 లక్షల మందితో నిర్వహించే ఈ సభకు పార్టీ అధినేత, కె.చంద్రశేఖర్‌రావు హాజరవుతారు. వాస్తవానికి ఈ నెల మొదటి వారంలోనే అక్కడ సభ నిర్వహించాలని భావించినా చివరి వారానికి వాయిదా పడింది. సభ నిర్వహించే మైదానం ఎంపిక కోసం గత నెల 30న సోలాపూర్‌ను సందర్శించిన మంత్రి హరీశ్‌రావు, మరోమారు అక్కడ పర్యటించే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాగా బాల్‌కోటి మైదానం, ఈద్గా మైదానాల్లో ఏదో ఒకదానిని ఎంపిక చేసే అవకాశముందని తెలుస్తోంది. సభ నిర్వహణపై పార్టీ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు అక్కడి నేతలతో సమన్వయం చేస్తున్నారు.

త్వరలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ జాబితాను 25 రోజుల క్రితం ప్రకటించిన కేసీఆర్ వచ్చేనెల 16న వరంగల్‌లో బహిరంగ సభ ద్వారా అధికారికంగా ఎన్నికల శంఖం పూరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిపై కేసీఆర్ త్వరలోనే పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించే అవకాశముంది. సుమారు పది లక్షల మందితో నిర్వహించే ఈ బహిరంగ సభ వేదికగా పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను కేసీఆర్ ప్రకటిస్తారు.

ముఖ్య నేతలకు బుజ్జగింపు..

పార్టీలో తలెత్తిన అసమ్మతికి చెక్ పెడుతూనే నియోజకవర్గ స్థాయిలో అంతర్గత సమన్వయం సాధించేందుకు కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారు. అసమ్మతి నేతలను బుజ్జగించే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌లతో పాటు ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ వంటి కీలక నేతలకు అప్పగించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడం, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అభ్యర్థుల కార్యకలాపాల నిర్వహణ, పర్యవేక్షణ తదితరాల కోసం ఇన్‌చార్జీల నియామకంపై కసరత్తు జరుగుతోంది. పార్టీకి చెందిన ఎంపీలు, శాసనమండలి సభ్యులు, కొందరు జిల్లా పరి షత్, కార్పొరేషన్ చైర్మన్లకు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని కేసీఆర్ భావిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా నియమితులయ్యే నేతల జాబితాను ఈ నెల 20లోగా ప్రకటించే అవకాశముంది.

టీఎస్ ఎంసెట్-2023 బైపీసీ సీట్ల కేటాయింపు పూర్తి

సాక్షి, హైదరాబాద్: టీఎస్ఎంసెట్-2023 బైపీసీ స్ట్రీమ్ మొదటి విడత సీట్ల కేటాయింపు జాబితా సోమవారం విడుదలైంది. బీఫార్మసీ, ఫార్మా-డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 91,906 మంది అభ్యర్థులు ఎంసెట్-2023 బైపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించారు. తొలివిడత కౌన్సెలింగ్‌లో 18,230 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనలో పాల్గొనగా, 17,713 మంది అభ్యర్థులు ఆప్షన్లను ఇచ్చుకున్నారు. మొత్తం 5,77,647 ఆప్షన్లను అభ్యర్థులు ఎంపిక చేసుకున్నారు. మొత్తం 9,362 సీట్లు ఉండగా.. తొలివిడత కౌన్సెలింగ్‌లో 9,168 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఈ క్రమంలో తొలివిడత కౌన్సెలింగ్ అనంతరం వివిధ కళాశాలల్లో 194 సీట్లు మిగిలిపోయాయి. తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో 97.92 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని 80 కళాశాలల్లో తొలివిడత కౌన్సెలింగ్‌లో వందశాతం సీట్లు భర్తీ అయినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ తెలిపారు.

‘అగ్నిపథ్’తో దేశ భద్రతకు విఘాతం

టీపీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం దేశ భద్రతకు విఘాతం కలిగిస్తోందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సైనికోద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ..దేశం కోసం సైనికుడిగా పనిచేసినందుకు గర్వంగా ఉందని, ఇప్పుడు కాంగ్రెస్ సైనికుడిగా ఉన్నందుకు గర్విస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ సైనికుల శాఖను బలోపేతం చేయాలని, మాజీ సైనికుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, ఆలిండియా ఎక్స్‌సర్వీస్‌మెన్ సెల్ చైర్మన్ రోహిత్‌చౌదరి, రాష్ట్ర చైర్మన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, వరంగల్‌లో 17న ‘కౌశల్’ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న ఢిల్లీలో ప్రధాని మోదీ ‘పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన’ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ నేతలు ఈ కార్యక్రమ నిర్వహణ, చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఆగస్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో భాగంగా దీని గురించి మోదీ వివరించిన విషయం తెలిసిందే. ‘విశ్వకర్మ జయంతి’సందర్భంగా మోదీ ఈ నెల 17న ఈ పథకాన్ని ప్రారంభిస్తుండగా, అదేరోజు ప్రధాని మోదీ జన్మదినం కూడా కావడం గమనార్హం. ఈ సందర్భంగా హైదరాబాద్‌తో సహా వరంగల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీజేపీ ముఖ్యనేతలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీనేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి. టి.ఆచారి, బూరనర్సయ్య, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆలే భాస్కర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో హైదరాబాద్ విమోచన వేడుకలు

- ఈనెల 15 నుంచి 17 వరకు వివిధ కార్యక్రమాలు
- రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజనీ ప్రియ వెల్లడి




రాష్ట్రపతి నిలయంలో జరిగే కార్యక్రమం వివరాలు వెల్లడిస్తున్న రజనీప్రియ

సాక్షి, హైదరాబాద్/ రసూల్‌పురా: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలను తొలిసారిగా నిర్వహించనున్నట్టు రాష్ట్రపతి నిలయం మేనేజర్ డా.కే రజని ప్రియ తెలిపారు. సోమవారం రాష్ట్రపతి నిలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ విలీన ఘటనకు సాక్షిగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేసి ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు, పోటీలు, వేడుకలు నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. పాటలు పాడడం, క్విజ్, చిత్రలేఖనం, థియేటర్ ఆర్ట్స్ వంటి పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలు, పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు https://rb.nic.in/Rbnilayam/ లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులతోపాటు ఈ కార్యక్రమాలు చూసేందుకు సాధారణ ప్రజలు కూడా హాజరుకావచ్చన్నారు.

అద్దంకి దయాకర్‌కు రూ. 3 వేల జరిమానా

కోరిన పత్రాలు సమర్పించనందుకు హైకోర్టు చర్య



సాక్షి, హైదరాబాద్: తుంగతుర్తి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అద్దంకి దయాకర్‌కు హైకోర్టు రూ. 3 వేల జరిమానా విధించింది. ఆయన దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్(ఈపీ)లో అడిగిన పత్రాలను సమర్పించపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంది. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గ్యాదరి కిశోర్, కాంగ్రెస్ అభ్యర్థిగా అద్దంకి దయాకర్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో కిశోర్ విజయం సాధించారు. అయితే కిశోర్ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. అలాగే పోలైన ఓట్లు, ఈవీఎం, వీవీప్యాట్‌ల లెక్కల్లో తేడాలున్నాయని పేర్కొంటూ దయాకర్ 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. కిశోర్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేసి.. తనను శాసనసభ్యుడిగా ప్రకటించాలని రిటర్నింగ్ అధికారికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇటీవల ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎం.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టి.. 17-సీ(కౌంటింగ్ ఏజెంట్లకు ఇచ్చే కాపీలు), పోలింగ్ ఏజెంట్లకు ఇచ్చిన ఫామ్‌లను అందజేయాలని దయాకర్‌ను ఆదేశించింది. విచారణలో కీలకం కానున్న ఈ పత్రాల సమర్పణకు సమయం ఇచ్చినా అందజేయకపోవడాన్ని సోమవారం న్యాయమూర్తి తప్పుపట్టారు. దీంతో జరిమానా విధిస్తూ, విచారణను 13వ తేదీకి వాయిదా వేశారు.

పీఆర్సీని తక్షణమే ఏర్పాటు చేయాలి

సాక్షి, హైదరాబాద్: వేతన సవరణ సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసిన సంఘ నేతలు వినతిపత్రాన్ని అందించారు. గతేడాది జులై ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం రావాలని, మూడు విడతలుగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవీంద్రకుమార్, సి.హరీశ్‌కుమార్ తదితరులు సీఎస్‌ను కోరారు.

కేసీఆర్ సర్కారుకు బీజేపీ బుద్ధి చెప్పడం ఖాయం

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే స్కీమ్స్ తెస్తున్న కేసీఆర్ సర్కారుకు బీజేపీ బుద్ధి చెప్పడం ఖాయమని పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా హెచ్చరించారు. సోమవారం బాషా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, ఇతరవర్గాల ప్రజలను వివిధ పథకాల పేరుతో ప్రభుత్వం నిరంతరం మోసం చేస్తుంటే బీజేపీ తప్ప మరేపార్టీ నోరుమెదపడం లేదన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లో నిర్వహిస్తున్న బీజేపీ ఎస్సీమోర్చా మండల అధ్యక్షుల రాష్ట్రస్థాయి సమావేశంలో వివిధ అంశాలపై ఆందోళన కార్యక్రమాలను ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ భూములు పంచితే.. బీఆర్ఎస్ అమ్మేస్తోంది

కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, కోదండరాం

సాక్షి, హైదరాబాద్: పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ భూములను పంచితే, తెలంగాణ ఏర్పాటయ్యాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, ఎం. కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేవలం భూస్వాములు, కార్పొరేట్లకు మాత్రమే ఈ ప్రభుత్వం ఉపయోగపడుతోందని, పేదలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ సమావేశాలు ముగిసిన తర్వాత అన్ని పార్టీలతో మాట్లాడి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

చివరి నెల వేతనం హుళక్కే!

- ఆర్టీసీలో రిటైరయ్యే నెల జీతం ఎగవేత
- లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలు కూడా ఇవ్వట్లే
- ఏడాదిగా సతమతమవుతున్న రిటైర్డ్ సిబ్బంది



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో అందించే బెనిఫిట్స్ పూర్తిగా ఇవ్వకుండా ఆర్టీసీ కోత పెడుతోంది. గతేడాది సెప్టెంబరు వరకు పద్ధతిగానే చెల్లింపులు జరిగినా, ఆ తర్వాత నుంచి కొన్ని బెనిఫిట్స్ ఇవ్వకుండా ఎగ్గొడుతోంది. దీంతో గత సెప్టెంబరు తర్వాత పదవీ విరమణ పొందిన వారంతా వాటి కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయబోతున్న నేపథ్యంలో, బకాయిలను చెల్లించిన తర్వాతే విలీనం చేయాలని వారంటున్నారు. లేకపోతే తాము నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఆ నాలుగింటిలో కోత..

ఆర్టీసీ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన వెంటనే, సంస్థ నుంచి వారికి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అప్పటికప్పుడు చెల్లించే ఆనవాయితీ ఉండేది. కొన్నేళ్లుగా ఆర్టీసీ తీవ్ర నష్టాల్లో ఉండటంతో ఈ చెల్లింపుల్లో జాప్యం జరుగుతూ వచ్చింది. ఏడాదిగా కొన్నింటిని నిలిపేసి మిగతావి చెల్లించే విచిత్ర పద్ధతి ప్రారంభమైంది. పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్బీటీ, గ్రాట్యుటీ లాంటి వాటిని చెల్లిస్తున్నా... నాలుగింటి విషయంలో కోత తప్పటం లేదు.

- వేతన సవరణ బాండ్లు: 2013లో ఆర్టీసీ వేతన సవరణ జరగాల్సి ఉండగా, రాష్ట్రం విడిపోయాక దాన్ని 2015లో అమలు చేశారు. ఆ సమయంలో బకాయిలను సగం నగదు రూపంలో, మిగతా సగం బాండ్ల రూపంలో చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ బాండ్ల రూపంలో చెల్లించే మొత్తాన్ని పదవీ విరమణ సమయంలో ముట్టచెబుతూ వస్తున్నారు. గతేడాది సెప్టెంబరు నుంచి వీటిని చెల్లించడం లేదు.
- లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్: గరిష్ఠంగా 300 వరకు ఆర్జిత సెలవుల మొత్తాన్ని పదవీ విరమణ సమయంలో చెల్లించటం ఆనవాయితీ. డ్రైవర్, కండక్టర్లకు రూ.4–5 లక్షల వరకు, అధికారులకైతే వారి స్థాయినిబట్టి రూ.10–15 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని కూడా ఏడాదిగా చెల్లించకుండా పెండింగులో పెట్టారు.
- చివరి నెల వేతనం: పదవీ విరమణ పొందిన నెలకు సంబంధించిన వేతనాన్ని కాస్త ఆలస్యంగా అందిస్తారు. ఏ రూపంలోనైనా సంస్థకు అతను చెల్లించాల్సిన మొత్తం ఏమైనా ఉంటే అందులో నుంచి మినహాయించి మిగతాది ఇస్తారు. ఈ లెక్కలు చూసేందుకు నాలుగైదు రోజుల సమయం తీసుకుని, రిటైరైన వారంలోపు చెల్లించేవారు. ఇప్పుడు దాన్నీ ఆపేశారు.
- కరువు భత్యం బకాయిలు: కొన్నేళ్లుగా డీఏలు సకాలంలో చెల్లించటం లేదు. దాదాపు 8 డీఏలు పేరుకుపోయాయి. వాటిని గత కొన్ని నెలల్లో క్లియర్ చేశారు. ఆ డీఏ చెల్లించాల్సిన కాలానికి ఉద్యోగి సర్వీసులోనే ఉన్నా, ఆలస్యంగా దాన్ని చెల్లించే నాటికి కొందరు రిటైర్ అవుతున్నారు. ఇలా ఆలస్యంగా చెల్లిస్తున్న వాటిని... సర్వీసులో ఉన్న వారికి మాత్రమే ఇస్తున్నారు, కానీ రిటైరైన వారికి ఇవ్వడం లేదు.

ఇక సీసీఎస్ మాటేమిటి?

ఆర్టీసీ ఉద్యోగుల సహకార పరపతి సంఘం (సీసీఎస్) నిధులను ఆర్టీసీ వాడేసుకుని వడ్డీతో కలిపి రూ.వేయి కోట్లు బకాయి పడింది. కార్మికుల వేతనం నుంచి ప్రతినెలా నిర్ధారిత మొత్తం కోత పెట్టి సీసీఎస్‌లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. ఆ మొత్తాన్ని రిటైరైన వెంటనే చెల్లించాలి. కార్మికులు వాటిని డిపాజిట్లుగా సీసీఎస్‌లో అలాగే ఉంచితే దానిపై వడ్డీ చెల్లించాలి. ఇదంతా సీసీఎస్ పాలక మండలి చూస్తుంది. కానీ, ఆ నిధులు ఆర్టీసీ వాడేసుకుని ఖాళీ చేయటంతో రిటైరైన వారికి చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. సర్వీసులో ఉన్న వారు వారి అవసరాలకు తీసుకుందామన్నా ఇవ్వటం లేదు. ఇది పదవీ విరమణ పొందిన వారితోపాటు సర్వీసులో ఉన్న వారికీ సంబంధించిన సమస్య.

నేడు గవర్నర్‌తో ఆర్టీసీ జేఏసీ భేటీ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి సంబంధించిన బిల్లుపై చర్చించేందుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో మంగళవారం ఉదయం 8 గంటలకు ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ భేటీ కానుంది. కొద్దిరోజుల క్రితమే సచివాలయం నుంచి బిల్లు రాజ్‌భవన్‌కు చేరిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఇటీవలే గవర్నర్ ప్రకటించారు. అసెంబ్లీ ఆమోదం పొంది నెలపైనే గడిచినందున వీలైనంత తొందరలో బిల్లు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి ఆమోదించి పంపాలని జేఏసీ కోరనుందని జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి తెలిపారు. దీంతోపాటు ప్రభుత్వంలో విలీనం కంటే ముందే ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అంశాలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కూడా వారు కోరనున్నట్టు తెలిసింది. రెండు వేతన సవరణలుసహా మొత్తం 30 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని గవర్నర్‌కు సమర్పించనున్నారు.

‘గాంధీ’లో ర్యాగింగ్‌కు పాల్పడిన 10 మంది ఎంబీబీఎస్ విద్యార్థులపై వేటు

- ఏడాదిపాటు సస్పెండ్ చేసిన డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి
- ఆపై ఏడాది కాలేజీలో చేరినా, వారికెవరికీ హాస్టల్ వసతి సౌకర్యం ఉండదని స్పష్టీకరణ



డీఎంఈ రమేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆస్పత్రి: ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థులపై వేటు పడింది. హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులను ర్యాగింగ్ చేశారని తేలడంతో 10 మంది సీనియర్ విద్యార్థులను ఏడాదిపాటు కాలేజీ నుంచి సస్పెండ్ చేశారు. వారిని హాస్టల్ నుంచి కూడా తొలగించారు. ఈ మేరకు వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆ వివరాలు వెల్లడించారు. ఇటీవల కొత్తగా ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులను రెండు, మూడో ఏడాది చదివే కొందరు ఎంబీబీఎస్ విద్యార్థులు ర్యాగింగ్ చేసినట్టు నిర్ధారణ అయ్యింది. యూజీసీ ఆధ్వర్యంలోని యాంటీ ర్యాగింగ్ సెల్‌కు కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో యూజీసీ నుంచి కూడా ర్యాగింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి ఆదేశాలు వచ్చాయి. మరోవైపు స్థానిక పోలీసులూ సమాచారం అందించారు. దీంతో తక్షణమే ర్యాగింగ్‌కు పాల్పడిన 10 మంది విద్యార్థులను సస్పెండ్ చేశారు. దీంతో వారు ఏడాదిపాటు కోర్సుకు దూరం కావాల్సి ఉంటుంది. ర్యాగింగ్‌కు పాల్పడొద్దని అన్ని తరగతుల విద్యార్థులను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. చర్యలు తీసుకుంటే భవిష్యత్ పోతుందని కూడా హెచ్చరించారు. అయినా కొందరు సీనియర్లు కొత్తగా చేరిన ఎంబీబీఎస్ విద్యార్థులను అర్ధరాత్రి రెండు గంటలకు తమ గదులకు పిలిపించి మానసికంగా వేధించడం, బూతులు తిట్టడంతోపాటు డ్యాన్స్‌లు చేయించారు. భౌతికంగా దాడులు జరిగాయా లేదా అన్నదానిపై స్పష్టత లేదని సమాచారం. దీంతో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఈ సంఘటనపై విచారణ జరిపి 10 మంది సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్టు గుర్తించింది. వారి సస్పెండ్ కాలం పూర్తయిన తర్వాత వచ్చే ఏడాది మళ్లీ కాలేజీలో చేరినా, హాస్టల్ వసతి మాత్రం కల్పించబోమని డీఎంఈ స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కాలేజీ నుంచి తీసేయాలన్న నిబంధనలు ఉన్నాయని, కానీ తాము వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఏడాదిపాటు సస్పెండ్ వరకే పరిమితమయ్యామని వెల్లడించారు. ఇంకా ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే ర్యాగింగ్ నిరోధక నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వివిధ మెడికల్ కాలేజీల్లోని విద్యార్థులందరినీ ఆయన హెచ్చరించారు.

మేనేజ్‌మెంట్ వైద్య సీట్లకు మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

రేపు, ఎల్లుండి నమోదుకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో అడ్మిషన్ల నిమిత్తం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేందుకు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వాస్తవంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒకసారి మాత్రమే చేసుకోవాలి. ఆ తర్వాత విడతలవారీగా ఆప్షన్లు పెట్టుకోవచ్చు. అయితే కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో సోమవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు, ధ్రువపత్రాల అప్‌లోడ్ బుధ, గురువారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చేసుకోవచ్చని తెలిపింది. మేనేజ్‌మెంట్ కోటా కింద గతంలో నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ నమోదు చేసుకోవడానికి అర్హులు కాదని స్పష్టం చేసింది. ఇప్పటికే ఎంబీబీఎస్ మేనేజ్‌మెంట్ కోటా బీ–కేటగిరీకి నమోదు చేసుకున్న అభ్యర్థులు ఎన్ఆర్ఐ కేటగిరీలో పరిగణించాలనుకుంటే తమ వివరాలను knrugadmission@gmail.comని సమర్పించవచ్చు. పీజీ కోసమైతే knrpgadmission2023@gmail.com మెయిల్‌కు సమర్పించవచ్చు.

కొత్త మెడికల్ కాలేజీల్లో 85% సీట్లు స్థానికులకే..

▶ మొదటి పేజీ తరువాయి



ధర్మాసనం గతంలో విచారణ చేపట్టింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రిజర్వేషన్లను పదేళ్లపాటు కొనసాగించాలని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. ఆ సమయం ముగిసే వరకు ఎలాంటి మార్పులు చేయడానికి వీల్లేదన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు 15 శాతం కోటాను తప్పనిసరిగా కొనసాగించాల్సిందేనని చెప్పారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదిస్తూ.. ‘రాష్ట్ర విభజన నాటికి 20 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. 2,850 సీట్లలో 15 శాతం కింద 313 సీట్లను కేటాయించాం. 2019లో నీట్ అమల్లోకి వచ్చాక.. జాతీయ కోటా కింద 540 సీట్లను రిజర్వు చేశాం. మొత్తం ఈ 853 సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఉంటుంది. పునర్విభజన తర్వాత వచ్చిన 34 కాలేజీల్లో వారికి ప్రత్యేక రిజర్వేషన్ లేదు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం కాదు’ అని వివరించారు.

ఎన్‌సీసీ కోటాపై...

తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్–2017లోని రూల్ 4(3)(ఏ)లో మార్పులు చేస్తూ జూలై 4న ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 75 సమర్థనీయమేనని హైకోర్టు స్పష్టం చేసింది. కౌన్సెలింగ్‌లో గతంలో నేషనల్ కేడెట్ కోర్ (ఎన్‌సీసీ)కు 1 శాతం రిజర్వేషన్ ఉండేది. ఈ జీవో కారణంగా ఎన్‌సీసీ (ఏ) ఉన్న వారికి రావాల్సిన 1 శాతం కోటా పోతోందని హైదరాబాద్‌కు చెందిన లోకాస్వీ సహా మరికొందరు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ, పిటిషన్లను కొట్టివేసింది.

అటవీ అమరవీరుల కుటుంబాలకు అండ

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బహదూర్‌పురా: విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ హామీనిచ్చారు. అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తుందని భరోసానిచ్చారు. సోమవారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్కు స్మారక చిహ్నం వద్ద మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులు, సిబ్బందితో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విధి నిర్వహణలో అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలను వృథా కానివ్వకుండా వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం.డోబ్రియాల్, వన్యప్రాణుల ముఖ్య సంరక్షణ అధికారి లోకేశ్ జైశ్వాల్, వీసీ అండ్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జూపార్కు డైరెక్టర్ ప్రసాద్, క్యూరేటర్ సునీల్ హీరమత్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఓ ప్రకటనలో శ్రద్ధాంజలి ఘటించారు.

స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం కాకుండా చూడండి: టీఎస్ఎస్‌టీపీ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్‌టీపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.శేఖర్, ఎస్.సక్కుబాయి పాఠశాల విద్యాశాఖను కోరారు. ఈ మేరకు సోమవారం పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకుడు కే.లింగయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు మెరిట్ కమ్ జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. 2018లో జరిగిన బదిలీ ప్రక్రియలో స్పౌజ్ పాయింట్లు వినియోగించుకున్న వారి జాబితాను జిల్లాల వారీగా ప్రదర్శించాలని కోరారు.

ఉద్యోగాల భర్తీపై రేపు దీక్ష: లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ఈ నెల 13న ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో 24 గంటల దీక్ష చేపట్టనున్నట్లు ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. పెద్ద సంఖ్యలో యువత హాజరు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి బాకీ పడిందని ఆరోపించారు. 17న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని పేదప్రజలకు కానుకగా ఇవ్వనున్నారని ఈ నేపథ్యంలో ‘ధన్యవాద్ మోదీజీ’ పేరుతో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు.


‘పాలమూరు’కు అడ్డుపడినట్లు నిరూపిస్తే గొంతు కోసుకుంటా..

మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులను తాను అడ్డుకున్నట్లు నిరూపిస్తే గొంతు కోసుకుంటానని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో సీఎం కేసీఆర్ చేస్తున్న అవినీతినే ప్రశ్నించానని చెప్పారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టులో మోటార్ల పేరిట జరిగిన రూ.5,584 కోట్ల అవినీతిని బయటపెట్టేందుకే కోర్టులో కేసు వేశానని, కాగ్ సైతం ఇదే విషయాన్ని వెల్లడించిందని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఆలస్యానికి సీఎం కేసీఆరే కారణమని ఆరోపించారు. పొలాలకు నీరందించినప్పుడు ప్రారంభోత్సవాలు చేస్తారని, ఇప్పుడు సీఎం చేస్తున్న ప్రారంభోత్సవం ఉత్తిత్తుదేనని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కింద ఇప్పటివరకు కాల్వల నిర్మాణమే చేపట్టలేదని, కొన్ని చోట్ల భూసేకరణ పూర్తికాలేదని దుయ్యబట్టారు. కృష్ణానదిపై జూరాల వద్ద 4 మోటార్లను ఏర్పాటు చేస్తే రోజుకు కనీసం 2 టీఎంసీల చొప్పున 50 రోజులపాటు అదనంగా వంద టీఎంసీల నీరు తెలంగాణకు దక్కుతుందన్నారు.







మీ జీవితంలోని సంతోషం...
మీ ఆలోచనల నాణ్యత మీద ఆధారపడి ఉంటుంది.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 12 సెప్టెంబర్ 2023

మనం సక్సెసే కానీ...

రష్యా అధ్యక్షుడు లేడు. చైనా అధినేత రాలేదు. ఉక్రెయిన్‌పై సాగుతున్న రష్యా యుద్ధంపై సభ్య దేశాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక్కముక్కలో జీ20లో దేశాలు ఏకాభిప్రాయంతో కానీ, ఏక లక్ష్యంతో కానీ ఉన్నట్టు కనిపించదు. అయినా సరే, ఆదివారం ఢిల్లీలో ముగిసిన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సును ఘనంగా నిర్వహించి, అన్ని దేశాల తరఫునా ఎవరినీ నొప్పించని 83 పేరాల ఏకాభిప్రాయ ప్రకటన, అదీ ఒకరోజు ముందరే చేయించడమనేది అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్‌కు అసాధారణ విజయమే! దక్షిణార్ధగోళంలోని వర్ధమాన, పేదదేశాల పక్షాన నిలబడి, వాటి ప్రయోజనాల్ని సదస్సు అజెండాలో మేళవింపజేయడమూ సామాన్యం కాదు. అలాగే బాలీలో నిరుడు అంగీకరించినదే అయినా, ఆఫ్రికన్ యూనియన్ (ఏయూ)కు జీ20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వడం ద్వారా దక్షిణార్ధగోళానికి తాను సరైన ప్రతినిధినని భారత్ చాటుకున్నట్టయింది. అందుకే, వంతుల వారీగా ఏడాదికొకరికి వచ్చే అధ్యక్షహోదాయే అయినా... జీ20 సారథిగా భారత్ సక్సెస్ కావడం, ప్రపంచ వేదికలో మరో మెట్టు పైకి ఎక్కడం కచ్చితంగా సంతోషించదగ్గ సమయం, సందర్భం.

జీ20 సదస్సు ముగింపు వేళ చేసిన ఏకాభిప్రాయ ప్రకటనపై కొన్ని అసంతృప్తులూ లేకపోలేదు. ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంపై పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్న రీతిలో రష్యాను నిలదీయలేదనీ, నిరుటి బాలీ డిక్లరేషన్ నుంచి పక్కకు జరిగారనీ ఒక వర్గపు అసంతృప్తి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశల వారీగా మానుకోవడంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం స్థిరసంకల్పం, చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తోందన్నది మరో ప్రధానమైన అసంతృప్తి. జీ20 సదస్సులు ఆ యా ఆతిథ్య దేశాల ఘనత చాటుకోవడానికే తప్ప, అసలు పనిలో తూతూమంత్రంగా మారాయనే నింద కొంత కాలంగా ఉన్నదే. అది నిజం కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత జీ20 వేదికదే! తాజా జీ20లోనూ ప్రకటించిన లక్ష్యాలు బలహీనంగా ఉన్నాయనీ, ఇప్పటికే తాము కట్టుబడిన లక్ష్యాలనే దేశాధినేతలు వల్లెవేశారని విశ్లేషకుల మాట. వెరసి, నిర్వహణలో పేరుప్రఖ్యాతులతో ఇండియా హిట్టే కానీ, కీలక ప్రపంచ సమస్యలపై నిర్ణయంలోనే సదస్సు విఫలమైందనే మాట మిగిలిపోయింది.

చర్చించడానికి ఆహారభద్రత, ఋణాల ఉపశమనం, పర్యావరణ సంక్షోభం, వ్యాధులు, బ్యాంకింగ్ సంస్కరణలు, డిజిటల్ ప్రాథమిక వసతుల లాంటి అనేక ప్రపంచ సమస్యలున్నాయి. కానీ, వాటి పరిష్కారానికి అందరికీ అంగీకారయోగ్యమైన, విశ్వసనీయ కార్యాచరణ జీ20లో లోపించింది. పరస్పర భిన్నమైన 20 దేశాలు సమష్టి ఆశయాలు, ఆలోచనలు, అనుభవాల పునాదిపై కాక ఆర్థిక బలిమి ప్రాతిపదికన ఇలా ఒక వేదికపై చేరడమే అసలు చిక్కు. అందుకే, రానురానూ జీ20 వార్షిక సదస్సు ఫలితాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. నిరుటి బాలీ సదస్సుతో పోలిస్తే తాజా సదస్సులో అగ్ర దేశాల మధ్య చీలికలు పెరిగాయి. దానివల్ల సదస్సు ప్రధాన అజెండా పట్టాలు తప్పకుండా భారత్ సంక్లిష్ట దౌత్యవిన్యాసంతో సమతూకం సాధించడం విశేషం. అలాగే, ఉక్రెయిన్ వ్యవహారంలో రష్యాపై ఆంక్షల లాంటివి సమర్థించడంలో దక్షిణార్ధగోళానికి సమస్యలున్నాయని పాశ్చాత్య ప్రపంచం గుర్తించింది. అందుకే, ఆ అంశంపైనే పట్టుబట్టి కూర్చోలేదు. రష్యా కన్నా చైనాతో పెను ముప్పు అని గ్రహించిన అమెరికా చివరకు దక్షిణార్ధగోళ దేశాల మాట ఆలకించేందుకు భారత్‌తో నడిచింది.

నిజానికి, వరుస ప్రకారమైతే జీ20 సదస్సు మన దేశంలో 2022లో, ఇండొనేషియాలో 2023లో జరగాలి. కానీ, ఇండొనేషియాను మన పాలకులు మెత్తగా ఒప్పించి, ఢిల్లీ స్థానంలో ముందుగా బాలీలో సదస్సు జరిపించారు. సార్వత్రిక ఎన్నికలకు వీలైనంత దగ్గరగా, ఈ ఏడాది మన వద్ద ఈ అంతర్జాతీయ సంబరం జరిగేలా చూడగలిగారు. అదెలా ఉన్నా ఈ సదస్సును దేశానికి గర్వకారణంగా చూపి, సానుకూల ఫలితాల దిశగా మలుచుకోవడంలో మనవాళ్ళు సఫలమయ్యారు. ఏడాది కాలంలో కేంద్ర పాలకులు దేశవ్యాప్తంగా 60కి పైగా పట్నాల్లో, 200కు పైగా సమావేశాలు జరిపారు. సాధారణంగా సామాన్యులకు సంబంధం లేని వ్యవహారంగా అనిపించే సదస్సును సైతం తెలివిగా ప్రజల్లోకి తీసుకువెళ్ళారు. ఈ సదస్సు విజయాన్ని వచ్చే ఎన్నికల్లో సహజంగానే మరింత వాడుకుంటారు. అయితే, సహకార సమాఖ్య విధానాన్నీ, ప్రత్యర్థి పక్షాల మధ్య ద్వైపాక్షికతనూ నమ్మడం వల్లే ఈ సదస్సు ఘనత సాధ్యమైందని సర్కారు వారి మాట. దేశంలోని ప్రతిపక్షాలను కలుపుకొనిపోని వారి నోట ఈ మాట రావడం విడ్డూరమే. సహకార సమాఖ్య లాంటివి పెద్దలు నిజంగా నమ్ముతున్నదీ లేనిదీ నవంబర్ చివర 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ నియామకం, సంఘం నియమావళి ఖరారు వేళ తెలుస్తుంది.

ఏమైనా, ఐరాస సర్వప్రతినిధి సభ దాదాపు అచేతనంగా మారిన పరిస్థితుల్లో జీ20 మరింత చొరవ తీసుకోవాలని పరిశీలకుల భావన. అందుకే, ఉక్రెయిన్ యుద్ధ సమస్యలు, పర్యావరణ సంక్షోభానికి కారణమైన శిలాజ ఇంధనాలపై చర్యలు చర్చించకుండానే సదస్సు ముగిసిపోవడంతో నిరుత్సాహపడుతున్నారు. కానీ, సభ్యదేశాల మధ్య సంక్లిష్టతలతో ఆ ఘనత ఒక్క భారత్ చేతుల్లోనూ లేదని గ్రహించాలి. మొత్తం 19 దేశాలు, యూరోపియన్ యూనియన్‌తో కూడిన జీ20 తాజా ఆఫ్రికన్ యూనియన్ చేరికతో వచ్చే 2024లో బ్రెజిల్ సదస్సు నాటికి జీ21గా పలకరించనుంది. ఆపై ఏడాది దక్షిణాఫ్రికాలో సమావేశం కానుంది. భారత్ అధ్యక్షతన సాధించిన పురోగతిని ముందుకు తీసుకువెళ్ళడానికే కాదు, అంతర్జాతీయంగా జీ20 ప్రాసంగికతను నిలపడానికీ ఆ రెండు సదస్సులూ కీలకం. ఇప్పటికైతే, ఇండొనేసియా, జర్మనీల కన్నా అనేక రెట్ల ఖర్చుతో ఢిల్లీ సదస్సు జరిగిందని ఆరోపణలు వస్తున్నప్పటికీ, 'విశ్వగురువు' ప్రచారం మరింత ఊపందుకున్నందుకు సంబరపడాలి.

నాటకీయత లేని యాక్షన్ సినిమా

కామెంట్



కరణ్ థాపర్


ఒక దౌత్యవేత్త జీవితంలోని ఘటనలు పూర్తిస్థాయి యాక్షన్ సినిమాకేమీ తీసిపోవు. ముఖ్యంగా ఆయన లెబనాన్ అంతర్యుద్ధ కాలంలో చురుగ్గా ఉన్నవాడూ; మాజీ ప్రధానులు బేనజీర్ భుట్టో, రాజీవ్ గాంధీ మధ్య రహస్య సందేశాల వినిమయానికి తోడ్పడ్డవాడూ అయినప్పుడు! అందుకే 'ఎ డిప్లొమాట్స్ గార్డెన్' పుస్తకం ఉద్రూతలూగిస్తుందనుకుంటాం. కానీ విషయ తీవ్రత ఎలాంటిదైనా, చలిమంట కాచుకుంటూ, నింపాదిగా మాట్లాడే శైలి ఆఫ్తాబ్ సేఠ్‌ది. ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు దశాబ్దాల పాటు నివేదికలను డిక్టేటు చేసిన ప్రభావం ఆయన శైలిలో స్పష్టంగా కనబడుతుంది. దౌత్యవేత్తగా ఆయన మనసు ఎప్పుడూ నాటకీయతను శూన్యం చేయడంపైనే ఉంటుందని ఈ పుస్తకం చెబుతుంది.

ఒక భారతీయ దౌత్యవేత్త జీవితం ఎలా ఉంటుందోనని మీకు ఎప్పుడైనా అనిపించి ఉంటే, ఒక్కసారి ఆఫ్తాబ్ సేఠ్ జ్ఞాపకాల్లోకి తొంగిచూడండి. లెబనాన్ అంతర్యుద్ధ కాలంలో ఆయన చురుగ్గా ఉన్నారు, పాకిస్తాన్ మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో, భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మధ్య రహస్య సందేశాల వినిమయానికి తోడ్పడ్డారు. అంతేనా? జపాన్ రాజ కుటుంబంతో విందులారగించడం మొదలుకొని, మంచానపడ్డ గ్రీకు ప్రధాన మంత్రులను ఆసుపత్రుల్లో పలకరించడం, మయన్మార్ విప్లవ నేత ఆంగ్‌సాన్ సూకీ దివంగత భర్త మైకేల్ ఆరిస్‌తో కలిసి కుట్రలు పన్నడం వరకూ దౌత్యవేత్తగా ఆఫ్తాబ్ చేసిన పనులు ఎన్నో!


ఈ ఘటనలన్నీ పూర్తిస్థాయి యాక్షన్ సినిమాకేమీ తీసిపోవు. బహుశా ఇవి ఆయన 'అడ్రినలిన్'ను ఎప్పుడూ పైపైకి ఎగబాకించి ఉంటాయి కూడా. కానీ సుశిక్షితుడైన దౌత్యవేత్తగా ఆఫ్తాబ్ రాసిన 'ఎ డిప్లొమాట్స్ గార్డెన్' పుస్తకం ఇలాంటి గాథలను పల్లెసీమల రోడ్ల మీద తిరిగే కారు వేగంలా నెమ్మదిగా వివరిస్తుంది. విషయం చాలా గొప్పది కావచ్చు కానీ చెప్పే శైలి మాత్రం ఆచితూచి, ప్రశాంతంగా ఉంటుంది. విషయ తీవ్రత ఎంత ఉన్నా, చలిమంట కాచుకుంటూ, నింపాదిగా నోట్లోని చుట్టతో పొగలు ఊదుకుంటూ, దేనికీ చలించని వ్యక్తిగా ఆఫ్తాబ్‌ను మనం ఊహించుకోవచ్చు.

పుస్తకంలోని చాలా వాక్యాలు 'ఒకసారి గుర్తు చేసుకుంటే', 'గుర్తుంచుకోవాల్సిన అంశం', 'ఇంతకుముందే చెప్పినట్లు', 'దీని గురించి క్లుప్తంగా చెప్పుకుని' వంటి పదబంధాలతో మొదలవుతాయి. 'దీని వివరాలు మనల్ని నిలిపి ఉంచకూడదు' అన్నదీ తరచుగా కనిపిస్తుంది. కొన్నిసార్లు అధ్యాయాల మధ్యలో 'ఇప్పుడు మనం అసలు కథలోకి వెళితే' అని ఉంటుంది. దశాబ్దాలపాటు ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నివేదికలను డిక్టేటు చేసిన ప్రభావం స్పష్టంగా కనబడుతుంది.

కానీ తలుచుకుంటే ఆఫ్తాబ్ సేఠ్ భాష గాల్లోకి లేస్తుంది, ఆయన విశేషణాలు ఆకాశాన్ని అంటుతాయి. ''భయంకరమైన తరచుదనంతో కాండ్రించి ఉమ్మడం ఆయనకున్న ఒకానొక ఇబ్బందికరమైన అలవాటు. అదృష్టం ఏమిటంటే, ఆ ఉమ్మడమేదో తన కుర్చీ దగ్గరగానే పెట్టుకున్న ఉమ్మితొట్టెలోకి పడేలా చాకచక్యంగా ఊసేవాడు.'' సేఠ్ భాషకు మచ్చుకు ఒక ఉదాహరణ ఇది. జాగ్రత్తగా తూచినట్టుండే ఆయన శైలి అప్పటికి ఆదరణీయం కాకపోయినా, ఆయన చేసిన పనులు, కలిసిన మనుషుల గురించి తెలిస్తే మాత్రం సంబరపడేన్ని కథలు ఉన్నాయనిపిస్తుంది.



బేనజీర్ భుట్టో, రాజీవ్ గాంధీ



చిన్న ఉదాహరణ చూద్దాం. లెబనాన్ అంతర్యుద్ధం తీవ్రంగా జరుగుతున్న కాలంలో ఆఫ్తాబ్ బీరూట్‌లో ఉన్నారు. ఒక పక్క బాంబుల వర్షం, ఇంకోపక్క కుప్పకూలుతున్న భవనాలు... వీటన్నింటి మధ్యలో సేఠ్ తన ఫ్లాట్ ముంగిట్లో నిద్రపోయారట. పడే బాంబు ఏదో నేరుగా భవనం మీద పడవచ్చునన్న అంచనాతో! వాళ్ల డ్రైవర్ అలీ ''కదులుతున్న దేనిమీదికైనా విచ్చలవిడిగా దూసుకొస్తున్న తుపాకీ గుళ్ల నుంచి తప్పించేందుకు కారును వాయువేగంతో ముందుకు ఉరికించాడు.''

ఆఫ్తాబ్ భార్య పోలా అప్పుడు రెండోసారి గర్భవతిగా ఉన్నారు. పురిటినొప్పులు తెల్లవారుఝామున మూడు గంటల సమయంలో మొదలయ్యాయి. ఆ సమయంలో ఆంబులెన్స్ కూడా అందుబాటులో లేదు. తానే సొంతంగా కాన్పు చేసేందుకు కూడా సేఠ్ సిద్ధమయ్యారు. అయితే, అదృష్టవశాత్తూ ఆ అవసరం రాలేదు.

ఈ పుస్తకం మొత్తం ఉత్కంఠభరితంగా ఉంటుంది కానీ ఈ విషయాలన్నీ చెప్పే విషయంలో ఆఫ్తాబ్ చాలా డిప్లొమాటిక్‌గా వ్యవహరించారని చెప్పాలి. బేనజీర్ భుట్టో విషయాలు చెప్పేటప్పుడు ఆయనెంత జాగ్రత్తగా వ్యవహరించారన్నది స్పష్టంగా తెలుస్తుంది. బేనజీర్ ఓ అద్భుతమైన వ్యక్తి. ఆమె గురించి ఆఫ్తాబ్‌కూ బాగా తెలుసు. కరాచీ, లార్కానాల్లోని భుట్టో ఇళ్లకు ఆయన వెళ్లేవారు. అలాగే మలేసియా, న్యూఢిల్లీల్లోని హోటళ్లలోనూ సమావేశాలు, చర్చలు నడిచేవి. రాజీవ్ గాంధీ నుంచి వచ్చే రహస్య సందేశాలు ఇలాంటి సమావేశాల్లోనే చేతులు మారేవి. కానీ ఈ సందేశాల గురించి ఆయన మనోహరమైన మౌనం పాటిస్తారు.

ఈ అధ్యాయం ఎంత అద్భుతంగా మారి ఉండేది! కానీ ఏం చేస్తాం? తన వజ్రాలను సానపెట్టడం కాకుండా, వాటిని ఇలాంటి వాక్యాలతో రాళ్లలా మార్చేశారు. ''మాజీ ప్రధాని వ్యక్తిత్వం గురించి తమకు తెలిసిన అరుదైన విషయాలను రోషన్(ఆఫ్తాబ్ సోదరుడు)తో భుట్టోలు పంచుకున్నారు'' అని రాస్తారు. కానీ ఆ విషయాలు ఏమిటో వెల్లడించరు.

బేనజీర్‌తో జరిగిన ఒక సమావేశం గురించి ఆయన రాశారు. ఇందులో బేనజీర్ మిలిటరీ కార్యదర్శి ఆ సమావేశాన్ని అడ్డుకునేందుకు ''తప్పుడు ఆఫ్తాబ్'' గురించి చెబుతారు. ప్రతిగా బేనజీర్ ''రహస్యంగా వినే మైక్రోఫోన్లను గందరగోళ పరిచేందుకు రేడియో సౌండ్ పెంచారు'' అని రాశారు. దౌత్యవేత్తగా ఆయన మనసు నాటకీయతను సున్నా చేయడంపైనే ఉంటుంది. ''నింపాదిగా భోంచేస్తూ పాకిస్తాన్ స్థానిక రాజకీయ పరిస్థితిపై కూడా చర్చించాము'' అని రాయడం ఇలాంటిదే.

అదృష్టం ఏమిటంటే, కొన్ని సందర్భాల్లో ఆఫ్తాబ్ విచక్షణకు కాకుండా, ధైర్యానికి ప్రాధాన్యం ఇవ్వడం. ఇలాంటి సందర్భాల్లోనే నియంత్రణలో నడిపే ఆయన వాక్యాలు సంకెళ్ల నుంచి తప్పించుకుంటాయి. కౌలాలంపూర్‌లోని ఓ రెస్టారెంట్‌లో బేనజీర్‌తో ఇద్దరిద్దరుగా భోంచేసిన కథ ఈ కోవకు చెందుతుంది. వారిద్దరూ ఒక టేబుల్ మీద ఉండగా, వారి సంభాషణను చెవులు రిక్కించినా వినలేనంతగా పదిహేను అడుగుల దూరంలో ఉన్న పాకిస్తాన్ విదేశాంగ మంత్రి గుడ్లగూబలా చూస్తూ ఉండటం!

ప్రధానిగా పాక్ అధ్యక్షుడితో తాను ఎదుర్కొంటున్న సమస్యలేమిటో ఆమె వివరంగా ఆఫ్తాబ్‌కు తెలిపిన సందర్భమిది. దాంతో పాటే ''ఆయన రహస్య కార్యకలాపాల జాబితా'' గురించి కూడా చర్చకు రావడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఆ క్షణంలోనే విదేశాంగ మంత్రి యాకూబ్ ఖాన్‌ను విస్మరించి చాలా సమయమైందని బేనజీర్ అనుకున్నారో ఏమో, తమతో కలవమన్నట్టుగా ఆయన వైపు చూస్తూ సంజ్ఞ చేశారనీ, అలాగే మాట్లాడుతున్న అంశాన్ని కూడా ''ఏదేదో ఊహించుకునే యాకూబ్ మనసుకు సాంత్వన ఇచ్చేలా'' పాకిస్తాన్‌లో ఎవరికైనా చిర్రెత్తించే 'జిన్నా హౌస్' వైపు మళ్లించారనీ ఆఫ్తాబ్ రాశారు.

ఇలాంటి పూవులే ఆఫ్తాబ్ సేఠ్ ఉద్యానవనంలో మనల్ని ఉల్లాసపరుస్తాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎవరి విజయం?



కోవిడ్ టీకాలకు పెద్ద వ్యతిరేకి అయిన నొవాక్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్ టెన్నిస్ టైటిల్ గెలుచుకున్నారు. టీకా వేసుకోని కారణంగా గతేడాది ఆయన్ని ఇదే యూఎస్ ఓపెన్ ఆడకుండా చేశారు. ఈ యేటి పోటీలకు టీకా కంపెనీ 'మాడెర్నా' స్పాన్సర్‌గా వ్యవహరించడం అసలైన వక్రోక్తి!

– మారియో నాఫాల్, హోస్ట్

ఎలా మారింది?



దేశం పేరు గురించి ప్రతిపక్షాలు, బీజేపీ పోట్లాడుతున్నాయి. ఒకప్పుడు ఇదే బీజేపీ ఈ విషయంలో ఉత్తరప్రదేశ్ శాసనసభ నుంచి వాకౌట్ చేసింది. 2004లో ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ 'ఇండియా అనే భారత్' కాకుండా, 'భారత్ అనే ఇండియా' అని రాజ్యాంగంలో మార్చాలని అసెంబ్లీలో తీర్మానం తెచ్చారు. అది పాస్ అయింది కూడా!

– సాయంతన్ బిశ్వాస్, కాలమిస్ట్

ఎవరికి పట్టింది?



కొంతకాలంగా హాలీవుడ్ నటులు సమ్మెలో ఉన్నారు. కానీ ఏమీ జరగనట్టే ప్రపంచం ముందుకెళ్లిపోయింది. ఎందుకంటే, ఎవరికీ ఖాతరు లేదు. మీరు ప్రేక్షకుల నుంచి ఎంత దూరం జరిగిపోయారంటే, కాలి బూడిదైనా వాళ్లు పట్టించుకోరు.

– మాథ్యూ మార్స్‌డెన్, హాలీవుడ్ నటుడు

చేజేతులా...



చిత్రాల్ (పాకిస్తాన్)లో పాకిస్తాన్ జెండాల మీదికి రాళ్లు విసిరారు తాలిబన్లు (ఇస్లాం శ్రద్ధాపూరిత విద్యార్థులు). సైతాను, లేదా తిరుగుబోతైన స్త్రీ మీదకు రాళ్లు విసరాలని షరియా చెబుతుంది. ఇప్పుడు పాకిస్తాన్ ఏమిటి? సైతానా, తిరుగుబోతా? రెండూనా?

– దివ్య కుమార్ సోతీ, కాలమిస్ట్

వందనం!



ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వేతనం నెలకు కేవలం రూ. 2.5 లక్షలు. ఇది సమంజసమేనా? కానీ ఇట్లాంటి మనుషులను డబ్బును మించి పరిశోధన, దేశ ప్రతిష్ఠ లాంటి అంశాలు ప్రేరేపిస్తాయని మనం అర్థం చేసుకోవాలి. ఇలా అంకితమై పనిచేసేవారికి నా శిరస్సు వంచుతాను.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

భాషతో బంధం

జాతి నిర్మాణంలో భాష పాత్ర చాలా గొప్పది. అనేక విషయాలను అధ్యయనం చేయడం, విజ్ఞాన సాంకేతిక తదితర ఉన్నత రంగాల్లో ప్రావీణ్యత పొందడం ఒక భాష ద్వారానే సాధ్యపడుతుంది. ఒక వ్యక్తి సమగ్ర వికాసానికి భాష ఆయువుపట్టు. అదే భాష దేశాన్ని ఒకే తాటిపై నిలబడేలా, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించినప్పుడు ఆ భాష 'జాతీయ భాష'గా నీరాజనాలు అందుకుంటుంది. ఆ పాత్రను అక్షరాలా 'హిందీ' భాష నిర్వర్తించింది, నిర్వర్తిస్తోంది కూడా.

భారత స్వాతంత్ర్య సమరంలో ప్రజలను జాగృత పరచడంలో క్రియాశీల పాత్ర పోషించి, ప్రపంచంలోనే అత్యధికులు మాట్లాడే రెండవ భాషగా వికసించిన భాష హిందీని కొందరు ఇంకా పరాయి భాషగా భావించడం దురదృష్టకరం. హిందీ ఒక భాష మాత్రమే కాదు, మన దేశ సమైక్యతా చిహ్నం కూడా! దేశంలో హిందీ మాట్లాడేవారు, అర్థం చేసుకునే వారు అధికంగా ఉండడం చేత కేంద్ర ప్రభుత్వము హిందీని అధికార భాషగా ప్రకటించింది.

ప్రస్తుతం పదికి పైగా రాష్ట్రాలలో ప్రథమ భాషగా, మిగతా రాష్ట్రాల్లో ద్వితీయ భాషగా హిందీ ప్రచలనములో ఉన్నప్పటికీ, ఆంగ్ల భాషపై మోజుతో హిందీని నిర్లక్ష్యం చేస్తున్నారు. గాంధీజీ స్వయంగా దక్షిణ భారతదేశంలో ఈ భాష ప్రచార కార్యక్రమానికి 'దక్షిణ భారత హిందీ ప్రచార సభ' స్థాపనతో శ్రీకారం చుట్టారు. ఆ మహాత్ముని ఆశయాలను అనుసరిస్తున్న మనం ఆయన విస్తరింపచేసిన భాషను తగిన విధంగా ఆదరించలేకపోవడం విచారకరం. వివిధ దేశాల్లో ఎన్నో విశ్వవిద్యాలయాల్లో హిందీని పాఠ్యాంశంగా బోధించడం గమనార్హం. కానీ, మన దేశంలో మాత్రం అంతగా హిందీకి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు.

'త్రిభాషా సూత్రా'న్ని అనుసరించి మాతృ భాష ప్రథమ భాషగా ద్వితీయ భాషగా హిందీని, తృతీయ భాషగా ఆంగ్లం. పాఠశాల విద్యార్థులకు బోధించాలని కేంద్రం నిర్దేశించింది. కానీ కొన్ని రాష్ట్రాలు ముఖ్యంగా తమిళనాడు లాంటి దక్షిణాది రాష్ట్రాలు ఈ సూత్రాన్ని వ్యతిరేకిస్తున్నాయి. పరాయి భాషలు అవసరానికి ఎన్ని నేర్చుకున్నా, మన మాతృ భాష, అధికార భాషలను నిర్లక్ష్యం చేయరాదు.

– భైతి దుర్గయ్య, హిందీ ఉపాధ్యాయుడు
(సెప్టెంబర్ 14 'హిందీ దినోత్సవం')

ఏం సాధించాలని జమిలి ఎన్నికలు?

అభిప్రాయం



మన్నారం నాగరాజు

మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టాలని అనుకొంటున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' విధానం ఆచరణలో సాధ్యం కాదు. ముఖ్యంగా ఇది సమాఖ్య విధానానికి సంకటాలు తెస్తుంది. భారత రాజ్యాంగాన్ని అనుసరించి నడుస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. ప్రస్తుత పార్లమెంటరీ విధానాన్ని తోసిరాజని అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యం వైపు దేశాన్ని తీసుకెళ్ళేందుకు మోదీ సర్కారు తీవ్రంగా యత్నిస్తుందేమోనని ఒకేసారి కేంద్ర, రాష్ట్ర చట్టసభలకు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన చెబుతోంది.

కేంద్రంలో బీజేపీ సారథ్యంలో ఎన్డీయే రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత మళ్లీ జమిలి ఎన్నికల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ అంశంపై చర్చించడానికి 2019 జూన్‌లో ప్రధాని మోదీ అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించారు. మొత్తం 40 రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తే, 21 పార్టీల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు చెప్పారు. కొన్ని పార్టీలు ఈ ప్రతిపాదనకు స్వాగతం పలికితే, మరి కొన్ని వ్యతిరేకించాయి. బీజేపీ వంటి జాతీయ పార్టీలకు ఈ ప్రతిపాదన లాభమనీ, ప్రాంతీయ పార్టీలకు నష్టమనే వాదనలు వచ్చాయి. అయితే, తాజాగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్రం కమిటీ వేయడంతో ఈ అంశంపై మరోసారి చర్చ ప్రారంభం అయింది. అయితే, జమిలి ఎన్నికల ప్రక్రియ అమల్లోకి రావడానికి శాస్త్రీయంగా అనేక అవరోధాలున్నాయి. అందుకు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాల పరిమితిని పొడిగించాల్సి ఉంటుంది. మరికొన్ని అసెంబ్లీల కాల పరిమితిని అవసరాలకు తగ్గట్టుగా తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకు రాజ్యాంగాన్ని సవరించాలి. దీనికి పార్లమెంటులో మూడొంతుల మెజారిటీ, అలాగే మొత్తం రాష్ట్రాల్లో సగం రాష్ట్రాల ఆమోదం తప్పని సరి.

1951 నుంచి 1967 వరకు లోక్ సభకు, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. 1968లో హరియాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్పటి కేంద్రం రద్దు చేసింది. 1969లో బిహార్, పశ్చిమబెంగాల్ అసెంబ్లీలు రద్దయ్యాయి. దీంతో ఆ రాష్ట్రాల అసెంబ్లీలకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. 1971లో లోక్ సభకు మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. దీంతో ఏడాది పొడవునా దేశంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరిగే తంతు షురూ అయింది. ఒకటే సమయంలో ఎన్నికలను నిర్వహించాలంటే భారత రాజ్యాంగంలోని కనీసం ఐదు ఆర్టికల్స్‌కు సవరణలు చేయాల్సి ఉంటుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. ఆర్టికల్ 83 (పార్లమెంట్ కాల వ్యవధి), ఆర్టికల్ 85 (లోక్ సభ రద్దు), ఆర్టికల్ 172 (రాష్ట్ర అసెంబ్లీల కాల వ్యవధి),



ఆర్టికల్ 174 (రాష్ట్ర అసెంబ్లీల రద్దు), ఆర్టికల్ 356 (రాష్ట్రపతి పాలన విధింపు) తదితర ఆర్టికల్స్‌ను సవరించాల్సి ఉంటుంది. భారీగా ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలు అవసరమవుతాయన్నది ఎన్నికల సంఘం చెబుతున్న అంశం. దేశ వ్యాప్తంగా భారీగా భద్రతా బలగాలను మోహరించడం సాధ్యపడదన్న విషయం సర్వత్రా తెలిసిందే.

ఎన్నికల సంస్కరణలకు సంబంధించి 1999లో 'లా కమిషన్' ఇచ్చిన నివేదికలో జమిలి ఎన్నికల ప్రతిపాదనపై సానుకూలత వ్యక్తమైంది. ప్రభుత్వానికి కొన్ని వందల కోట్లు ఆదా అవుతాయనీ, ఈ మొత్తాన్ని ప్రజలకు ఉపయోగపడే మంచి పనులకు ఉపయోగించుకోవచ్చుననీ పేర్కొన్నది. అలాగే ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతాయన్నది. ఎన్నికల కోసం పెద్ద ఎత్తున పోలీసు బలగాలనూ, లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులనూ ఉపయోగించాలి. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఈ ప్రయాస తప్పుతుందని న్యాయ కమిషన్ సూచన.

ఒకేసారి రాష్ట్రాలతో పాటు కేంద్రానికి ఎన్నికలు జరిగినా... ఏదయినా రాష్ట్రానికి సరైన మెజారిటీ రాక విశ్వాస పరీక్షలో నెగ్గలేక పోయే పరిస్థితుల్లో ఏం చేస్తారన్న దానిపై కేంద్రం వద్ద సమాధానం లేదు. భారత రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా విశ్వాస పరీక్షలో నెగ్గని ప్రభుత్వాన్ని ఆర్టికల్ 83 (2) లోక్ సభ, 172 (1) అసెంబ్లీని రద్దు చేయాల్సి ఉంటుంది. మరి ఒకేసారి ఎన్నికలు అని చెబుతున్న కేంద్రం ఆయా రాష్ట్రాల అసెంబ్లీ రద్దు అయ్యాక సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. రాష్ట్రంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడితే కేంద్రం రాష్ట్రపతి (గవర్నర్) పాలన విధించే అవకాశం ఉందని నిగూఢంగా అర్థం చేసుకోవాల్సి ఉంది. దాంతో పాటు, సర్కారు చెప్పినట్టు లోక్ సభ, శాసనసభల కాల పరిమితి పొడిగించడం, తగ్గించడం వంటి చర్యలు పూర్తిగా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అంటే, ఆయా అసెంబ్లీలు ఎన్నికయ్యే వరకు ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రం భావిస్తోందా అన్న అంశం తేలాల్సి ఉంది. ఈ పరిణామాలన్నీ నిశితంగా గమనిస్తే... అధ్యక్ష తరహా పాలనకు మోదీ సర్కార్ తెరతీస్తున్నట్టు అనిపిస్తోంది.

79వ పార్లమెంటరీ స్థాయి సంఘం చెప్పిన ప్రకారం అసెంబ్లీల పదవీకాలాన్ని పెంచడం, తగ్గించడం.. రాజ్యాంగ మూలసూత్రాలు, వాటి స్ఫూర్తికి వ్యతిరేకమని గమనించాలి. ఒకే దేశం – ఒకే ఎన్నికలు అంశాన్ని బలపరచడం అంటే గవర్నర్ పేరిట పాలనలో కేంద్రాన్ని పూర్తిగా అనుమతించడమేనన్న విషయం గుర్తెరగాలి. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని చెప్పుకునే వారంతా ఈ అంశంపై పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.


వ్యాసకర్త తెలంగాణ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు
మొబైల్: 95508 44433

సహజ జీవన గమనం

1. అసలైన మహత్యం

జెన్ గురువు 'బన్‌కెయి' ఓ నాడు బౌద్ధ విహారంలో ప్రవచనం చేస్తుండగా వేరే బౌద్ధ శాఖకు చెందిన ఒకాయన అక్కడకు వచ్చి సభలో పెద్దగా మాట్లాడుతూ అలజడి సృష్టించాడు. బన్‌కెయికి వచ్చిన మంచిపేరంటే అతడికి అసూయ.

బన్‌కెయి మాట్లాడటం ఆపి గొడవకు కారణం ఏమిటని అడిగాడు. వచ్చిన ఆ ఆగంతకుడు అన్నాడు: 'మా శాఖను స్థాపించిన గురువు ఎటువంటి గొప్ప మాహాత్మ్యాలు చెయ్యగలడంటే, నదికి ఇవతల గట్టు మీద కుంచె పుచ్చుకొని ఉండి, అవతల గట్టుమీద ఎవరైనా అట్ట పుచ్చుకొని ఉంటే, దానిమీద ఆ కుంచెతో బొమ్మ గీయగలడు. నీవు అలాంటి మహత్తు చెయ్యగలవా?'



జ్యోతిర్మయం

బన్‌కెయి సమాధానం చెప్పాడు: 'అలాంటి తంత్రం మీ గురువు చెయ్యగలడేమో కాని, అది జెన్ పద్ధతి కాదు. నేను చేసే మహత్తు ఏమిటంటే, నాకు ఆకలైనప్పుడు తింటాను. దాహమైనప్పుడు తాగుతాను.'

2. శుభదాయకం

ఓ ధనవంతుడు, జెన్ గురువు 'సెన్‌గయి'ని అడిగాడు, తన వంశాభివృద్ధికి శుభదాయకమైన వాక్యం ఒకటి వ్రాసివ్వమనీ, దాన్ని తరతరాలుగా దాచి ఉంచుకొంటామనీ!

సెన్‌గయి పెద్ద కాగితం ఒక దాన్ని తెప్పించుకొని, దాని మీద ఇలా రాశాడు: 'తండ్రి చనిపోతాడు, కొడుకు చనిపోతాడు, మనవడు చనిపోతాడు.'

ధనవంతుడికి కోపం వచ్చింది. 'నేను నిన్ను నా కుటుంబం ఆనందంగా ఉండటానికి ఏదైనా రాసివ్వమని అడిగాను. నీవేంటి ఇలా నన్ను ఎగతాళి పట్టిస్తున్నావు?'

'ఇందులో ఎగతాళి ఏం లేదు' వివరించాడు సెన్‌గయి. 'నీవు చనిపోకముందే నీ కొడుకు చనిపోయినాడనుకో. అది నిన్ను ఎంతగానో బాధిస్తుంది. నీకంటే, నీ కొడుకు కంటే ముందే, నీ మనవడు చనిపోయినాడనుకో, మీ ఇద్దరి గుండె పగిలిపోతుంది. అలా కాకుండా, నీ కుటుంబం తరతరాలుగా నేను పేర్కొన్న వరుసలో గతించినారనుకో, అది సహజమైన జీవన గమనం అవుతుంది. దీన్ని నేను శుభదాయకం అంటాను.'

– దీవి సుబ్బారావు



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.2.00 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆశ్లేష రా.12.01 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.11.38 నుండి 1.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.45 నుండి 11.32 వరకు, **అమృతఘడియలు:** రా.10.13 నుండి 12.01 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.04.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899



భక్తజన 'రాజన్న'

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధి భక్తులతో మహాశివరాత్రి జాతరను తలపించింది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో దాదాపు 50 వేల మందికి పైగా భక్తులు దర్శనానికి వచ్చారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో పోలీసులు బస్సులను నాంపల్లి నుంచి కమాన్‌ద్వారా వేములవాడకు దారిమళ్లించారు. వేములవాడలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఆలయానికి భక్తుల ద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



'యూరియా' కోసం రైతుల బారులు

అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు సోమవారం యూరియా కోసం బారులు తీరారు. ఉదయం ఏడు గంటలకే వచ్చి చెప్పులను క్యూలైన్‌లో పెడితే..ఉదయం 10 గంటలకు కార్యాలయం తీయడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు నిలబడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి 5 నుంచి పది బస్తాల యూరియా అవసరం ఉండగా.. రెండు బస్తాలు మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి రైతుల అవసరం మేరకు యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరారు.

ఆస్పత్రిలో పొగలు రావడంతో బయటకు వచ్చి కూర్చున్న గర్భిణులు, బాలింతలు



ప్రభుత్వ ఆస్పత్రిలో పొగలు

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం స్టోర్ రూమ్‌లో సోమవారం మంటలు ఎగసి పొగలు వచ్చాయి. దీంతో వార్డులోని బాలింతలు, గర్భిణులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. వెంటనే ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకుని కలెక్టర్ కర్ణన్ ఆస్పత్రిని సందర్శించి ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చూతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. బాత్రూంలను శుభ్రం చేసే యాసిడ్ మగ్గులో ఉండగా.. బ్లీచింగ్ పౌడర్ అందులో పడడంతో మంటలు లేచి పొగ వచ్చినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.



పోడు సాగు అడ్డగింత.. తోపులాట

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి బీట్ పరిధిలోని భూములను చిన్నబోయినపల్లి పోడు రైతులు సోమ వారం నాగళ్లతో దున్నుతుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఎడ్లకు ఉన్న నాగళ్లను విప్పివేయడంతో ఉభయుల మధ్య తోపులాట జరిగింది. మహిళా రైతు రుక్కమ్మకు గాజులు గుచ్చుకుని గాయమైంది. తాము సాగు చేసుకునే భూముల్లోకి రానీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని రైతులు వాపోయారు. దీనిపై అటవీశాఖ రేంజ్ అధికారి నరేందర్ మాట్లాడుతూ ఈ భూమిలోకి వచ్చేందుకు రైతులవద్ద ఎలాంటి అనుమతి పత్రాలు, పహాణీలు లేవన్నారు.

క్లుప్తంగా...

డీఎస్‌కు తీవ్ర అస్వస్థత

- శ్వాస సంబంధ సమస్యలతో సిటీన్యూరో ఐసీయూలో చికిత్స
- పరిస్థితి విషమం: ఆసుపత్రి వర్గాలు



సాక్షి, హైదరాబాద్/ఖలీల్‌వాడి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీమంత్రి ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస సంబంధిత సమస్యతో ఆయనను కుటుంబసభ్యులు సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని సిటీన్యూరో ఆసుపత్రిలో చేర్చారు. వైద్య పరీక్షల అనంతరం ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్స ప్రారంభించారు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని సోమవారంరాత్రి ఆసుపత్రి వర్గాలు విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో వెల్లడించాయి.

ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లు పెట్టాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని, అందులో బీసీ మహిళలకు 50 శాతం సబ్‌కోటా కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళా బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్ష తన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 'చలో ఢిల్లీ' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం, కేంద్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనా భా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కోరారు. ప్రైవేట్ రంగంలో రిజర్వే షన్లు కల్పించాలన్నారు. కేంద్రస్థాయిలో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

గోదావరి ముంపు బాధితుల పోరుకు మద్దతు

- మావోయిస్టు పార్టీ చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం చర్ల తదితర మండలాల్లో గోదావరి ముంపు బాధితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని, వారి డిమాండ్లు సాధించుకునే వరకు మిలిటెంట్ పోరాటాలు చేయాలని మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక లేఖ విడుదల చేశారు. సామ్రాజ్యవాదులు, దోపిడీవర్గాలు, భూస్వాముల ప్రయోజనాల కోసం గోదావరి నదిపై దుమ్ముగూడెం, పోలవరం ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీతమ్మసాగర్, పోలవరం ప్రాజెక్టుతో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

ములుగు జిల్లాలో జ్వరాలతో ఇద్దరి మృతి

కన్నాయిగూడెం/ఏటూరునాగారం: ములుగు జిల్లాలో జ్వరాలతో సోమవారం ఇద్దరు మృతి చెందారు. కన్నాయిగూడెం మండల పరిధిలోని బుట్టాయిగూడేనికి చెందిన కుమ్మరి హేమలత(18) జ్వరంతో ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లి టెస్ట్ చేయగా, డెంగీగా నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లికి చెందిన దివ్య అలియాస్ చిట్టి (26) రెండు రోజులుగా విషజ్వరంతో బాధపడుతుండగా, సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా, తగ్గకపోవడంతో వరంగల్‌కు తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది.

కేంద్రాలకు తాళం వేసి సమ్మెకు..

- రాష్ట్రవ్యాప్తంగా సోమవారం విధులు బహిష్కరించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు
- కేంద్రాలకు తాళాలు వేసి దగ్గర పెట్టుకొని సమ్మెకు దిగిన వైనం
- ఉదయం10 గంటల వరకు కూడా కేంద్రాలు తెరవని పరిస్థితి
- దీంతో చాలాచోట్ల రంగంలోకి దిగిన పోలీసులు, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు
- డిమాండ్లు ఒప్పుకునే వరకు సమ్మె విరమించబోమని సంఘాల స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్‌కు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జేఏసీ (సీఐటీయూ, ఏఐటీయూసీ) సమ్మె నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. జేఏసీ పిలుపుతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలోని 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. 25 రకాల డిమాండ్లతో సమ్మె చేపట్టిన టీచర్లు, హెల్పర్లు తొలిరోజు ఉదయం మండల, తాలూకా, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంపు, సర్వీసు పెన్షన్, ఉద్యోగభద్రత, ఆరోగ్య పథకాలతో కూడిన ప్రధాన డిమాండ్లను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా, ఫలితం లేకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగారు.

కేంద్రాలకు తాళాలు... పగులగొట్టిన అధికారులు

సమ్మె కారణంగా ఉదయం 10గంటలు దాటినా అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోలేదు. ఈ కేంద్రాలకు ముందురోజు తాళాలు వేసిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెకు వెళుతున్న క్రమంలో అధికారులకు తాళంచెవులు అప్పగించలేదు. దీంతో చాలాచోట్ల పోలీసులు, రెవెన్యూ శాఖ, మహిళాభివృద్ధి, శిశు,సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను పగులగొట్టి వాటిని తెరిచారు. గ్రామసమాఖ్య, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు పలు కేంద్రాల నిర్వహణ తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. ఇందులో భాగంగా కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు సంబంధిత బాధ్యులు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం: జేఏసీ

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె నిరవధికంగా కొనసాగిస్తామని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జేఏసీ స్పష్టం చేసింది. సర్వీసు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. టీచర్లు, హెల్పర్లకు గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలని కోరుతున్నామన్నారు.



జగిత్యాల జిల్లా కోరుట్ల అర్బన్ అంగన్‌వాడీ కేంద్రం తాళం పగలగొడుతున్న దృశ్యం

పెరుగు అడిగితే చంపేశారు!

▶ మొదటి పేజీ తరువాయి

వాగ్వాదం చోటు చేసుకుంది.

పోలీసుల సమక్షంలోనే దాడి: దీంతో మరో ఇద్దరు వెయిటర్లు, రెస్టారెంట్ మేనేజర్, సూపర్‌వైజర్ వచ్చి విచక్షణారహితంగా లియాకత్‌తో పాటు అతడి స్నేహితులపై దాడికి దిగారు. ఇంతలో ఓ రెస్టారెంట్ ఉద్యోగి సమాచారంతో అక్కడకు చేరుకున్న పంజగుట్ట పోలీసుస్టేషన్ గస్తీ సిబ్బంది ఎదుటే రెస్టారెంట్ సిబ్బంది, నిర్వాహకులు లియాకత్ తదితరులపై దాడి కొనసాగించారు. ఈ దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పోలీసుల సమక్షంలోనే దాడి చేస్తూ రెస్టారెంట్‌పై అంతస్తు నుంచి కింది వరకు తీసుకువచ్చారని ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. వీరి దెబ్బలు తాళలేకపోయిన లియాకత్ ఆయాసంతో అక్కడే కూలబడిపోయాడు. దీంతో పోలీసులు అతడితో పాటు స్నేహితులు మహ్మద్ జమీర్, మహ్మద్ నాసర్, మహ్మద్ ముస్తఫాను ఠాణాకు తీసుకువచ్చారు.

ఠాణాకు తీసుకువచ్చినా నిర్లక్ష్యం...: అప్పటికే లియాకత్ తనకు తీవ్రంగా ఆయాసం వస్తోందని, ఊపిరి అందట్లేదని చెప్తున్నా డ్యూటీలో ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ పట్టించుకోలేదని అంటున్నారు. కొద్దిసేపటికి లియాకత్ అక్కడే కుప్పకూలిపోవడంతో కారు తాళాలు ఇచ్చి స్నేహితులతోనే సోమాజిగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి పంపారు.

ఆలస్యంగా ఆస్పత్రికి తీసుకెళ్లడంతో...: అప్పటికే లియాకత్ చనిపోయినట్టు ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఆస్పత్రి వద్దకు వచ్చి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బైఠాయించారు. ఆ మేరకు పోలీసులు హామీ ఇవ్వడంతో పరిస్థితి అప్పటికి సద్దుమణిగింది. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డెవిస్ పంజగుట్ట పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. రెస్టారెంట్‌ను తాత్కాలికంగా మూసివేయించారని సమాచారం. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

హత్య కేసు నమోదు..: లియాకత్ స్నేహితుడు, బండ్లగూడకు చెందిన హస్ర చాంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెయిటర్లు బిహార్ వాస్తవ్యుడు, అమీర్‌పేట హాస్టల్‌లో ఉండే కృష్ణ సూర్య ప్రకాష్ (33), అమీర్‌పేట బాపూనగర్‌కు చెందిన మెగావత్ పాండు (36), సరూర్‌నగర్‌కు చెందిన మేనేజర్ సయ్యద్ హఫ్తాబ్ హైదర్ (55), జగద్గిరిగుట్టకు చెందిన సూపర్‌వైజర్ అబ్దుల్ మోయిన్(40), సనత్‌నగర్‌కు చెందిన సూపర్‌వైజర్ మహ్మద్ అజీజుద్దీన్ (23)పై హత్య కేసు నమోదు చేశారు. మృతదేహానికి గాంధీ ఆస్పత్రి మార్చురీలో పోస్టు మార్టం పరీక్షలు పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు.

ఎస్ఐ, కానిస్టేబుల్‌పై వేటు

పంజాగుట్ట మెరిడియన్ హోటల్ కేసు విషయంలో విధుల్లో అలసత్వం వహించారన్న ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐ శివశంకర్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ రమేష్‌లను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

కులవృత్తులకు కేసీఆర్ ప్రాధాన్యం

- మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి
- కోకాపేటలో సగర కుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మణికొండ: రాష్ట్రంలో అన్ని కులవృత్తులకు ప్రాధాన్యం పెంచటంతోపాటు కులవృత్తులవారు ఆత్మగౌరవంతో జీవించేందుకు, రాణించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, గనులు, భూగర్భవనరులు, సమాచార శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో రెండు ఎకరాల భూమిలో రూ. 2 కోట్లతో నిర్మించతలపెట్టిన సగర కుల ఆత్మగౌరవ భవనానికి మంత్రులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన మిషన్ భగీరథ పథకానికి సగర కులస్తుల దైవం భగీరథ పేరు పెట్టి ఇంటింటికీ తాగునీరు అందించటం గర్వకారణమన్నారు. ట్యాంక్‌బండ్‌పై భగీరథుని విగ్రహం ఏర్పాటు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని, సగర కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూపులో చేర్చాలన్న డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సగరులకు నిర్మాణరంగంలో కోరుతున్న రిజర్వేషన్ల విషయాన్ని సీఎంకు వివరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని, ఆ విషయాన్ని గ్రామాల్లో చర్చించాలని అన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్, సగర కుల సంఘం నాయకులు మారుతిసాగర్, శేఖర్‌సాగర్, పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



సగర కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లు

ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

సర్వే చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్, అన్ని రకాల జబ్బులు గుర్తించి మందులను రోగులకు సరఫరా చేస్తున్నామన్నారు. కరోనా నియంత్రించడంలో ఆశావర్కర్లు కీలక పాత్ర పోషించారని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆశావర్కర్లకు హెల్త్ గ్లోబల్ లీడర్స్ అవార్డును కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సబ్ సెంటర్స్, దవాఖానాల్లో పనిచేయాలని ప్రభుత్వం చెబుతోందని, అయినా తమకు కేవలం రూ.9.750 వేలు మాత్రమే పారితోషకమే ఇస్తోందన్నారు. ఒకవైపు పనిభారంతో, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వేతనం రూ.18 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశావర్కర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 'గుర్తింపు'నకు గ్రీన్‌సిగ్నల్

అక్టోబర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ? ● ఈ నెల 22న తుది నిర్ణయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/మంచిర్యాల: సింగరేణిలో వాయిదా పడుతూ వస్తున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర కార్మిక శాఖ ఎన్నికల నిర్వహణకు మొగ్గుచూపింది. ఈ మేరకు ఎన్నికలకు సంబంధించి కీలక తేదీలను ప్రాథమికంగా ఖరారు చేసింది. చివరిసారిగా 2017 అక్టోబర్ 5న ఎన్నికలు జరిగాయి. అందులో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం విజయం సాధించింది. ఈ కమిటీ కాలపరిమితి 2021 అక్టోబర్ 5తో ముగిసింది. అయితే అప్పటి నుంచి వివిధ కారణాలతో గుర్తింపు ఎన్నికలను సింగరేణి సంస్థ వాయిదా వేస్తూ వస్తోంది. చివరకు కార్మిక సంఘాలు హైకోర్టును ఆశ్రయించగా.. ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించినా, సాంకేతిక కారణాల సాకుతో మరో ఏడాది పాటు ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు. 15 కార్మిక సంఘాలు, సింగరేణి ప్రతినిధులతో కేంద్ర కార్మిక శాఖ సోమవారం సమావేశం నిర్వహించగా, ఇందులో ఎన్నికల నిర్వహణపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

చివరి నిమిషంలో..

కార్మిక శాఖ నిర్వహించిన సమావేశంలో ఈ ఏడాది అక్టోబర్ 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చేనెల 7వ తేదీన నామినేషన్లు స్వీకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే సమావేశం చివర్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక తేదీలు ప్రకటించేందుకు మరికొంత సమయం తీసుకుంటే బాగుంటుందని సింగరేణి డైరెక్టర్ (పా) సూచించారు. ఈ నెల 21న కార్మికులకు ఎరియర్స్ చెల్లించబోతున్నందున పని భారం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కాబట్టి ఎన్నికల తేదీలపై తుది నిర్ణయాన్ని మరుసటి సమావేశంలో నిర్ణయిస్తే బాగుంటుందన్నారు. దీనికి కార్మిక సంఘాలు అంగీకారం తెలపడంతో ఈనెల 22న మరోసారి సమావేశం కానున్నారు. అదే రోజు ఓటర్ల జాబితా, మార్పులు చేర్పులు, నామినేషన్లు, ఎన్నికల తేదీ తదితర వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.



ఎన్నికల నిర్వహణపై సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, సింగరేణి డైరెక్టర్, కార్మిక సంఘాల నాయకులు

అధికారాలకు కత్తెర

సోమవారం జరిగిన సమావేశంలో టీజీబీకేఎస్‌కు షాక్ తగిలింది. కాలపరిమితి ముగిసినా ఇంకా గుర్తింపు సంఘం హోదా టీజీబీకేఎస్‌కు ఉంది. దీనిపై మిగిలిన కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చే వరకు అన్ని సంఘాలను సమానంగా పరిగణించాలని నిర్ణయించారు. దీంతో ఇప్పటివరకు గుర్తింపు సంఘంగా కొనసాగుతున్న టీజీబీకేఎస్‌కు అందుతున్న అదనపు ప్రయోజనాలకు కత్తెర పడ్డట్టయ్యింది.

భారత ఆహార సంస్థ
ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు, హాకా భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్-500004, ఫోన్: 040-23422323, 040-23422358
తేది: 11.09.2023
ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఇ-టెండర్ల కోసం ఆహ్వానం
FSD-ఉప్పల్ మరియు BSC-నల్గొండ వద్ద బిల్ట్ మెయింటెయిన్ మరియు ఆపరేట్ విధానంలో ... (PMS) కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ... FCI, RO, హైదరాబాద్ టెండరు విడుదల చేసింది. మరిన్ని వివరాలకు దర్శించండి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (https://eprocure.gov.in/eprocure/app.in) మరియు FCI వెబ్‌సైట్ (www.fci.gov.in)
సం/- జనరల్ మేనేజర్ (రీజియన్)

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-NIT No.15/S.E.(R&B)KNR/ 2023-24 తేదీ: 30-08-2023
కరీంనగర్ జిల్లాలోని నుస్తులాపూర్ నుండి మొగిలిపాలెం రోడ్ పైన వల్లపల్లి గ్రామ పరిధిలో సిమెంట్ కాంక్రీట్‌తో పేవ్ షోల్డర్స్ నిర్మాణం (ఫౌంటెన్ నిర్మాణంతో సహా) -వ్యయం రూ.100.00 లక్షలు. బిడ్ ముగింపు తేదీ, సమయం: 20-09-2023న మ.3.30 గం॥కు, PQ స్టేజ్ 20-09-2023 సా.4.00 గం॥. కమర్షియల్ స్టేజ్ 23-09-2023న సా.4.00 గం॥. తదుపరి వివరాలను www.tender.telangana.gov.inలో చూడవచ్చును. ఇ-మెయిల్ ID: ersupengerkmnr@gmail.com.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్, కరీంనగర్
DIPR RO No.1599-DP/CL/Advt/1/2023-24, Dt: 11.09.2023

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
O/o ది పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, పెద్దపల్లి
E-Procurement
Tender Notice No.SE/IC/PDPL/04/2023-24, Dt.04-09-2023
పెద్దపల్లి జిల్లాలోని పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని 01 పనికి సంబంధించిన టెండర్ షెడ్యూల్లు మరియు ఇతర వివరాలను 12-09-2023 నుండి 26-09-2023 వరకు O/o పర్యవేక్షక ఇంజనీర్, I & CAD డిపార్ట్‌మెంట్, ఇరిగేషన్ సర్కిల్, పెద్దపల్లి నుండి పొందవచ్చు మరియు జారీ చేసిన తేదీ నుండి పాల్గొనవచ్చు. సంప్రదించు ఫోన్ నెం.9553069089, Mail ID: seiopdpl@gmail.com. మిగతా వివరములకు e-Procurement Marketplace: www.tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, పెద్దపల్లి
DIPR RO No.6413-PP/CL/Advt/1/2023-24, Dt:11.09.2023

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన (పత్రికా ప్రకటన)
దిగువ తెలిపిన ఐటమ్స్ సేకరణ కోసం ఇ-టెండరు ప్లాట్‌ఫామ్‌పై టెండర్లు విడుదల చేయుటకు TSSPDCL ఉద్దేశిస్తోంది: మహబూబ్‌నగర్ మరియు వనపర్తి స్టోర్స్ యొక్క వివిధ సర్కిళ్లకు (ఎ) 33 &11KV ఇండోర్ స్విచ్‌గేర్, (బి) కార్పొరేట్ ఆఫీస్ మరియు SCADA ఆఫీస్ యొక్క డాటా క్రిటికల్ డెస్క్‌టాప్ సిస్టం మరియు సర్వర్లలో సెంట్రలైజ్డ్ ఎంటర్‌ప్రైజ్ యాంటీ-వైరస్ సొల్యూషన్ (ఎండ్ పాయింట్ ప్రొటెక్షన్), (సి) FO కేబుల్స్, HDPE పైపులు, LIU బాక్సులు, ప్యాచ్ కార్డులు, (డి) 3.5C x 185 sq.mm LT XLPE UG కేబుల్ (ఇ) BIS EE లెవల్-2 (స్టార్-2)తో 3-Ph 100KVA DTRs CSP అల్యూమినియం వౌండ్ DTRs మరియు (ఎఫ్) 11mtrs/ 365 kgs PSCC పోల్స్ పైన తెలిపిన ప్రతీ ఐటమ్ యొక్క తదుపరి వివరాల కోసం దర్శించండి : www.tssouthernpower.com, www.tender.telangana.gov.in మరియు www.auction.telangana.gov.in. ఫోన్: 040-23431360, 1033, 1035
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (P&MM)
DIPR RO No.6468-PP/CL/Advt/1/2023-24, Dt: 11.09.2023

తెలంగాణ ఫుడ్స్ : IDA : నాచారం : హైదరాబాద్ - 500076
ఫోన్ నం. : 27152207, 08 & 09
టెండరు ప్రకటన
నం. TF/GG/tender/SMP/1417/2023-24 తేది: 11-09-2023
500 MTs స్కిమ్మ్‌డ్ మిల్క్ పౌడర్ (SMP) సరఫరా చేసేందుకు తెలంగాణ ఫుడ్స్ వారు ఇ-టెండర్లు కోరుతున్నారు. తదుపరి వివరాలు, నియమ నిబంధనలు, స్పెసిఫికేషన్లు మొ॥ వాటితో టెండరు షెడ్యూల్ కోసం వెబ్‌సైట్ https://tender.eprocurement.gov.in దర్శించండి.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No.6417-PP/CL/Advt/1/2023-24, Dt. 11.09.2023

తెలంగాణ ప్రభుత్వం
కమిషనర్ కార్యాలయం, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు
NIT No.EE/12/Tender Notice/2023, తేది: 06-09-2023 (1వ పిలుపు)
ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ మరియు సూర్యాపేట జిల్లాలలోని 29 దేవాలయాల అభివృద్ధి కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం రూ.589.00 లక్షలు. మరింత సమాచారం కోసం దర్శించండి: https://tender.telangana.gov.in. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 12.09.2023. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు): 26.09.2023
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
DIPR RO No.1608-DP/CL/Advt/1/2023-24, Dt: 11.09.2023

తెలంగాణ ప్రభుత్వం
పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
రీజినల్ ఆఫీసర్ కార్యాలయం, PR రీజియన్, నిజామాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
NIT No. 823 to 883/2023-24 తేది: 11-09-2023
మొత్తం పనుల సంఖ్య (61నం.లు) పనులపేరు: నిజామాబాద్ మరియు కామారెడ్డి జిల్లాలలో SDF గ్రాంట్స్ క్రింద భవన పనులు, రోడ్లు మరియు డ్రైయిన్స్ నిర్మాణం/మిగిలిన పనులు - 15th ఫైనాన్స్ & NHM (2023-24) గ్రాంట్స్‌లో సబ్‌సెంటర్ బిల్డింగ్స్ నిర్మాణం- STSDF గ్రాంట్ & 2BHK ఇన్‌ఫ్రా క్రింద GP బిల్డింగ్స్ నిర్మాణం కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV రూ.1259.94 లక్షలు. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను 13-09-2023న ఉ.10.30 గం॥ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు ఆఖరి తేదీ: ఆన్‌లైన్‌లో ప్రతి NIT ప్రచురించబడిన తేదీ నుండి (7) పనిదినములు. అన్ని తదుపరి వివరాలను ఆన్‌లైన్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in. లో చూడవచ్చును.
సం/- రీజినల్ ఆఫీసర్, PRED, నిజామాబాద్
DIPR RO No.1594-DP/CL/Advt/1/2023-24, Dt: 11.09.2023

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయము, ఇరిగేషన్ సర్కిల్, గజ్వేల్, సిద్దిపేట జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
నెం.04/IC-GAJWEL/2023-2024 తేది: 08-09-2023
... 12-09-2023 ... 26-09-2023 ... రూ.14.86 లక్షలు ... మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫామ్ www.tender.telangana.gov.in వెబ్ సైట్ నందు తేది: 12-09-2023 నుండి చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు ఇరిగేషన్ సర్కిల్, గజ్వేల్, సిద్దిపేట జిల్లా
DIPR Ro No.6405-PP/CL/ADVT/1/2023-24, Dt: 11-09-2023

తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
నమూనా-ఫారం-1 (నిబంధన 4 (1) చూడగలరు)
వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం
మెమో నెం.G2/10632/2023, తేది: 04.09.2023 & మెమో నెం.G2/11259/2023, తేది : 04.09.2023 ప్రకారం శ్రీయుత కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ గారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల ఈ క్రింది దేవాలయాలకు నోటిఫికేషన్లు ఇచ్చియున్నారు.
1) శ్రీ కోటేశ్వరస్వామి దేవాలయం, కోటిలింగాల (గ్రామము), వెల్గటూర్ (మండలం), జగిత్యాల (జిల్లా)
2) శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం, కట్టరాంపూర్, కరీంనగర్ టౌన్ & జిల్లా.
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా! ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పై దేవస్థానములకు నోటీసులు ప్రచురించబడిన తేది నుండి 20 రోజుల అనంతరము దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/1987 (సవరించబడిన చట్టము 33/2007, రూల్ (4), సబ్ రూల్ (1) సెక్షన్ 15 ఉప సెక్షన్ (2)కి లోబడి వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తగా నియామకము కొరకు వారి దరఖాస్తులను సెక్షన్ 17 నందలి ఉపసెక్షన్ (3)ననుసరించి నిర్దిష్ట ప్రొఫార్మా (ఫారం-II)లో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 20 రోజులలోపు శ్రీయుత కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ గారికి లేదా శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, కరీంనగర్ జిల్లా వారికి పంపవచ్చును.
సం/- వి. అనిల్ కుమార్, కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్
DIPR RO No.6385-PP/CL/Advt/1/2023-24, Dt: 11.09.2023

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు నోటీస్ నం. E1/W-11/CDP, GBF & GF/2023-24/001 తేది:11-09-2023
కల్వకుర్తి మున్సిపాలిటీలో (11) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండరు కోరబడింది. అంచనా విలువ: రూ.45.15 లక్షలు, పని పేరు: CDP ఫండ్స్ క్రింద కల్వకుర్తి మున్సిపాలిటీలో CC రోడ్లు మరియు CC డ్రైయిన్స్ నిర్మాణం. అంచనా విలువ: రూ.26.00 లక్షలు, పని పేరు: 1. గ్రీన్ బడ్జెట్ ఫండ్స్ క్రింద హోమ్ స్టెడ్ డిస్ట్రిబ్యూషన్ మరియు అవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కల సేకరణ, 2. జనరల్ ఫండ్ క్రింద వెదురు కర్రల సరఫరా మరియు డెలివరీ, వరద నీటి డ్రైయిన్ల నుండి తడి బురద తొలగింపు, బిడ్ దాఖలు ప్రారంభ తేదీ మరియు సమయం: 11-09-2023న ఉ.11.00 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 16-09-2023న సా.4.30 గం.లు. పని పేరు: జనరల్ ఫండ్ క్రింద వార్డ్ నం.11 వద్ద CC డ్రైయిన్ నిర్మాణం మరియు మున్సిపల్ కార్యాలయ భవనంలో టాయిలెట్ల మరమ్మతు, బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం: 11-09-2023న ఉ.11.30 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 13-09-2023న సా.4.30 గం.లు, తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా www.eprocurement.gov.in లో చూడవచ్చును. బిడ్లు కోరే అధికారి: కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నం.9110540243, 7330690590.
సం/- కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ
DIPR RO No.6409-PP/CL/Advt/1/2023-24, Dt: 11-09-2023

తెలంగాణ ప్రభుత్వం
ఇరిగేషన్ మరియు కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల

క్ర.సం.	టెండరు ప్రకటన నంబర్ & తేది	పని పేరు	మొత్తం రూ. లక్షలలో
1	07/2023-24 08.09.2023	వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చంద్రవంచ గ్రామం సమీపంలో కాగ్నా నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం.	874.40
2	08/2023-24 08.09.2023	వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఖంజాపూర్ గ్రామం సమీపంలో కాగ్నా నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం.	767.60
3	09/2023-24 11.09.2023	వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం దేవనూర్/ నాగసముందర్ గ్రామం సమీపంలో కాకరవేణి వాగుకు అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం.	800.00
4	10/2023-24 11.09.2023	వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం రసూల్‌పూర/ బెన్నూరు గ్రామం సమీపంలో కాగ్నా నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం.	1018.10
5	11/2023-24 11.09.2023	వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మన్సాన్‌పల్లి గ్రామం సమీపంలో కాగ్నా నదికి అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణం.	885.40

పైన తెలిపిన ప్రతీ పని కోసం టెండరు ప్రారంభ తేది: 12.09.2023, టెండరు ముగింపు తేది: 19.09.2023, టెండరు తెరుచు తేది: 19.09.2023, పూర్తిచేసే గడువు సమయం: 9 నెలలు.
సం/- 08.09.2023, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల
DIPR RO No.6397-PP/CL/Advt/1/2023-24, Dt: 11.09.2023

క్లుప్తంగా...

మొరాకో భూకంపం.. 2,500కు చేరిన మృతులు

మ్రరకేశ్: మొరాకోలో సంభవించిన తీవ్ర భూకంపంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. సుమారు 2,500 మంది చనిపోగా, మరో 2,500 మంది క్షతగాత్రులయ్యారని సోమవారం మొరాకో ప్రభుత్వం ప్రకటించింది. ప్రముఖ పర్యాటక ప్రాంతం, ఆర్థిక కేంద్రం అయిన మ్రరకేశ్‌కు 72 కిలోమీటర్ల దూరంలోని అట్లాస్ పర్వత ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఒక్క అల్ హౌజ్ ప్రావిన్స్‌లోనే 1,500 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్వత ప్రాంతంలోని కొన్ని పట్టణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అస్ని గ్రామంలో ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. సుమారు 3 లక్షల మంది నీడ కోల్పోయినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా.

దేవెగౌడ మనవడికి హైకోర్టులో చుక్కెదురు

బెంగళూరు: జేడీ(ఎస్)లో ఏకైక పార్లమెంట్ సభ్యుడు ప్రజ్వల్ రేవణ్ణకు కర్ణాటక హైకోర్టులో చుక్కెదురైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని హసన్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఆయన ఎన్నిక చెల్లదంటూ గతంలో కింది కోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పు అమలును నిలుపుదల చేయాలంటూ దాఖలుచేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు సోమవారం తిరస్కరించింది. సెప్టెంబర్ ఒకటి నాటి కింది కోర్టు తీర్పును నిలిపివేస్తే సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు తనకు అవకాశం దక్కుతుందంటూ ఆయన చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. ఆనాడు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని రుజువు కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘంను హైకోర్టు ఆదేశించింది. గత సోమవారమే ఈ కేసులో వాదోపవాదనలు ముగిసినా తీర్పును జడ్జి జస్టిస్ కె.నటరాజన్ రిజర్వ్‌చేసి ఈ సోమవారం(11వ తేదీ) తీర్పును వెలువరించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ పెద్ద కుమారుడు రేవణ్ణ కుమారుడే ప్రజ్వల్.

లిఫ్టు కూలి ఏడుగురు మృతి

థాణే(మహారాష్ట్ర): థాణేలోని నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనంలో లిఫ్టు కుప్పకూలిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఘోడ్‌బందర్ రోడ్డులోని బల్కుమ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 40వ అంతస్తులో పనులు పూర్తి చేసుకుని కొందరు కార్మికులు లిఫ్టు ఎక్కారు. లిఫ్టు వైర్ ఒకటి తెగిపోవడంతో అది అదుపుతప్పి అండర్‌గ్రౌండ్‌లోని పీ3 పార్కింగ్ ప్రాంతంలో వేగంగా వచ్చి నేలను తాకింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు. గాయపడిన మరో కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడని సోమవారం అధికారులు తెలిపారు.

9 లక్షల ఏళ్ల క్రితం 99 శాతం మానవాళి మాయమైందట!

వాతావరణ మార్పులే కారణం.. కేవలం 1,300 మంది మాత్రమే మిగిలారట

దాదాపు 9 లక్షల ఏళ్ల క్రితం 99 శాతం మానవాళి ఉన్నపళాన తుడిచిపెట్టుకుపోయిందట. చివరి మంచు యుగం తుదినాళ్లలో చోటు చేసుకున్న విపరీతమైన వాతావరణ మార్పులే ఇందుకు కారణంగా నిలిచాయని అంతర్జాతీయ అధ్యయనం ఒకటి తాజాగా తేల్చింది. అయితే నేటి ఆధునిక మానవుని పూర్వీకులు హోమోసెపియన్ల ఆవిర్భావానికి కూడా ఈ మహా ఉత్పాతం పరోక్షంగా కారణమైందని చెబుతోంది.

చాన్నాళ్ల క్రితం. అంటే దాదాపు 9.3 లక్షల నుంచి 8.13 లక్షల ఏళ్ల క్రితం. పర్యావరణ పరంగా భూమ్మీద కనీవినీ ఎరుగని ఉత్పాతం సంభవించింది. ఈ మహోత్పాతం వల్ల అప్పటి జనాభాలో ఏకంగా 98.9 శాతం తుడిచిపెట్టుకుపోయిందట. దాని బారినుంచి కేవలం 1,300 మంది మాత్రమే బతికి బట్టకట్టారట. మన పూర్వీకులైన హోమోసెపియన్లు వీరినుంచే పుట్టుకొచ్చారట. చివరి మంచు యుగపు తుది నాళ్లలో ఈ పెను ఉత్పాతం జరిగింది.



అధ్యయనం ఇలా...

రోమ్‌లోని సపియెంజా వర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఫ్లారెన్స్ నిపుణులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. ఆ యుగంలో జరిగిన తీవ్ర వాతావరణ మార్పులు మానవ జాతి వినాశనానికి కారణంగా మారినట్టు వారు తేల్చారు.

అధ్యయనం కోసం 50కు పైగా విభిన్న దేశాలకు చెందిన 3,154 మంది సంపూర్ణ జన్యుక్రమాలను లోతుగా విశ్లేషించారు.

ఇందుకోసం ఫిట్ కోల్ అనే సరికొత్త బయో ఇన్ఫర్మాటిక్స్ పద్ధతిని అనుసరించారు.

ఈ దేటాను నాటి వాతావరణ, శిలాజ సమాచారంతో పోల్చి చూశారు.

హోమోసెపియన్ల ఆవిర్భావానికి కాస్త ముందు.. పూర్వ చారిత్రక యుగపు మిస్టరీల్లోకి తొంగిచూసేందుకు ఈ కొత్త వివరాలు ఎంత ఉపయోగపడ్డాయని సైంటిస్టులు చెప్పారు.

- ఈ దేటాను నాటి వాతావరణ, శిలాజ సమాచారంతో పోల్చి చూశారు.
- హోమోసెపియన్ల ఆవిర్భావానికి కాస్త ముందు.. పూర్వ చారిత్రక యుగపు మిస్టరీల్లోకి తొంగిచూసేందుకు ఈ కొత్త వివరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని సైంటిస్టులు చెప్పారు.
- జెనెటిక్ బాటిల్ నెక్‌గా పిలుస్తున్న ఈ మహోత్పాతానికి నాటి మంచు యుగ సంధి సందర్భంగా చోటు చేసుకున్న తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులే కారణమని తేలింది.
- ఆ దెబ్బకు నేటి ఆఫ్రికా ఖండమంతా ఎండిపోయి మరు భూమిగా మారిందట.
- మానవులతో పాటు ఏనుగుల వంటి భారీ క్షీరదాలన్నీ దాదాపుగా అంతరించాయట.
- ఆ దెబ్బకు దాదాపు 3 లక్షల ఏళ్ల పాటు మానవ ఉనికి ఉందా లేదా అన్నంత తక్కువ స్థాయికి పడిపోయిందట.
- ఆ సమయం నాటి శిలాజాల్లో మానవ అవశేషాలు అసలే దొరక్కపోవడం కూడా దీన్ని ధ్రువీకరిస్తోంది.
- ఈ అధ్యయన వివరాలు జర్నల్ సైన్స్‌లో పబ్లిష్ అయ్యాయి.

\- నేషనల్ డెస్క్, సాక్షి



'నాటి మంచు యుగపు మహోత్పాతం మానవ వికాసంలో ఒక రకంగా కీలక పాత్ర పోషించిందనే చెప్పాలి. తదనంతరం పుట్టుకొచ్చిన ఆదిమ మానవ సంతతే ఆఫ్రికా నుంచి యురేషియాకేసి విస్తరించింది. ఈ విస్తరణ ఆఫ్రికాలో హోమోసెపియన్లు, యూరప్‌లో నియాండర్తల్, ఆసియాలో దేనిసోవన్ల ఆవిర్భావానికి కారణమైంది'

\- ఫాబియో డీ విన్సెంజో,

బాణసంచా విక్రయంపై ఢిల్లీలో మళ్లీ నిషేధం

న్యూఢిల్లీ: అన్ని రకాల బాణాసంచా తయారీ, నిల్వ, వినియోగం, విక్రయంపై నిషేధం మరోసారి విధించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. రానున్న శీతాకాలంలో కాలుష్య తీవ్రతను తగ్గించే కార్యాచరణలో భాగంగానే ఈమేరకు నిర్ణయించి నట్లు పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం తెలిపారు. నగరంలో నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు సూచనలను ఢిల్లీ పోలీసులకు జారీ చేసినట్లు మీడియాకు వివరించారు. గత మూడేళ్లుగా ఢిల్లీ ప్రభుత్వం బాణాసంచాపై నిషేధం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. 'అయిదారేళ్లుగా ఢిల్లీలో వాయు నాణ్యత గణనీయంగా మెరుగుపడుతోంది. అందుకే ఈ ఏడాది కూడా బాణాసంచాపై నిషేధం అమలు చేయనున్నాం'అని రాయ్ చెప్పారు.

ఖలిస్తాన్ రెఫరెండం!

కెనడాలో ఎస్ఎఫ్‌జే నిర్వాకం ● స్పందన కరువు

టొరంటో: భారత వ్యతిరేక శక్తులు కెనడాలో తిష్టవేశాయని స్వయంగా ఆ దేశ ప్రధాని ట్రూడో ఎదుటే ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేసిన వేళ అదే రోజు మరో పరిణామం చోటుచేసుకుంది. భారత్‌ను విడగొట్టి సిక్కుల కోసం ఖలిస్తాన్‌ను ఏర్పాటుచేయడంపై అభిప్రాయం తెలపాలంటూ కెనడాలో సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) వేర్పాటువాద సంస్థ రెఫరెండం నిర్వహించింది. సుర్రే పట్టణంలో ఎస్ఎఫ్‌జే వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ సారథ్యంలో సిక్కు ప్రజాభిప్రాయ సేకరణ(రెఫరెండం) చేపట్టారు. భారీ వ్యక్తిగత భద్రత నడుమ రెఫరెండం ప్రాంతానికి వచ్చిన గురపత్వంత్ అక్కడే భారత వ్యతిరేక విద్వేష ప్రసంగం చేశారు. గురు నానక్ సింగ్ గురుద్వారా వద్ద జరిగిన ఈ రెఫరెండం తంతులో దాదాపు 7వేల మంది పాల్గొన్నారు. దాదాపు 50 వేలకుపైగా జనం వస్తారని ఆశించిన నిర్వాహకులకు భంగపాటు ఎదురైంది. కెనడా ప్రధాని ట్రూడోతో మోదీ ఖలిస్తాన్ వేర్పాటువాదం సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించిన ఆదివారం రోజే ఈ రెఫరెండంను ఎస్ఎఫ్‌జే నిర్వాహకులు పనిగట్టుకుని నిర్వహించారు. అంతకుముందు పత్వంత్ సింగ్ ఒక ఆడియో సందేశం విడుదలచేశారు. 'ఢిల్లీలో జీ20 సదస్సు జరుగుతున్న ప్రగతి మైదాన్ ప్రాంగణానికి భారీ సంఖ్యలో వెళ్లి నిరసన గళం వినిపించండి' అని కశ్మీర్ లోయలో నివసించే ముస్లింలకు పిలుపునిస్తున్నట్లు ఆ ఆడియోలో ఉంది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఖలిస్తాన్ వేర్పాటువాద జెండా ఎగరేస్తామని పత్వంత్‌సింగ్ సవాల్ చేశారు.

ఉగ్ర గ్రూపులు మళ్లీ యాక్టివ్

- మణిపూర్‌లో ఉద్రిక్తతలకు అవే కారణం
- కేంద్ర అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ/ఇంఫాల్: మణిపూర్‌లో కొన్నేళ్లుగా నిద్రాణంగా ఉన్న ఉగ్రవాదుల ముఠాలు ప్రజల నిరసనల నేపథ్యంలో మళ్లీ చురుగ్గా మారాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల ఓ సైనికాధికారిపై కాల్పులు జరిపి, తీవ్రంగా గాయపరిచిన ఘటనను వారు ఉదహరిస్తున్నారు. నిషేధిత యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్(యూ ఎన్ఎ ల్ఎఫ్), పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) ఉగ్రవాదులు దీని వెనుక ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు. మణిపూర్‌లో నిరసనలకు దిగుతున్న పౌరులతో కలిసిపోయి ఉద్రిక్తతలు పెంచుతున్నారని చెబుతున్నారు. గత వారం టెంగ్‌నౌపల్ జిల్లా మొల్‌నోయి గ్రామంలో గిరిజనులపై దాడికి యత్నించిన కొందరు ఆందోళన కారులను అస్సాం రైఫిల్స్, ఆర్మీ బలగాలు అడ్డుకోగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో లెఫ్టినెంట్ కల్నల్ రమణ్ త్యాగి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన గువాహటిలో చికిత్స పొందుతున్నారు. ఆందోళనకారుల్లో కొందరు నిషేధిత గ్రూపులకు చెందిన ఉగ్రవాదులు కూడా ఉన్నట్లు అనంతరం చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందని అధికారులు వివరించారు. యూఎన్ఎల్ఎఫ్, పీఎల్ఏతోపాటు కంగ్లీ యవోల్ కన్‌బా లుప్(కేవైకేఎల్), పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కంగ్లీపాక్ (పీఆర్ఈపీఏకే)లు కూడా రాష్ట్రంలో యాక్టివ్‌గా అయ్యాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. యూఎన్ఎల్ఎఫ్‌కు 330, పీఎల్ఏకు 300, కేవైకేఎల్ 25 మంది కేడర్ కలిగి ఉన్నాయన్నారు. కేవైకేఎల్ చీఫ్ టాంబా అలియాస్ ఉత్తమ్ సహా ఆ గ్రూప్‌లోని 12 మంది జూన్‌లో పట్టుబడ్డారన్నారు. ఈ గ్రూపులన్నిటికీ ఆర్మీపై దాడులు, బలవంతపు వసూళ్లు, డ్రగ్స్ రవాణా, స్మగ్లింగ్ వంటి ఘటనలకు పాల్పడిన చరిత్ర ఉందని వివరించారు. మణిపూర్‌లో అల్లర్లు మొదలైనప్పటినుంచి పోలీస్ స్టేషన్ల నుంచి ఎత్తుకెళ్లిన మెషిన్ గన్స్, రైఫిళ్లు వంటి 4,537 ఆయుధాలు, 6.32 లక్షల రౌండ్ల వరకు బుల్లెట్లు వీరి వద్దే ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మే నుంచి తెగల మధ్య కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

1,968 అడుగుల ఎత్తు నుంచి పడ్డా ఏమీ కాలేదు

వెల్లింగ్టన్: భూమి మీద నూకలు ఉండాలేగానీ ఆకాశం నుంచి పడ్డా నిక్షేపంగా ఉంటారనడానికి ప్రబల నిదర్శనమీ ఘటన. ఆశ్చర్యపరిచే ఈ ఘటన న్యూజిలాండ్‌లోని పర్వతసానువుల్లో శనివారం జరిగింది. నార్త్ ఐలాండ్‌లోని టరనకీ పర్వతంపైకి అధిరోహించేందుకు శనివారం పర్వతారోహకుల బృందం బయలుదేరింది. మధ్యాహ్నం సమయంలో 1,968 అడుగుల మేర ఎక్కాక ఓ పర్వతారోహకుడు అనూహ్యంగా జారి పడిపోయాడు. అయితే, అతడికి స్వల్పంగానే గాయాలయ్యాయి. అక్కడి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో అతడు పడిన చోట మంచు మెత్తగా మారడమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. అతడు ప్రాణాలతో ఉండటం అద్భుతమైన విషయమని, అతడు చాలా అదృష్టవంతుడని పోలీసులు అంటున్నారు. న్యూజిలాండ్‌లోని అత్యంత ప్రమాదకరమైన పర్వతాల్లో టరనాకీ ఒకటిగా పేర్కొంటారు. ఇదే ప్రాంతం నుంచి 2021లో ఇద్దరు పర్వతారోహకులు జారిపడి మృతి చెందారు. నార్త్ ఐలాండ్‌లోనే నిద్రాణ అగ్నిపర్వతం కూడా ఉంది. ఇతర పర్వతాల నుంచి వేరుపడినట్లుగా దూరంగా ఉండటం, తీరానికి సమీపంలో ఉండటం, వేగంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించడం వంటి పరిస్థితులు న్యూజిలాండ్‌లో టరనాకీ వద్దతప్ప మరెక్కడా లేవని మౌంటెన్ సేఫ్టీ కౌన్సిల్ పేర్కొంది.

అత్యంత కీలక వ్యూహాత్మక భాగస్వామి

సౌదీ అరేబియాను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యాఖ్య ● సౌదీ యువరాజు సల్మాన్ బిన్‌తో ద్వైపాక్షిక చర్చలు



మోదీ, సల్మాన్‌ల ఆలింగనం

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా దేశ రాజధానికి విచ్చేసిన సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ బిన్ అబ్దుల్‌అజీజ్ అల్–సౌద్‌తో సోమవారం ప్రధాని మోదీ విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతకుముందు ఉదయం ఆయనకు రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సాదర స్వాగతం పలికారు. తర్వాత ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో సల్మాన్ బిన్, మోదీ ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ మాట్లాడారు. ' ఈ ప్రాంతంతోపాటు ప్రపంచ సుస్థిరతకు, సంక్షేమానికి భారత్–సౌదీ అరేబియా వ్యూహాత్మక భాగస్వామ్యం ఎంతో కీలకం. భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగిస్తున్న దేశాల్లో సౌదీ అరేబియా కూడా ఒకటి. రెండు దేశాలు కాలానుగుణంగా సత్సంబంధాలను సుదృఢం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి' అని మోదీ అన్నారు. సోమవారం ఇండియా–సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి తొలి భేటీలో ద్వైపాక్షిక బంధంపై ఇద్దరు అగ్రనేతలూ సమీక్ష జరిపారు. రక్షణ, ఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజారోగ్యం, ఆహార భద్రత, సంస్కృతి, సంక్షేమం తదితర అంశాలు మండలి తొలి భేటీలో చర్చకొచ్చాయని విదేశాంగ శాఖ కార్యదర్శి అరీందర్ బాగ్చీ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. 'దేశాల దగ్గరి బంధాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు అనువైన కొన్ని మార్గాలను అన్వేషించాం. ఇకపై మా భాగస్వామ్యం నూతనోత్సాహంతో కొత్త మలుపు తీసుకోనుంది. గ్రిడ్‌ల అనుసంధానం, పునరుత్పాదక ఇంధన వనరులు, సెమీ కండక్టర్లు, సరకు రవాణా గొలుసు తదితర కీలక అంశాలపైనా చర్చలు జరిపాం. చర్చలు ఫలప్రదంగా సాగాయి.' అని మోదీ వ్యాఖ్యానించారు.

సంక్లిష్ట అంశాల్లో భాగస్వామ్యం పెంపుకోసం..

ఇరు దేశాల మధ్య సంక్లిష్టంగా మారిన కొన్ని అంశాల్లో సందిగ్ధతను తొలగించుకునేందుకు ఇండియా–సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలిని నెలకొల్పాలని 2019 ఏడాదిలో నిర్ణయించారు. జీ20 సదస్సు తర్వాత భారత్‌లో సల్మాన్ బిన్ అధికారిక పర్యటన కొనసాగిస్తున్నారు. ' భారత్‌కు రావడం ఆనందంగా ఉంది. జీ20 సదస్సుకు విజయవంతంగా నిర్వహించినందుకు భారత్‌కు నా అభినందనలు. విశ్వ శ్రేయస్సు కోసం జీ20 సదస్సులో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. మోదీతో చర్చలు ఫలవంతంగా సాగాయి. మా రెండు దేశాల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇకమీదటా కలిసి పనిచేస్తాం' అని సల్మాన్ వ్యాఖ్యానించారు. మధ్యప్రాచ్యంలో భారత్‌కు సౌదీ అరేబియా దేశం అత్యంత కీలకమైంది. గత కొన్నేళ్లలో ఈ రెండు దేశాల మధ్య మరింత మెరుగైన సత్సంబంధాలు ఏర్పడ్డాయి. రక్షణ, భద్రత సంబంధ అంశాలపై ఎక్కువగా దృష్టిపెట్టాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్యం జీవితకాల గరిష్టానికి చేరుకున్న వేళ సల్మాన్ బిన్ భారత్‌లో పర్యటించడం గమనార్హం. 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్–సౌదీ వాణిజ్య వ్యాపారం విలువ ఏకంగా 52.75 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. భారత్‌కు సౌదీ నాలుగో అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా కొనసాగుతోంది. 13 లక్షల సైన్యానికి సారథి అయిన నాటి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఎంఎం నరవాణె 2020 డిసెంబర్‌లో సౌదీలో పర్యటించారు. భారత సైన్యాధ్యక్షుడు ఒకరు సౌదీలో పర్యటించడం ఇదే తొలిసారి.



ప్రధాని మోదీ, యువరాజు సల్మాన్‌ల సమక్షంలో ఇరు దేశాల ప్రతినిధి బృందాల చర్చలు

ఏమిటీ ఇండియా-సౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి?

2019 అక్టోబర్‌లో మోదీ సౌదీలో పర్యటించినపుడు దీనిని ఏర్పాటుచేశారు. రెండు దేశాల మధ్య సంక్లిష్టంగా మారిన వ్యవహారాలను పరిష్కరించుకుని సంబంధాలు సజావుగా సాగేందుకు కృషిచేయడమే ఈ మండలి ముఖ్యోద్దేశం. రెండు దేశాల మధ్య వివాదంగా మారిన అంశాలను సరిదిద్దుకుంటూ, నూతన వృద్ధి అవకాశాలను సృష్టించుకుంటూ పరస్పరం రెండు దేశాలూ వృద్ధిపథంలో దూసుకుపోయేందుకు ఈ మండలి కృషిచేస్తోంది.

త్వరలో ఎఫ్‌టీఏ ఓ కొలిక్కి

భారత్, బ్రిటన్ ప్రకటన

న్యూఢిల్లీ: ఇరుదేశాల మధ్య గణనీయమైన వాణిజ్యం, వర్తకానికి బాటలు పరిచే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)ను వీలైనంతగా త్వరగా కొలిక్కి తెస్తామని భారత్, బ్రిటన్ ప్రకటించాయి. జీ20 సదస్సులో భాగంగా భారత్‌కు విచ్చేసిన బ్రిటన్ ఆర్థిక మంత్రి జెరిమి హంట్.. భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో విడిగా భేటీ అయ్యారు. 12వ విడత ఇండియా–యూకే ఎకనమిక్, ఫైనాన్షియల్ డైలాగ్ పేరిట జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై ఆర్థిక మంత్రులిద్దరూ చర్చలు జరిపారు. ' ప్రధానంగా పెట్టుబడులపై చర్చించాం. చర్చలను వేగవంతం చేసి కొన్ని ఒప్పందాలపై తుది సంతకాలు జరిగేందుకు కృషిచేస్తున్నాం' అని తర్వాత నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే భారతీయ ఉత్పత్తులు తక్కువ కస్టమ్స్ సుంకాలతో బ్రిటన్ మార్కెట్లోకి అడుగుపెట్టగలవు. ధర తక్కువ ఉండటంతో వాటికి అక్కడ గిరాకీ ఒక్కసారిగా పెరుగుతుంది. దీంతో భారత్‌లో పారిశ్రామికోత్పత్తి ఎగసి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. బ్రిటన్ వస్తువులు సైతం తక్కువ ధరకే భారత్‌లో లభిస్తాయి. ఉభయ దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఎంతో ప్రయోజనకరమైన ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరగా అమల్లోకి రావాలని మార్కెట్‌వర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

ఇకనైనా దేశ సమస్యలపై దృష్టి పెట్టండి: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: జీ20 సదస్సు ముగిసిన నేపథ్యంలో ఇప్పుడైనా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. 'ప్రధాని మోదీ నిజాలను దాచిపెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మణిపూర్ హింస వంటి దేశీయ సమస్యలపై ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఖర్గే సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యాఖ్యలు చేశారు. ఆగస్టులో సాధారణ భోజనం ధర 24 శాతం పెరిగిందని, దేశంలో నిరుద్యోగ రేటు 8 శాతం పెరగడంతో యువత భవిష్యత్తు అంధకారమైందని అన్నారు. అత్యవసర వస్తువుల ధరలు ఆగకుండా పెరుగుతూనే ఉన్నాయని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో కుంభవృష్టి

గత 24 గంటల్లో 19 మంది దుర్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌పై వరుణ ప్రకోపం కొనసాగుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఉత్తరప్రదేశ్‌లో జన జీవనం స్తంభించింది. గత 24 గంటల్లో వర్షసంబంధ ఘటనల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మధ్య యూపీలో కురుస్తున్న కుండపోత వర్షాలకు సాధారణ ప్రజాజీవితం అతలాకుతలం అవుతోంది. స్కూళ్లు మూతపడ్డాయి. రాష్ట్ర రాజధాని లక్నోలోనూ చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. బారాబంకీ ప్రాంతంలో రైలు పట్టాలు నీటమునిగాయి. గత 24 గంటల్లో 22 జిల్లాల్లో 40 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదైంది.

లిబియా వరదల్లో 2 వేల మంది మృతి



కైరో: ఆఫ్రికా దేశం లిబియాలో సంభవించిన తుపాను వరదల్లో సుమారు 2 వేల మంది మృతి చెందారు. తుపాను ప్రభావం తూర్పు ప్రాంతంలోని డెర్నా నగరంపై ఎక్కువగా ఉందని ప్రధాని ఒస్సామా హమద్ చెప్పారు. డెర్నా చుట్టుపక్కల ప్రాంతాల్లో మరో 50 మంది వరకు గల్లంతైనట్లు వెల్లడించారు. డెర్నా నగరానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయన్నారు. అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, సమాచార వ్యవస్థ ధ్వంసమైందని తెలిపారు. డెర్నాను విపత్తు జోన్‌గా ప్రభుత్వం ప్రకటించింది.

క్యాన్సర్ కణాలకు చెక్!

- వాటిని నాశనం చేసే అతిసూక్ష్మ గోల్డ్, కాపర్ సల్ఫైడ్ రేణువుల సృష్టి
- భారతీయ శాస్త్రవేత్తల బృందం ఘనత

న్యూఢిల్లీ: మహమ్మారి క్యాన్సర్ కణాల అంతానికి నడుం బిగించిన భారతీయ శాస్త్రవేత్తల బృందం ఆ క్రతువులో విజయవంతమైంది. అతి సూక్ష్మ బంగారు, రాగి సల్ఫైడ్ రేణువులను శాస్త్రవేత్తలు సృష్టించారు. రోగి శరీరంలో క్యాన్సర్ సోకిన చోట ఈ రేణువులను ప్రవేశపెట్టి వీటిని ఫొటో థర్మల్, ఆక్సీకరణ ఒత్తిడికి గురిచేసినపుడు ఇవి క్యాన్సర్ కణాలను విజయవంతంగా వధించాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)కి చెందిన అధ్యయన బృందం సాధించిన ఈ ఘనత తాలూకు వివరాలు ఏసీఎస్ అప్లయిడ్‌నానో మెటీరియల్స్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి. గోల్డ్, కాపర్ సల్ఫైడ్ రేణువులు క్యాన్సర్ కణాలను అత్యంత సులభంగా గుర్తించగలవు కూడా. రేణువులను రోగమున్న చోట ప్రవేశపెట్టాక అక్కడ కాంతిని ప్రసరింపజేయాలి. కాంతిని శోషించుకున్న రేణువులు ఉష్ణాన్ని జనింపజేస్తాయి. వేడితోపాటే విషపూరిత స్వేచ్ఛాయుత ఆక్సిజన్ అణువులను ఇవి విడుదలచేస్తాయి. ఇవి క్యాన్సర్ కణాలను ఖతంచేస్తాయి. గోల్డ్, కాపర్ సల్ఫైడ్ రేణువులు వ్యాధి నిర్ధారణ కారకాలుగా పనిచేస్తాయి. కాంతిని సంగ్రహించి అల్ట్రాసౌండ్ తరంగాలను విడుదలచేస్తాయి. దీంతో ఏ దిశలో ఎన్ని క్యాన్సర్ కణాలు ఉన్నాయో స్పష్టంగా తెల్సుకోవచ్చు. ఈ విధానం క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ ప్రక్రియను మరింత మెరుగుపరచనుంది. క్యాన్సర్ కణజాలం గుండా ఈ అల్ట్రాసౌండ్ తరంగాలు ప్రసరించినపుడు క్యాన్సర్ కణతులపై ఆక్సిజన్ ఆనవాళ్లు, వాటి ఆకృతులు అత్యంత స్పష్టంగా కనిపించనున్నాయి. గతంలో ఈ రేణవులను పెద్ద పరిమాణంలో తయారు చేయగా ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తలు ఈసారి అత్యంత సూక్ష్మ స్థాయిలో అంటే 8 నానోమీటర్ల పరిమాణంలో తయారు చేయగలిగారు. కాపర్ సల్ఫైడ్ ఉపరితలంపై అత్యంత సూక్ష్మమైన పుత్తడి రేణువులను చల్లి ఈ గోల్డ్, కాపర్ మిశ్రమధాతు రేణువులను సృష్టించారు. ఇవి ఇంత చిన్న పరిమాణంలో ఉండటంతో సులువుగా క్యాన్సర్ కణజాలంలోకి చొచ్చుకుపోగలవు. ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కణాలపై ఈ రేణువులను ప్రయోగించి చక్కని ఫలితాలను సాధించారు.

రష్యాకు రైల్లో కిమ్

- వ్లాడివోస్టోక్‌లో పుతిన్‌ను కలుసుకునే అవకాశం
- ఒకట్రెండు రోజుల్లోనే వీరిద్దరి సమావేశం

సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ రష్యాకు పయన మయ్యారు. ఆయన తన సొంత బుల్లెట్ ప్రూఫ్ రైలులో ఆదివారం సాయంత్రం రాజధాని ప్యాంగాంగ్ వదిలివెళ్లారని దక్షిణ కొరియా వర్గాలు తెలిపాయి. మూడు రోజులపాటు జరిగే ఒక అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు పుతిన్ సోమవారం వ్లాడివోస్టోక్ వెళ్లారని, అక్కడే ఆయనతో కిమ్ సమావేశమవ్వొచ్చని చెబుతున్నారు. కిమ్ తమ దేశానికి వస్తున్నారంటూ రష్యా కూడా సోమవారం ధ్రువీకరించింది. అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు త్వరలో కిమ్ రానున్నారని క్రెమ్లిన్ అధికార వెబ్‌సైట్ పేర్కొంది. పుతిన్, కిమ్‌లు త్వరలో కలుసుకుంటారని ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ కూడా తెలిపింది. 'రష్యా పర్యటనలో కామ్రేడ్ కిమ్ జొంగ్ ఉన్, కామ్రేడ్ పుతిన్‌తో చర్చలు జరుపుతారు'అని పేర్కొంది. అయితే, ఈ భేటీ ఎప్పుడు, ఎక్కడ ఉంటుందనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. కిమ్ విదేశీ పర్యటనలకు వినియోగించే ఆకుపచ్చ బోగీలతో కూడిన బుల్లెట్ ప్రూఫ్ రైలును రష్యా సరిహద్దుల్లోని ఉత్తరకొరియా రైల్వే స్టేషన్‌లో ఉండగా గుర్తించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. ఉక్రెయిన్‌తో ఏడాదిన్నరగా కొనసాగుతున్న యుద్ధానికి అవసరమైన ఆయుధాల కొనుగోలుకు కిమ్‌తో పుతిన్ ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశాలున్నాయన్నది పశ్చిమదేశాల అంచనా. కోవిడ్ మహమ్మారి ప్రబలిన దాదాపు నాలుగేళ్ల తర్వాత కిమ్ మొట్టమొదటి విదేశీ పర్యటన ఇదే.

రైలులోనే ఎందుకు?

గతంలో 2019లో మొదటిసారిగా వ్లాడివోస్టోక్‌లో పుతిన్‌తో సమావేశమైనప్పుడు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో సమావేశాలకు రైలులో వెళ్లినట్లుగానే ఈసారీ కిమ్ రష్యాకు రైలులోనే బయలుదేరారు. సొంత రైలులోనే విదేశీ పర్యటనలు చేసిన దివంగత పాలకుడు, తన తండ్రి పాటించిన సంప్రదాయాన్ని కిమ్ కూడా కొనసాగిస్తున్నారు. ఈ రైలుకు 20 బుల్లెట్ ప్రూఫ్ బోగీలుంటాయి. దీనివల్ల సాధారణ రైళ్ల కంటే ఇది ఎక్కువ బరువుంటుంది. సరాసరిన గంటకు 59 కిలోమీటర్లకు మించి వేగంతో ఇది ప్రయాణించలేదు. ఈ వేగంతో ప్యాంగ్యాంగ్ నుంచి వ్లాడివోస్టోక్‌కు వెళ్లడానికి ఒక రోజంతా పడుతుంది.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం



కరీంనగర్ కార్పొరేషన్: పైప్‌లైన్ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతులు జరుగుతున్నందున ఈ నెల 13 (బుధవారం) హైలెవెల్ జోన్ అంబేడ్కర్ రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలకసంస్థ ఈఈ కిష్టప్ప తెలిపారు. రిజర్వాయర్ పరిధిలోని 2,3,4,5,24,25,26,27,28,42,44 డివిజన్‌లకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా డివిజన్‌ల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని ఆయన కోరారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కేసీఆర్ భయంతోనే ఇండియా పేరు మార్పు

- కోర్టుకు హాజరుకాని బండి సంజయ్ రాజీనామా చేయాలి
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్



మాట్లాడుతున్న రవీందర్ సింగ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావంతోనే ప్రధాని మోదీ ఇండియా పేరు భారత్‌గా మార్చేందుకు సిద్ధపడ్డారని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఫైర్‌అయ్యారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంతకాలం డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా అన్న మోదీ భారత రాష్ట్ర సమితితో భయపడ్డారన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పెద్ద బ్లాక్ మెయిలర్ అని మండిపడ్డారు. దురుద్దేశ పూర్వకంగా కేసులు వేసి, విచారణకు డుమ్మాలు కొడుతున్నారని ఆరోపించారు. ఎంపీ ప్రత్యర్థులను బ్లాక్ మెయిల్ చేసేందుకే కోర్టులో కేసులు వేస్తారన్నారు. అమెరికా వెళ్లి ఫుట్‌బాల్ ఆడే తీరిక ఉన్న సంజయ్‌కు కోర్టులో తాను వేసిన కేసుకు తానే హాజరుకానంత బిజీ ఏముందని ప్రశ్నించారు. న్యాయస్థానాల మీద ఏమాత్రం గౌరవంలేని, స్థానిక సమస్యలను పట్టించుకోని సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం వసూళ్ల కోసమే ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారని, అక్కడ ఎంత వసూలు చేశారో ప్రజలకు వెల్లడించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సంజయ్‌కు ఓటర్లు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

14న జాబ్‌మేళా

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈనెల 14న మినీజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి దేవేందర్‌రావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ యువకులు తమ బయోడేటా (3 సెట్స్), విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో అదేరోజు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9573381973, 9392664569 నంబర్లను సంప్రదించాలన్నారు.

'దిలేర్ షాయిరీ' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్ కల్చరల్: విద్వేషంతో రగిలిపోతున్న సమాజంలో సోదరత్వపు సోయిని ఉద్దీపన చేసే దీపకాంతి 'దిలేర్ షాయిరీ' కవిత్వమని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) రాష్ట్ర పూర్వాధ్యక్షుడు గాజోజు నాగభూషణం అన్నారు. ప్రముఖ కవి స్కైబాబ కవితా సంపుటి 'దిలేర్ షాయిర్ష్ పరిచయ సభ సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగభూషణం హాజరై, మాట్లాడారు. మానవత్వాన్ని ప్రోది చేసే కవిత్వ సేద్యగాడుగా కవి స్కైబాబను అభివర్ణించారు. తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్కైబాబ సామాజిక వేత్త, సంస్కరణవాది అన్నారు. జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంజయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కవులు లాయక్ అలీ, పుప్పాల శ్రీరాం, సీవీ.కుమార్, పెనుకొండ బసవేశ్వర్, బాలసాని కొమురయ్య, ఎస్.చైతన్య, దామరకుంట శంకరయ్య, పీఎస్.రవీంద్ర, కూకట్ల తిరుపతి, సరసిజ, సిరిపురం వాణిశ్రీ, చిందం సునీత, కనకం శ్రీనివాస్, గసిగంటి సంజీవ్, ఎండీ.మునీర్, విలాసాగరం రవీందర్ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్

కరీంనగర్ కార్పొరేషన్: విధుల్లో అలసత్వం వహించిన కార్పొరేషన్‌లోని ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ షోకాజు నోటీసు జారీ చేశారు. రెండు రోజుల క్రితం నగరంలో పర్యటించిన సందర్భంలో పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడం, పారిశుద్ధ్యం నిర్వహణ అంతంతమాత్రంగానే ఉండడంతో కమిషనర్ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ, కార్మికుల హాజరుపట్టికను పరిశీలించినట్లు తెలిసింది.

దళితబంధులో గోల్‌మాల్!



సాక్షి ఫోకస్

- రూ.కోటి వ్యాపారంలో కొటేషన్ల మాయ?
- అధిక ధరలకు కోట్ చేశారంటున్న ఉన్నతాధికారులు
- యూనిట్లు నడవకపోవడంతో బలపడుతున్న అనుమానాలు
- ఈ వ్యవహారంలో ఇప్పటికే ఓ ఉద్యోగి సస్పెన్షన్
- మరో ఇద్దరు అధికారుల పాత్రపై ఆరా!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధులో మరో అవినీతి బాగోతం వెలుగు చూసింది. వాస్తవ ధర కంటే అధికంగా ఇన్వాయిస్‌లు సమర్పించి ఎక్కువ మొత్తంలో బిల్లుల డ్రా చేశారన్న విమర్శలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఏడాది హుజూరాబాద్‌లో ప్రారంభించిన రెండు యూనిట్లు సమర్పించిన ఇన్వాయిస్‌లలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. దీనికితోడు ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు సదరు యూనిట్లు వ్యాపారం నడవకపోవడం కలెక్టరేట్ అధికారుల అనుమానాలు బలపడేలా చేస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ఓ ఉద్యోగిని సస్పెండ్ చేసిన అధికారులు మరో ఇద్దరు అధికారుల పాత్రపైన ఆరా తీస్తున్నారని తెలిసింది. ఈ వ్యవహారంతో అప్రమత్తమైన అప్పటి కలెక్టర్ యూనిట్ జారీకి నిబంధనలు మరింత కఠినతరం చేశారు.

పథకం నేపథ్యం ఇదీ..

దళితుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మార్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం హుజూరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది. 2021 ఆగస్టు 16న హుజూరాబాద్ నియోజకవర్గం శాలపల్లి వేదికగా పథకాన్ని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రారంభించి లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో సర్వేచేసిన అధికారులు జమ్మికుంట, హుజూరాబాద్, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల్లో లబ్ధిదారులను గుర్తించారు. ఇప్పటి వరకు దాదాపు 18,021 మందికి యూనిట్ల కోసం ఎంపిక చేశారు. వీరందరికీ దాదాపుగా పంపిణీ కూడా పూర్తయింది. ఈక్రమంలో హుజూరాబాద్‌లో కొందరు చేతివాటం ప్రదర్శించారన్న విషయం అధికారుల దృష్టికొచ్చింది.

దబ్బుల రికవరీ ఉంటుందా?

వాస్తవానికి ఈ కొటేషన్ల వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారాయని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అధికారులు మాత్రం కేవలం చిరుద్యోగిపై చర్యలతో సరిపెట్టారు. కానీ.. కొంతకాలంగా ఈ వ్యవహారంలో విమర్శలు పెరుగుతుండడం, ఆరోపణలు వస్తోన్న రెండు యూనిట్లు అప్పటి నుంచి సరిగ్గా వ్యాపారం నడపకపోవడం ఉన్నతాధికారుల అనుమానాలను మరింత పెంచాయి. దీంతో ఈ వ్యవహారంలో రాజకీయ జోక్యం, ఆ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులైన అధికారుల పాత్రపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ విషయంలో ప్రస్తుత కలెక్టర్ లోతైన విచారణకు ఆదేశించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగైతేనే.. అధిక కొటేషన్లతో సామగ్రి కొన్న రెండు యూనిట్ల విషయంలో దుర్వినియోగమైన డబ్బులు ఎంత? ఆ సొమ్ములు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయని అభిప్రాయపడుతున్నారు.

అసలేం జరిగింది?

పథకం ఆరంభంలో కొందరు అక్రమార్కులు దళితబంధులో పైరవీలకు దిగారు. దీన్ని ముందే గుర్తించిన అప్పటి కలెక్టర్ క్లస్టర్ ఆఫీసర్ల ద్వారా లబ్ధిదారుల సమాచారం సేకరించి, దళితబంధు యాప్ ద్వారా పథకాల మంజూరు చేయించారు. ఇటీవల అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో హుజూరాబాద్‌లో ఒక ఉద్యోగిని కలెక్టర్ ఆదేశాలతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీని వెనుక అసలైన కారణం ఇంతవరకూ వెలుగులోకి రాలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొటేషన్ల విషయంలో కొందరు అధికారులను బురిడీ కొట్టించడమే అసలు కారణం. రూ.కోటి విలువైన రెండు యూనిట్లలో తాము మొదలుపెట్టిన వ్యాపార సామగ్రికి వాస్తవ ధర కంటే మూడింతలు అధికంగా చూపినట్లు అధికారుల దృష్టికొచ్చింది. ఈ ఉదంతాన్ని అప్పటి కలెక్టర్ కర్ణన్ తీవ్రంగా పరిగణించారు. ఆయన కన్నెర్ర చేయడంతో సదరు జిల్లా పరిషత్ ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. తరువాత జవాబుదారీతనం పెంచేందుకు జీఎస్టీ గుర్తింపు వ్యాపారుల నుంచి మాత్రమే కొటేషన్ తీసుకోవాలని, ముందస్తుగా అఫిడవిట్‌పై సంతకం చేయాలన్న కఠిన నిబంధనను అమలులోకి తెచ్చారు. వాస్తవానికి ఈ వ్యవహారంలో కేవలం జెడ్పీ ఉద్యోగి మాత్రమే కాకుండా మరో ఇద్దరి పాత్ర వెలుగులోకి రాలేదు. తాజాగా మరోసారి ఈ వ్యవహారంపై దృష్టి సారించిన అధికారులు వారి పాత్రపైనా ఆరా తీస్తున్నారని తెలిసింది.

వేలిముద్ర వేయకుంటే రేషన్ కోతే

- రేషన్ యూనిట్ ఎట్ ఈకేవైసీ
- ఏ రేషన్ దుకాణంలోనైనా అవకాశం
- కార్డుల ఆధారంగా యూనిట్ల పరిశీలన
- నేటి నుంచి రేషన్ దుకాణాల్లో సదరు ప్రక్రియ



మొత్తం గ్రామ పంచాయతీలు: 313
మున్సిపాలిటీలు: 5
జిల్లాలో మొత్తం కార్డులు: 2,74,620
మొత్తం యూనిట్లు: 8,17,156
మొత్తం రేషన్ దుకాణాలు: 5,66

కరీంనగర్ అర్బన్:

ఇక రేషన్ కార్డుల ఏరివేతతో పాటు యూనిట్లను తొలగించనున్నారు. గత నెలలో 'ఇక డి డూప్లికేట్' శీర్షికన 'సాక్షి' ఈ అంశాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. సదరు ప్రక్రియ ఈనెల 12 (మంగళవారం) నుంచి అమలు చేయనున్నారు. సదరు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించారు. బోగస్ యూనిట్లు, కార్డులు తొలగనుండగా నిర్దిష్ట కార్డులు కొనసాగించనున్నారు. రేషన్ దుకాణం వారీగా ఏరివేత ప్రారంభం కానుండగా సోమవారం మధ్యాహ్నం ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పాస్) సైట్‌ను అప్‌డేట్ చేశారు. ఇక రేషన్ కార్డులో ఉన్నవారందరూ వేలిముద్ర వేయాల్సిందే. సదరు ప్రక్రియతో బోగస్ పేర్లు, మరణించినవారి పేర్లు తొలగించనున్నారు.

రేషన్ దుకాణం వారీగా ప్రక్రియ

జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా 2.74 లక్షల కార్డుదారులుండగా 8.17లక్షల యూనిట్లున్నాయి. గతంలో 487 రేషన్ దుకాణాలుండగా కొత్తగా 79 రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే కార్డులు, యూనిట్ల ఏరివేతను రేషన్ డీలర్ పరిధిలో చేపట్టనున్నారు. డి డూప్లికేట్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ నొ యువర్ కస్టమర్ (ఈకేవైసీ) చేపట్టనున్నారు. అందుకు ఈ-పోస్ మిషన్‌లోనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానించారు. ప్రస్తుతం రేషన్ బియ్యం తీసుకోవాలంటే వేలిముద్ర వేస్తున్నట్లుగానే అదే విధానంలో రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేయాలి. కార్డులో ఎంత మంది ఉంటే అంతమంది వేలిముద్ర వేయాల్సిందే. ఒకవేళ వేలిముద్ర పడకుంటే ఐరిస్ ద్వారా నిర్ధారించనున్నారు. సదరు ప్రక్రియలో పాల్గొననివారి పేరును కార్డు నుంచి తొలగించనున్నారు. ఎవరూ రాకుంటే కార్డును రద్దు చేయనున్నట్లు సమాచారం.

కేవైసీ పరిశీలన ఇలా..

రేషన్ కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులు మొత్తం సమీప రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పోస్ యంత్రంలో వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర వేయగానే రేషన్ కార్డు నంబర్‌తో పాటు ఆధార్ నంబర్ చూపిస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆకుపచ్చ వెలుగు వచ్చి సదరు వినియోగదారుని కేవైసీ పునరుద్ధరించబడుతుంది. ఒకవేళ కేవైసీ పునరుద్ధరణలో ఈ-పాస్ యంత్రంలో రెడ్ వెలుగు వస్తే సదరు వినియోగదారుని రేషన్ కార్డు, ఆధార్ కార్డు సరిపోల్చలేమంటూ రిజెక్టు సూచిస్తుంది. దీంతో సదరు యూనిట్ (రేషన్ కార్డులోని ఒక పేరు) రేషన్ కార్డు నుంచి తొలగించబడుతుంది. రేషన్ కార్డులో ఎంతమంది పేర్లు ఉంటాయో వారంతా రేషన్ దుకాణానికి ఒకేసారి రావాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక కుటుంబంలో ఆరుగురు సభ్యులు (యూనిట్లు) ఉంటే అందరూ కేవైసీకి వెళ్లాలి. ఒకవేళ ఒకరో, ఇద్దరో గైర్హాజరైతే వాళ్లు కుటుంబం నుంచి దూరమయ్యారని గుర్తిస్తూ అందుబాటులో ఉన్న వ్యక్తుల కేవైసీ పరిశీలిస్తారు.

డి డూప్లికేట్ తర్వాతే కొత్త కార్డులు

అయితే ఈ నెల 21నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా అదంతా తప్పుడు ప్రచారమని అధికారులు కొట్టిపారేశారు. కాగా.. డి డూప్లికేట్ పూర్తయ్యాకే కొత్తరేషన్ కార్డుల జారీ ఉంటుందని సమాచారం. పెళ్లయినవారితో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు, నూతనంగా జన్మించిన పిల్లలను కార్డులో చేర్చుకునేలా వెసులుబాటు కల్పించే అవకాశముంది.

సమాచారమేది?

ఈకేవైసీపై రేషన్ డీలర్లకు సమాచారం లేకపోవడం విడ్డూరం. జిల్లాలో మంగళవారం నుంచి సదరు ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు వివరించగా అసలు డీలర్లకు సదరు విషయమే తెలియకపోవడం గమనార్హం. కేవైసీ ఎలా చేయాలనే అంశంలో అవగాహన కల్పించకపోవడంతో రేషన్ పంపిణీ మరింత జాప్యమయ్యే అవకాశాలున్నాయి.

ఓటరు అర్జీల పరిశీలన స్పీడప్

- స్వీప్ కార్యాచరణపై ప్రణాళిక తయారు చేయండి
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో కలెక్టర్ గోపి

కరీంనగర్ అర్బన్: ఓటరు జాబితా సవరణలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను ప్రతీ పోలింగ్ కేంద్రం వారీగా పరిశీలించాలని, సంబంధిత అధికారులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన దరఖాస్తుల పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అన్నారు. జనాభా ఓటరు నిష్పత్తి రూపొందించే సమయంలో 2023 సంవత్సరానికి ఉన్న జనాభా అంచనాను తీసుకోవాలన్నారు. జిల్లాలో అధికంగా, అత్యల్పంగా ఓటరు నమోదు జరిగిన పోలింగ్ కేంద్రాలను రివ్యూ చేయాలని, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లలో లింగ నిష్పత్తి పరిశీలించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన థర్డ్ జెండర్ లు, సెక్స్ వర్కర్లు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. నూతనంగా మంజూరు చేసిన ఓటర్లు, ముద్రించిన ఓటర్ గుర్తింపు కార్డులు, పంపిణీపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని, ఈ నెలాఖరు వరకు మంజూరు చేసిన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు త్వరగా ముద్రణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే స్వీప్ యాక్టివిటీస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతీ విద్యాసంస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని, జిల్లాలో ఉన్న వివిధ రంగాలకు చెందిన ప్రజలను ప్రభావితం చేయగలిగే ప్రముఖులను గుర్తించి వారితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నించాలని అన్నారు. జిల్లాలో జరిగే స్వీప్ యాక్టివిటీస్, ఓటరు అవగాహన కార్యక్రమాలపై మీడియాలో ప్రచారం వచ్చే విధంగా చూడాలని, ప్రతీ కార్యక్రమ వివరాలు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా, ఓటరు కార్డుల పంపిణీ, ఈవీఎం వీవీప్యాట్ యంత్రాల లభ్యత, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అనేక అంశాల పరిశీలన పూర్తిచేయాలని అన్నారు. కలెక్టర్ డా.బి.గోపి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, సోలిపేట రాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభ్యసన ఫలితాలు సాధించాలి

- ఉన్నతి శిక్షణ కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు



టీచర్లతో డీఈవో జనార్దన్‌రావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): భాషలో మౌలిక సామర్థ్యాలైన చదవడం, రాయడంతోపాటు సామర్థ్యాలవారీగా అభ్యసన ఫలితాలు సాధించేందుకు తెలుగు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మానకొండూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాలకు చెందిన తెలుగు టీచర్ల ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదవడం, రాయడంలో వెనకబడ్డారని, పిల్లల స్థాయిని బట్టి బోధనా ప్రణాళికలు రూపొందించుకొని, ధ్వని గుర్తింపు, అక్షర గుర్తింపు చేసేలా ప్రయత్నించాలని సూచించారు. సిలబస్ ప్రకారం పాఠ్యపుస్తకంలోని పాఠాలు బోధిస్తూనే చదవడం, రాయడం నేర్పించాలని పేర్కొన్నారు. అనంతరం టీచర్లను సత్కరించారు. ఎస్‌ఆర్‌జీ రాష్ట్ర పరిశీలకుడు గాజుల రవీందర్, రిసోర్స్ పర్సన్ నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- 14 నుంచి ప్రారంభోత్సవాల జాతర
- సమీక్షలో మేయర్ సునీల్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టం చేశారు. పనుల్లో అలసత్వం వహిస్తున్న మల్టీపర్పస్ పార్క్ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో రివ్యూ నిర్వహించారు. పనులు పూర్తయిన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు వరుసగా చేపడుతామన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో 11 జంక్షన్లలో లైటింగ్ ప్రారంభిస్తామన్నారు. అలాగే 17న ఎస్‌ఆర్‌ఆర్ వాకింగ్ ట్రాక్, 19న గిద్దెపెరుమాండ్ల గ్రౌండ్ వాకింగ్ ట్రాక్, 20న అలుగునూరు వంతెనపై సెంట్రల్ లైటింగ్, 21న అలుగునూరు వంతెనపై అంబేడ్కర్ విగ్రహం హైలాండ్, 23న గోదాంగడ్డలోని మోడ్రన్ ధోబీఘాట్, 25న కటారి దేవేందర్‌రావు పార్క్ (కేడీఆర్ పార్క్), సాయంత్రం శాతవాహన వర్సిటీ నైట్‌ఫుడ్ బజార్, 26న ఎల్‌ఎండీ వాకింగ్ ట్రాక్, 30న పద్మనగర్ సమీకృత మార్కెట్‌లను ప్రారంభిస్తామని వివరించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టుల్లో పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఇవేం పనులు..?

నగరంలో చేపట్టిన మోడ్రన్ ధోబీ ఘాట్, సమీకృత మార్కెట్లు, కేడీఆర్ పార్కు, రాజీవ్ పార్కు, ఎల్‌ఎండీ వాకింగ్ ట్రాక్, నైట్ ఫుడ్ బజార్, అలుగునూర్ బ్రిడ్జ్ పై అంబేడ్కర్ విగ్రహం హైలాండ్, సెంట్రల్ లైటింగ్, ఎస్‌ఆర్‌ఆర్ వాకింగ్ ట్రాక్ లైట్స్ తదితర ప్రాజెక్టు పనుల వారీగా సుధీర్ఘంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ఆరాతీశారు. పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని మేయర్ హెచ్చరించారు. మల్టీపర్పస్ పార్క్ పనుల్లో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, పార్క్ పనులు రీకాల్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందేనని, త్వరగా పనులు పూర్తి చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి, ఎస్ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈలు మహేందర్, కిష్టప్ప, ఏఈలు, ఏజెన్సీ కాంట్రాక్టర్ లు పాల్గొన్నారు.

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి వినతుల వెల్లువ
- ఒక్కొక్కరిది ఒక్కో సమస్య
- సమస్యలపై ఏకరువు

కరీంనగర్ అర్బన్:



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

సమస్యలు విని పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో పలువురు బాధితులు మొరపెట్టుకున్నారు. బాధల నుంచి విముక్తి కల్పించాలని వేడుకున్నారు. ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా 268 ఫిర్యాదులు రాగా కలెక్టర్ డా.బి.గోపి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్‌లు అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించగా తమ ఆవేదనను వివరించారు.

రోడ్డున పడేశారు



కొడుకులను అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన. మంచిగా బతకాలని చదివించిన. సంపాదించిన ఆస్తులను పంచుకున్నారు. నన్ను రోడ్డున పడేశారు. ఎవరిని కలిసినా ప్రయోజనం లేదు. పెంచి పెద్ద చేస్తే నాకిదేం శిక్ష. కలెక్టర్ గారూ నా ఆస్తి ఇప్పించండి.

– నోముల రాజయ్య, కొత్తపల్లి, తిమ్మాపూర్

మాకిదేం గోస



డీఆర్డీఏ ప్రోద్బలంతో బైరిసన్ ఉత్పత్తుల విక్రయాలు ప్రారంభించారు. కంపెనీ ఉత్పత్తుల ధరలు మార్కెట్ ధర కంటే అధికంగా ఉండటంతో ఎవరూ కొనలేదు. కంపెనీ ప్రతినిధితో పాటు డీఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే సరుకు తీసుకుంటామని చెబుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. తీసుకున్న రుణం కట్టాలంటున్రు. ఇదెక్కడి అన్యాయం.

– కె.ఇందిర, ఇందుర్తి, చిగురుమామిడి

స్లాట్ బుక్ కావడం లేదు



కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాన్ని. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు పాదం కోల్పోయా. పని చేసే పరిస్థితి లేదు. వికలాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుందామంటే సదరం సర్టిఫికెట్ కావాలంటున్రు. సదరం సర్టిఫికెట్‌కు నెలలో ఒకరోజు మాత్రమే స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశమిస్తుండగా స్లాట్ బుక్ కావడం లేదు. ఇదేం గోస.

– మ్యాకల శ్రీకాంత్, శంకరపట్నం

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



కరీంనగర్: కరీంనగర్‌రూరల్ మండలంలోని మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తొగురు మల్లారెడ్డి సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కరీంనగర్‌లోని మీ సేవ కార్యాలయంలో మంత్రి ఆయనకు పార్టీ కండువా కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, మేయర్ సునీల్‌రావు, సర్పంచ్ జక్కం నర్సయ్య, ఎంపీటీసీ సభ్యుడు అంజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, దుర్శెడ్ ఉప సర్పంచ్ సంపత్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ రమేశ్ గౌడ్, నగునూరు సర్పంచ్ ఉప్పుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులను 'బీసీబంధు'లో చేర్చాలి



రామడుగు: బీసీబంధు పథకంలో కుల వృత్తిదారులైన తమనూ చేర్చాలని డిమాండ్ చేస్తూ గౌడ కులస్తులు సోమవారం రామడుగు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. గౌడ కులస్తులను తక్షణమే బీసీబంధు పథకంలో చేర్చాలన్నారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్, జిల్లా అధ్యక్షుడు కత్తి ప్రభాకర్‌గౌడ్, నాయకులు మడ్డి శ్యాంసుందర్‌గౌడ్, బుర్ర రాజాగౌడ్, పూరెల్ల మనోజ్‌గౌడ్, ఇల్లందుల అంజిబాబుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, పూరెల్ల శ్రీకాంత్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



కరీంనగర్: తమను రెగ్యులరైజ్ చేయాలంటూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటం ముందు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారికి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ అక్కి బాల కిషన్, ఈసీ మెంబర్ శ్రీనివాస్, ట్రెజరర్ రాజు, టౌన్ కన్వీనర్ వెంకటస్వామి, అసెంబ్లీ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్, సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆధార్‌కు సంబంధించిన ఈ–కేవైసీ సమస్య తలెత్తడంతో ఆన్‌లైన్ సమస్య ఎదురైంది. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ప్రతీరోజు ఉమ్మడి జిల్లాలోని 14 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సుమారు 1,500కు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుండగా, కరీంనగర్‌లో 60 వరకు అవుతాయి. సాంకేతిక సమస్య కారణంగా ఆయా కార్యాలయాలకు సుమారు రూ.2 కోట్ల పైగా నష్టం వచ్చినట్లు సమాచారం.

'ఉపాధి'లో రూ.2.84 లక్షల అక్రమాలు

- బాధ్యులైన అధికారులు, సిబ్బందికి నోటీసులిస్తాం
- డీఆర్‌డీవో పీడీ లెంకల శ్రీలత
- గన్నేరువరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

గన్నేరువరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, డీఆర్‌డీవో పీడీ లెంకల శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. గత మూడేళ్లలో గన్నేరువరం మండలంలోని 16 గ్రామాల్లో రూ.8.16 కోట్ల ఉపాధి హామీ పనులు చేపట్టారు. వీటిపై సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్పీ రాఘవులు ఆధ్వర్యంలో గ్రామాల్లో గత ఆగస్టు 28వ తేదీ నుంచి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. చేపట్టిన పనులపై కొలతలు, కూలీల ద్వారా రికార్డుల వివరాలు తెలుసుకొని, గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ప్రజావేదికలో మాదాపూర్, గునుకులకొండాపూర్, జంగపల్లి, గన్నేరువరంలో పనులు చేసిన కూలీలకు డబ్బులు అందలేదని గుర్తించారు. మస్టర్ రికార్డులు సైతం సక్రమంగా లేవని తేల్చారు. హరిత హారంలో నాటిన మొక్కలకు ప్రస్తుతం ఉన్న మొక్కలు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కొండాపూర్‌లో ఓ కూలీకి పనులు చేయకున్నా రూ.1,542 చెల్లించినట్లు గుర్తించారు. గుండ్లపల్లిలో మస్టర్ రికార్డు లేకుండా పనులు చేపట్టారని, 9 మంది కూలీలకు సంతకాలు లేకుండా కూలీ చెల్లించినట్లు తేల్చారు. చాలా గ్రామాల్లో మస్టర్ రికార్డులను మాయం చేశారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం రూ.2.84 లక్షల అక్రమాలు జరిగాయని గుర్తించారు. పూర్తిస్థాయి నివేదిక అనంతరం అక్రమాలకు పాల్పడిన అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేయనున్నట్లు డీఆర్‌డీవో పీడీ శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మాడుగుల రవీందర్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి, ఎంపీడీవో స్వాతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

దొరల పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వెంకటస్వామి, నాయకులు

కరీంనగర్: తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో రాష్ట్రంలో నియంతృత్వ దొరల పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా సోమవారం కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంట్ సభ్యులు బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సీపీఐదని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటాన్ని చూసి, నిజాం నవాబు తన ఉనికిని కాపాడుకోవడం కోసం హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని బీజేపీ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. నాటి ప్రభుత్వాలపై విరుచుకుపడిన సీఎం కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి, తొమ్మిదేళ్లవుతున్నా వారోత్సవాలను అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, పిట్టల సమ్మయ్య, బూడిద సదాశివ, నలువాల సదానందం, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుంట చెరువు భూమిని కాపాడాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కరీంనగర్: చొప్పదండి మండల కేంద్రంలో సర్వే నంబర్ 300లో చెరువు కుంట శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఏఐఎఫ్‌బీ జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ బి.గోపిని కలిసి, ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన తక్షణమే విచారణ జరిపి, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని చొప్పదండి డిప్యూటీ తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్ మాట్లాడుతూ.. చొప్పదండి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 301లో 65 గుంటల భూమిని ఎలాంటి లేఅవుట్, సూడా, డీటీసీపీవో అనుమతి లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. పట్టా భూమి పక్కనే ఉన్న సర్వే నంబర్ 300లో కుంట చెరువు శిఖం భూమిని దాదాపు 30 గుంటలకు పైగా కబ్జా చేసి, పట్టా భూమి సర్వే నంబర్ 301 వేసి, రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అన్నారు. స్థానికంగా ప్రభుత్వ, చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతుంటే రెవిన్యూ, మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంటన నాయకులు బద్రీనేత, సత్యం ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

కరీంనగర్: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలని, ప్రమాదబీమా సౌకర్యం రూ.5 లక్షలు కల్పించాలన్నారు. ఈ నెల 11 నుంచి సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చి, సమ్మెలో ఉంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో బీఎల్‌వోలు డ్యూటీలు చేయాలని, అంగన్‌వాడీల తాళాలు తీయాలని ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో బలవంతంగా తాళాలు పగులగొట్టారని తెలిపారు. ఇలాంటి చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కార్యదర్శులు పిట్టల సమ్మయ్య, పిట్టల శ్రీనివాస్, నాయకులు ఎ.రజిత, డి.రజిత, కె.అరుణ, అనురాధ, విజయ, రాజాదేవి, శారద, పద్మ, శైలజ, కవిత, అంజలి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు సమ్మె విరమించాలి

అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు సమ్మె విరమించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి కోరారు. వారి దీక్షా శిబిరాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు అత్యవసరమైన సేవల పరిధిలోకి వస్తాయని, గర్భిణులు, బాలింతలు, శిశువులకు ప్రతిరోజూ పోషకాహారం తప్పక అందించాల్సి ఉంటుందని తెలిపారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ప్రభుత్వంతోపాటు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు అంగన్‌వాడీ ఉద్యోగుల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఆమె వెంట కరీంనగర్ రూరల్ సీడీపీవో సవిత ఉన్నారు.

సేవల్లో అంతరాయం లేదు

ఉద్యోగుల సమ్మె కారణంగా అంగన్‌వాడీ సేవల్లో ఎలాంటి అంతరాయం లేదని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు. సమ్మె అంశాన్ని కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లాలో 777 కేంద్రాలుండగా 176 కేంద్రాలపై మాత్రమే సమ్మె ప్రభావం ఉందన్నారు. వాటిని కూడా పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

జాతీయ సాహిత్య రత్న అవార్డుకు ఎంపిక



ఆహ్వానపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

సప్తగిరికాలనీ(కరీంనగర్): పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలం గోపాల్‌రావుపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి, గాయకుడు, భారత్ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ సాహిత్య రత్న జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఏటా బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో కృషి చేసిన ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేస్తుండగా.. 2023 సంవత్సరానికి సాహిత్య, కళా, సామాజిక సేవా రంగాల్లో విశేషంగా కృషి చేసినందుకు శ్రీనివాస్‌ను అవార్డుకు ఎంపిక చేశామన్నారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో జాడి శ్రీనివాస్‌కు అవార్డుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అక్టోబర్ 15న న్యూఢిల్లీలో జరుగనున్న ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్ వేదికలో సాహిత్య రత్న అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనను సాహిత్య రత్న అవార్డుకు ఎంపిక చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తమిళనాడు మంత్రి వ్యాఖ్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న ఉదయ్‌నిధి స్టాలిన్, ఆయనను సమర్థించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఎంపీ రాజాలను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రాలను, ఆచార వ్యవహారాలను రక్షించుకునే క్రమంలో హిందువులు తరతరాలుగా తమ పోరాట పటిమను ప్రదర్శిస్తూనే ఉన్నారని తెలిపారు. సనాతన ధర్మంపై అనవసర వ్యాఖ్యలు చేసినవారికి హిందువులందరూ తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. నాయకులు డి.శంకర్, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బోయినపల్లి ప్రవీణ్‌రావు, బాస సత్యనారాయణరావు, మాడ వెంకటరెడ్డి, జానపట్ల స్వామి, అలివేలు సమ్మిరెడ్డి, బొంతల కల్యాణ్, ఊగిలే సుధాకర్ పటేల్, ఎడమ సత్యనారాయణ రెడ్డి, గడ్డం నాగరాజు, చొప్పరి జయశ్రీ, పుప్పాల రఘు, నాంపల్లి శ్రీనివాస్, కొమురయ్య, పెద్దపల్లి జితేందర్, జాడి బాల్‌రెడ్డి, ముత్యాల జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వస్తామని.. వదిలేసి వెళ్లారు


- రెండ్రోజులుగా దిక్కుమొక్కు లేని మహిళ
- సాయం చేసిన యువకులు, కౌన్సిలర్
- జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలింపు



బాధితురాలు

కోరుట్ల: 'ఇక్కడ ఉండు.. ఇప్పుడే వస్తాం' అని చెప్పి ఓ మహిళను వదిలేసి వెళ్లిన సంఘటన జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఐబీ రోడ్డులో చోటు చేసుకుంది. సదరు మహిళ రెండు రోజులుగా దిక్కు మొక్కు లేక చలిలో..వానలో వాటర్ ట్యాంక్ కింద ఉండి తనవాళ్ల కోసం ఎదురుచూస్తోంది. ఆమె దీనస్థితి అందరినీ కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. రెండు రోజుల క్రితం కొందరు ఆటోలో వచ్చి ఐబీ రోడ్డు వాటర్ ట్యాంక్ దగ్గర అనారోగ్యంతో ఉన్న మహిళ (45)ను వదిలేసి వెళ్లారు. అదే ఏరియాలో ఉండే మైనార్టీ యూత్ యువకులు అబుబకర్, షోయబ్ రెండు రోజులుగా వాటర్ ట్యాంక్ కింద ఉన్న మహిళను గుర్తించి ప్రశ్నించగా తనను రెండు రోజుల క్రితం తమవాళ్లు ఆటోలో తెచ్చి ఇక్కడ వదిలేశారని చెప్పింది. దీంతో ఆమె అనారోగ్య పరిస్థితిని గుర్తించిన యువకులు.. వెంటనే వార్డు కౌన్సిలర్ పేర్ల సత్యంకు సమాచారం ఇచ్చారు. స్పందించిన వార్డు కౌన్సిలర్ సత్యం.. సోమవారం రాత్రి అక్కడికి వచ్చి అనారోగ్యంతో పడిఉన్న మహిళ వివరాలు తెలుసుకున్నారు. తన పేరు మిర్యాల లక్ష్మి అని, తనది నిజామాబాద్ జిల్లా అని, తమవాళ్లు తనను ఇక్కడ వదిలేసి వెళ్లారని అస్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. కాగా ఆమె చేయిపై విజయ అని పచ్చబొట్టు ఉందని కౌన్సిలర్ పేర్ల సత్యం చెప్పారు. అనారోగ్యంతో ఉన్నసదరు మహిళను యూత్ ప్రతినిధులు అబుబకర్, షోయబ్‌తో కలిసి కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆ తరువాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళ సరైన సమాధానాలు చెప్పకపోగా ఆమె కాలుకు తీవ్రమైన గాయంతో పుండు ఉన్నట్లుగా గుర్తించిన వైద్యులు.. ఆమెకు ప్రాథమిక చికిత్స చేయించి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య



మానస (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: కందుగులలో ఓ యువతి ఆత్మహ త్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్ర కారం.. గ్రామానికి చెందిన ఇల్లందుల మానస(25) పదో తరగతి వరకు చదువుకుంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్తాపానికి గురై, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి తల్లి మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి

- సైదాపూర్, ఇల్లంతకుంట పీహెచ్‌సీల్లో నేడు ప్రారంభం
- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకాన్ని హుజూరాబాద్ డివిజన్ ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఈ నెల 12న సైదాపూర్, ఇల్లంతకుంట పీహెచ్‌సీల్లో పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ మంగళవారం మహిళలందరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గర్భాశయం, మోనోపాజ్ కేన్సర్లు, రుతుస్రావ సమస్యలు తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తారని తెలిపారు. సమస్యలు ఉన్నవారిని కరీంనగర్ ఆస్పత్రికి పంపించి, మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట వైద్యారోగ్యశాఖ సిబ్బంది సాజిద్ హుస్సేన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పంజాల ప్రతాప్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

అమ్మమ్మను హతమార్చిన మనవడు

- అరగుంట భూమి కోసం ఘాతుకం
- చందపల్లిలో ఘటన

పెద్దపల్లిరూరల్: అరగుంట భూమి కోసం తన అమ్మమ్మను కడతేర్చాడు ఓ యువకుడు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి పట్టణ శివారు చందపల్లికి చెందిన నాంపల్లి రాజమ్మ(95)కు ఎనిమిది మంది సంతానం (ఆరుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు). ఇదే గ్రామంలో ఆమె కూతురు మొలుగూరి మల్లీశ్వరి ఉంటోంది. మరో కూతురు చంద్రకళ పెళ్లయిన కొంతకాలానికి భర్తతో విభేదాల కారణంగా తల్లి వద్దే ఉంటోంది. ఆమెకు ఇల్లు లేదని రాజమ్మ తనకున్న అరగుంట భూమిని ఇచ్చింది. అప్పట్నుంచి మల్లీశ్వరి కొడుకు మహేశ్ తన అమ్మమ్మపై కక్ష పెంచుకున్నాడు. గతంలోనూ రెండుసార్లు ఆమెపై దాడి చేశాడు. ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న రాజమ్మ తలపై ఆదివారం రాత్రి ఇనుప రాడ్డుతో కొట్టి, అతికిరాతకంగా హతమార్చాడు. సంఘటన స్థలాన్ని సోమవారం సీఐ అనిల్‌కుమార్, ఎస్సై మహేందర్ పరిశీలించారు. మృతురాలి కుమారుడు రాజవీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని చంపిన మహేశ్‌ను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

హుజూరాబాద్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ(లాఅండ్‌ఆర్డర్) లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్లో శాంతి కమిటీ సమావేశం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది రోజులపాటు నవరాత్రి ఉత్సవాలు జరిపిన తర్వాత ముగింపు వేడుకల సందర్భంగా పోలీస్ శాఖ సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. ఎవరికీ ఇబ్బంది కలిగించొద్దన్నారు. అనంతరం హుజూరాబాద్ ఆర్డీవో రాజు మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏసీపీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. హుజూరాబాద్ సబ్ డివిజన్‌లో అన్ని మండలాల్లో వినాయక ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, సీఐలు బొల్లం రమేశ్, సంతోశ్‌కుమార్, బర్పటి రమేశ్, కిశోర్, ఎస్సైలు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగదళ్ నాయకులు, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాలో తప్పులు సరిచేయండి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: బదిలీల సీనియారిటీ జాబితాలోని తప్పులను సరిచేయాలని పీఆర్‌టీయూ జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి విడుదల చేసిన జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయాలన్నారు. 317 జీవోలో భాగంగా జిల్లాకు అలాట్ అయిన టీచర్లకు 0.25 పాయింట్లు తక్కువగా వస్తున్నాయని, వాటిని సవరించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు వెరిఫికేషన్‌కు రాని, కటాఫ్ గతంలో రెండుసార్లు పదోన్నతులు తిరస్కరించిన వారిని, కటాఫ్ కంటే ముందున్న వారిని పదోన్నతుల జాబితా నుంచి తొలగించాలన్నారు. పదోన్నతుల జాబితాలో ఎస్‌జీటీ నుంచి ఎస్ఏ మ్యాథ్స్, ఎస్ఏ ఫిజికల్ సైన్స్, ఎస్ఏ సోషల్, ఎస్ఏ బయో సైన్స్, ఎల్ఎఫ్ఎల్ తప్పులను సవరించాలన్నారు. మ్యూచువల్ బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయుల పేర్లను పదోన్నతుల జాబితా నుంచి తొలగించాలని విన్నవించారు. నాయకులు శ్రీకాంత్‌రావు, ముజీబ్‌అహ్మద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం రాత్రి అద్దాల మండపంలో మహాలింగార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DIRECT FINAL YEAR

■ Discontinued (OR) Fail: Direct Final Year LLB, B.Tech, M.Tech, MBA, GNM, B.Sc, M.Sc అగ్రి/ నర్సింగ్, Ph.D (All). Cont: 7013038197, 8885404396. [W-189169]

SERVICES

■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788626]

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221545]

■ కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాలలో ఫ్లిప్‌కార్ట్ & అమేజాన్ లార్జ్‌కు డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ & టాటా ఏస్ గూడ్స్ వెహికిల్స్ లీజుకు కావలెను. సంప్ర: 82478 15620, 83330 03022, 90529 22226 [K- 1185595]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, ఫోన్ : 9963114535, 7287061111 [HA-189330]

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చిత్ర కథ



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నగరు శివారులోని తీగలగుట్టపల్లి వెళ్లే రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిగడ్డితో బురదలో కుంగిపోయింది. ప్రమాదం జరగక ముందే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పెరిగిన పిచ్చి గడ్డిచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఆలయాల్లో శ్రావణ సోమవారం పూజలు





కరీంనగర్ కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శ్రావణ చివరి సోమవారం భక్తులు ఉపవాసాలు పాటిస్తూ శివాలయాలను దర్శించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. పాత బజార్ గౌరీశంకరాలయం, కమాన్‌రోడ్ రామేశ్వరాలయం, భగత్‌నగర్ భవానీశంకరాలయం, జెడ్పీ క్వార్టర్స్‌లోని శివాలయంతో పాటు శివపంచాయతనం ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు జరుగగా భక్తులు శివయ్య దర్శించుకొని తరించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

చిత్ర 'కథ'



మామిడి మోడు చిగురించె

వల్లంపహాడ్ శివారులోని మామిడితోటలోని కొన్ని చెట్లను రైతు సుధాకర్‌రెడ్డి వేసవికాలంలో కొట్టివేయించాడు. అయితే వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు మళ్లీ చిగురించాయి. మామిడి మొదళ్లపై గుబురుగా పెరిగిన కొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. - కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

అక్రమ ప్రహరీ కూల్చివేత



మారుతినగర్‌లో కూల్చివేసిన ప్రహరీ

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో అక్రమ నిర్మాణాలపై అధికారులు మరోసారి చర్యలు చేపట్టారు. 30వ డివిజన్ పరిధిలోని మారుతినగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ప్రహరీని సోమవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు కూల్చివేశారు. కాలనీలోని సీసీ రోడ్డుపై ఇటీవల ప్రహరీ నిర్మించగా.. స్థానికులు కార్పొరేటర్ నేతికుంట యాదయ్యకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, అక్రమ నిర్మాణాన్ని తొలగించారు.


'విట్స్'లో హరితహారం



మొక్కలు నాటుతున్న గోవిందరావు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారంలో భాగంగా అడిషనల్ డైరెక్టర్ బి.గోవిందరావు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని కోరారు. అనంతరం వలంటీర్లు 150 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మురళీ, ఏవో సుధాకర్ రావు, పవన్‌రావు, ఎన్ఎస్ఎస్ పీవో స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సంఘ కార్యాలయాన్ని సోమవారం నూతనంగా ఎన్నికైన యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారం సత్యనారాయణ సందర్శించారు. తొలిసారిగా బొమ్మకల్‌కు వచ్చిన సత్యనారాయణను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కాల్వ మల్లేశం, గౌరవ అధ్యక్షుడు కొమురయ్య, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఉపాధ్యక్షులు కాల్వ మల్లేశం, అశోక్, కొమురయ్య, శంకర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ స్థలాన్ని రక్షించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఫిల్టర్‌బెడ్ స్థలాన్ని రక్షించాలని ప్రజాప్రయోజనాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మహ్మద్ ఆమిర్ కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయికి వినతిపత్రం అందచేశారు. ఫిల్టర్‌బెడ్ భూమి హద్దులోకి చొరబడి కొంతమంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, సర్వే చేసి ఫిల్టర్‌బెడ్ స్థలాన్ని కాపాడాలని కోరారు.

ఆదాయ వనరులపై అలసత్వం

- ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో నిర్లక్ష్యం
- పంచాయతీల ఆదాయానికి గండి



బొమ్మకల్‌లోని దుకాణ సముదాయం

కరీంనగర్‌రూరల్: గ్రామపంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరులైన వ్యాపార అనుమతులపై పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. గ్రామాల్లో టీ కొట్టు నుంచి మొదలుకుని పెద్ద పరిశ్రమల వరకు ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించిన పంచాయతీల నుంచి తప్పనిసరిగా ట్రేడ్‌లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. ఆయా వ్యాపారాల ఆధారంగా నిర్ణీత రుసుం చెల్లించి అనుమతులు తీసుకోవాలి. ఏటా అంతే మొత్తం చెల్లించి లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాల్సి ఉండగా పలు గ్రామాల్లో నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో పదుల సంఖ్యలో వివిధ రకాల దుకాణాలున్నప్పటికీ వ్యాపార అనుమతులు మాత్రం తీసుకోకపోవడంతో ఆదాయం కోల్పోతున్నాయి.

246 దుకాణాలకు మాత్రమే లైసెన్స్

కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీల పరిధిలో కేవలం 246 దుకాణాలకు మాత్రమే అధికారులు ట్రేడ్ లైసెన్స్ జారీ చేశారు. వీటిలో పెద్ద దుకాణాలు 106 ఉండగా మిగితా 140 చిన్న దుకాణాలున్నాయి. ప్రధానంగా బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, నగునూరు తదితర గ్రామాల్లో దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో వ్యాపార అనుమతులు ఆఫ్‌లైన్ విధానంలో ఉండటంతో అక్రమాలు జరుగుతున్నాయనే కారణంతో ప్రభుత్వం 2021 సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తోంది. ఏటా ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తారు. గతేడాది నుంచి ట్రేడ్ లైసెన్స్‌తో పాటు హరిత నిధిని సైతం వ్యాపారుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కార్యదర్శులు అంతగా ఆసక్తి చూపించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆదాయం పెంచుకునే అవకాశమున్నప్పటికీ పాలకవర్గాలు దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. పంచాయతీల పరిధిలో ఎన్ని దుకాణాలున్నాయో డిమాండ్ సర్వే చేస్తే లెక్క తేలే అవకాశముంది. అనుమతుల్లేని దుకాణాలకు నోటీసులు జారీ చేసి ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చర్యలు చేపడితే ఆదాయం పెరిగే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు.

సర్వే ఆధారంగా ట్రేడ్‌లైసెన్స్ జారీ

గ్రామాల్లో దుకాణాలన్నింటిని సర్వే చేసి ట్రేడ్ లైసెన్స్ జారీ చేశాం. గ్రీన్‌ఫండ్‌తో పాటు లైసెన్స్‌ఫీజును వసూలు చేసి దుకాణాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం.

– సీహెచ్. జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

డెంగీ కట్టడికి చర్యలు చేపట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అబ్దుల్ రహ్మాన్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కరీంనగర్ అర్బన్: కరీం'నగరం'లో డెంగీ కట్టడికి యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టాలని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహ్మాన్ కలెక్టర్ డా.బి.గోపికి ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. డెంగీ, విష జ్వరాలు విజృంభిస్తున్నాయని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. డెంగీ కేసులు గుర్తించిన నివాసాలకు 100 మీటర్ల పరిధిలో గల నివాసాల్లో ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని కోరారు. నీరు నిలిచి ఉన్న ఓపెన్ ప్లాట్లలో ఆయిల్ బాల్స్, గంబూసియా చేపలను వదిలి దోమ లార్వా పెరగకుండా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలి

కరీంనగర్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, ప్రాథమిక ఆస్పత్రుల్లో తక్షణమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీవైఎఫ్ఐ నాయకులు బాధిత మహిళలతో కలెక్టర్ గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలోనే కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయడంలో కరీంనగర్ మొదటిస్థానంలో వచ్చిందని అన్నారు. సంక్షేమ పథకాలు అందించి ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించి ఇద్దరు పిల్లలే ముద్దు అని అవగాహన సదస్సులు నిర్వహించే వారని, కానీ నేడు కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేసుకుందామని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే డాక్టర్లు అందుబాటులో లేరని చెప్పి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సంప్రదిస్తే త్వరలోనే నిర్వహిస్తామని చెప్పుతూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయకపోవడం వల్ల మహిళలు గర్భనిరోధక మాత్రలు తీసుకొని అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు శివరాజ్ ,శ్రీనివాస్, మహిళలు శారద, కవిత, లత తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని విస్మరించిన ఎంపీ సంజయ్

- మేయర్ సునీల్‌రావు



నాఖాచౌరస్తా వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నమేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగర అభివృద్ధిని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విస్మరించారని మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శించారు. 26వ డివిజన్ నాఖాచౌరస్తా వద్ద రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంఖుస్థాపన చేశారు. నాలుగున్నర సంవత్సరాల నుంచి నగరానికి ఎంపీ చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు అందుబాటులో లేని ఇలాంటి నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. అభివృద్ధి చేయకుండా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం తహతహలాడుతున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే బీఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు. గతపది సంవత్సరాల్లో నగర అభివృద్ధి కోసం రూ.2 వేల కోట్ల నిధులు తెచ్చిన మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ల నాయకత్వం మళ్లీ అవసరమన్నారు. 26వ డివిజన్‌లో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలు, రోడ్ల స్థానంలో నూతన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే గాంధీ రోడ్డు, నాఖా చౌరస్తా నుంచి బొమ్మ వెంకన్న నివాసం, ఎస్ఎన్ గార్డెన్ వరకు స్మార్ట్ రోడ్లుగా మార్చామన్నారు. అంతర్గత రోడ్ల కోసం టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నక్క పద్మ కృష్ణ, నాంపెల్లి శ్రీనివాస్, వంగల శ్రీదేవి పవన్, సుధగోని మాధవి కృష్ణగౌడ్, ఎస్ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈ కిష్టయ్య, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



హుండీల ఆదాయం లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని దేవాదాయ శాఖ పరిధిలో గల మూడు ఆలయాల హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,56,059, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.67,735, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.89,576 వచ్చినట్లు ఆయా ఆలయాల ఈవో ఎస్.శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపులో పరిశీలకుడిగా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయాల బాధ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఒకటో డివిజన్‌లో 'గడప గడపకూ కాంగ్రెస్'



కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోని చంద్రపురికాలనీ, కార్పెంటర్ కాలనీల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. స్థానికులను కలుసుకుంటూ కరపత్రాలు పంచుతూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్‌లో విలీనమైన చంద్రపురికాలనీ, కార్పెంటర్ కాలనీల్లో ఇంతవరకు తాగునీటి పైపులైన్లు వేయక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడుతుంటే సమస్యలే లేనట్లు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పదే పదే మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ బాధ్యుడు మెతుకు కాంతయ్య, నాయకులు కూన దామోదర్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దన్న సింగ్, పొరండ్ల రమేశ్, కుర్ర పోచయ్య, దండి రవీందర్, నెల్లి నరేశ్, షేక్ శేహెన్షా, ముక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అర్బన్ జోన్ కార్యదర్శి శంకరయ్య

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని సెయింట్‌జాన్ పాఠశాలలో ఈనెల 20 నుంచి 22 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరుగనున్న కరీంనగర్ అర్బన్ జోన్ పాఠశాలల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని అర్బన్ జోన్ కార్యదర్శి అంతటి శంకరయ్య అన్నారు. సోమవారం నగరంలోని సెయింట్‌జాన్ పాఠశాలలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడల్లో ప్రతీ ఒక్క విద్యార్థి పాల్గొనేలా చూడాలన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ1,000 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, పోటీల ఎంట్రీ ఈనెల 19 మధ్యాహ్నం 3 గంటల లోపు పంపాలని సూచించారు. 20న బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 21న బాలబాలికలకు అథ్లెటిక్స్, 22న బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ పీడీలు దివాకర్, వీరేశం, వేణు, ప్రేంరెడ్డి, సుస్మిత, మధునయ్య, సిలివేరి మహేందర్, శ్రీధర్, మహేష్, శంకర్, ముఫాజిల్, ఆనంద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్‌లో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న 8వ రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నందిత, హర్షవర్ధన్, సుశాంత్, పరుశరాములులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించాలని సూచించారు. భవిష్యత్‌లో ఉన్నతమైన శిక్షణ పొంది జాతీయస్థాయికి ఎదుగాలన్నారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు తిరుపతి, మహేందర్, జహేదాతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

బీసీలకు 60శాతం సీట్లు కేటాయించాలి

విద్యానగర్(కరీంనగర్): రానున్న ఎన్నికల్లో బీసీలకు బీఆర్ఎస్ 60శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బీఎస్ ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 60శాతం టికెట్లు కేటాయిస్తే మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా గద్దె ఎక్కిస్తామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన బీసీల సింహగర్జనలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు కలర్ సత్తన్న, పరశురామ్ గౌడ్, ముత్యం శంకర్, గుడిసె రమేశ్, మంద వెంకన్న, మహిళా అధ్యక్షురాలు గంగిపల్లి అరుణ, కార్యదర్శి కొత్తపెల్లి జ్యోతి, మాదాస్ మోహన్‌రావు, బుచ్చయ్య పాల్గొన్నారు.

నియామకం



మునీందర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): పెరిక కుల రాజకీయ ఐక్యత, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి వైస్ చైర్మన్‌గా ఎర్రంశెట్టి మునీందర్‌ను నియమిస్తూ సోమవారం సంఘం చైర్మన్ ఎం వీరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. పెరిక కుల నిరుద్యోగ యువత, విద్యార్థుల భవిష్యత్ కోసం, పేద వర్గాలకు ఆర్థిక సహకారం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మునీందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్



నియామక పత్రం అందుకుంటున్న శంకర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముత్యం శంకర్‌గౌడ్‌ను నియమిస్తూ సోమవారం సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్య, గౌరవ అధ్యక్షుడు గణగోని సత్యనారాయణలు నియామకపత్రాన్ని అందజేశారు. గీత కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. ఈ సందర్భంగా ముత్యం శంకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899

క్లుప్తంగా...

చంద్రబాబూ ఆత్మవిమర్శ చేసుకో

నువ్వు చేసిన పాపాలు, తప్పులు ఇప్పటికైనా తెలుసుకో: లక్ష్మీపార్వతి



ఖైరతాబాద్(హైదరాబాద్): ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి సూచించారు.. సోమవారం ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులు అర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. 74 ఏళ్ల వయస్సులో ఎన్టీఆర్‌ను అవమానాలకు గురిచేసి, చివరకు ఆయన ఎలా చనిపోయేలా చేశావో, అదే 74వ ఏట మీరు చేసిన పాపాలు పండి అరెస్టు అయ్యి జైలుకు వెళ్లిన ఈ ఉద్వేగభరిత క్షణాల్ని నా భర్త సమాధితో పంచుకోవాలని ఇక్కడకు వచ్చి నివాళులు అర్పించినట్టు చెప్పారు. చంద్రబాబు ఎప్పటికీ తప్పించుకోలేడని ఎన్టీఆర్ ఆనాడు చెప్పిన మాటల్ని లక్ష్మీపార్వతి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన భర్తకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు చెప్పాలనే ఇంతకాలం బతికున్నానని, తన ఆశయాన్ని తన భర్త నిర్దేశించారని తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏం చేశాడు.. ప్రజల సొమ్ము దోచుకొని, అవినీతి కేసుల్లో వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ, అధికారం అడ్డుపెట్టుకొని వ్యవస్థలను కొనుక్కోవడం చేస్తూ వచ్చాడని, చివరికి అదే వ్యవస్థలో చిక్కుకుపోయి జైలు పాలయ్యాడని, ఇప్పుడు తన కోపం అంతా తీరిపోయిందన్నారు. ఎన్టీఆర్ కుటుంబం ఇప్పటికైనా ఆలోచించాలని, చంద్రబాబు అక్రమాలను మీరు సహిస్తారా... ప్రజాధనం లూటీ చేస్తూ దొరికిపోయాడు, ఆలోచించండన్నారు. నిప్పులాగా బతికిన ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఎక్కడ, అధికారం కోసం తడిగుడ్డతో గొంతులు కోసే మనస్తత్వం ఉన్న చంద్రబాబు ఎక్కడ అనేది తెలుసుకోవాలన్నారు.

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌పై ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో నిరసన

సాక్షి, హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టు, రిమాండ్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణ టీడీపీ నాయకులు సోమవారం నగరంలోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో నిరసన చేపట్టారు. పార్టీ కార్యాలయ ఆవరణలో ప్లకార్డులు ధరించి ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, పార్టీ అధికార ప్రతినిధులు నన్నూరి నర్సిరెడ్డి, టి.జ్యోత్స్న, మందూరి సాంబశివరావు, కార్యదర్శి కాసాని వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ స్కామ్‌లో మీకేమర్థమైంది?

- అసలు స్కామ్ జరిగిందా?లేదా?
- పవన్ కళ్యాణ్‌కు ప్రశ్నలు సంధించిన ఆర్జీవీ



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టును తప్పు పట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ట్విట్టర్ వేదికగా సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ (ఆర్జీవీ) ప్రశ్నల వర్షం కురిపించారు. ''స్కిల్ స్కామ్ కేసులో పవన్‌కు ఏమి అర్థమైందో.. నా ప్రశ్నలకు ఒక్క పదంలో జవాబులు ఇవ్వండి'' అంటూ సోమవారం ట్వీట్ చేశారు. సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిన నేపథ్యంలో అసలు స్కిల్ స్కామ్ జరిగిందా? లేదా?. ఒకవేళ స్కామ్ జరిగితే.. సీబీఎస్ (చంద్రబాబు)కు తెలియకుండా జరిగిందా?. రూ.300 కోట్లకుపైగా ప్రజాధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా, అధికారులు చెబుతున్నా వినకుండా విడుదల చేశారా?లేదా?. అప్పటి ప్రభుత్వ అధినేతగా చంద్రబాబుకు స్కామ్ జరిగిన తర్వాత విషయం తెలిసి ఉంటే వెంటనే దానిపై చర్యలు తీసుకోకపోవడం సరైనదేనా?. దర్యాప్తులో సేకరించిన సమాచారాన్ని ఎఫ్ఐఆర్‌లో ఎప్పుడైనా ఎవరి పేరైనా చేర్చవచ్చన్న విషయం మీకు తెలీదా?. సీఐడీ కోర్టుకు సమర్పించిన పత్రాల్లో అక్రమాలు జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నమ్మి న్యాయమూర్తి బెయిల్ ఇవ్వకపోవడం తప్పా? సెక్షన్ 409 వర్తిస్తుందని చెప్పి రిమాండ్ విధించిన న్యాయమూర్తి అవినీతిపరురాలా? నాయకులంటే 40 ఏళ్ల బ్యాక్‌గ్రౌండ్‌ను బట్టి కాదు.. వాళ్లు చేసే పనులు బట్టి అనే విషయం మీకు తెలీదా?'' అంటూ ప్రశ్నలను పోస్టు చేశారు. స్కిల్ స్కామ్ కేసులో ఏమి అర్థమైందో, దానిలోని తప్పులేంటో చెబుతూ పవన్ కెమెరావైపు చూస్తూ వీడియోను విడుదల చేయాలన్నారు.

పీటీ వారంట్!



- 'ఇన్నర్ రింగ్ రోడ్డు' అక్రమాల కేసులో చంద్రబాబు విచారణకు 'సిట్' పిటిషన్
- చంద్రబాబు, చినబాబు సూత్రధారులుగా భూ కుంభకోణం
- నారాయణ, లింగమనేని ప్రధాన పాత్రధారులు
- ఇప్పటికే 'స్కిల్' స్కామ్‌లో రిమాండ్ ఖైదీగా చంద్రబాబు
- ఆసక్తికరంగా మారిన సిట్ తాజా నిర్ణయం

అటాచ్ చేయనున్న ఆస్తుల వివరాలు..

- ఏ-1 చంద్రబాబు కరకట్ట నివాసం (లింగమనేని రమేశ్ కుటుంబం పేరిట ఉన్న ఈ నివాసాన్ని చంద్రబాబు క్విడ్ ప్రో కో కింద పొందారు)
- ఏ-2 పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు.
- ఏ-2 నారాయణ భార్య పొత్తూరి ప్రమీల, కుటుంబ సభ్యులు, బంధువులు రాపూరి సాంబశివరావు, ఆవుల మునిశంకర్, వరుణ్ కుమార్ ఇప్పటివరకు పొందిన కౌలు మొత్తం రూ.1,92,11,482.

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో యథేచ్ఛగా సాగిన కుంభకోణాలపై దృష్టి సారించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో మాజీ సీఎం చంద్రబాబును విచారించేందుకు పీటీ వారంట్ కోరుతూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన్ను ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల కేసులో కూడా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ భావిస్తోంది. ఈ కేసులో పూర్తి ఆధారాలతో చంద్రబాబు, నారాయణ, లోకేశ్‌తోపాటు వారి బినామీలైన లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, ఆర్కే హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజనీ కుమార్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇంతవరకు వారిని అరెస్ట్ చేయలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో చంద్రబాబును ఇందులోనూ అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ నిర్ణయించింది. ఇప్పటికే రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబును ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణం కేసులో కూడా రిమాండ్ ఖైదీగా పరిగణించాలని న్యాయస్థానాన్ని కోరాలని నిర్ణయించి పీటీ వారంట్ దాఖలు చేసింది. అందుకు న్యాయస్థానం అనుమతిస్తే ఇన్నర్ రింగ్ రోడ్ అక్రమాల కేసులో కూడా చంద్రబాబు అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఆ కేసులో కూడా ఆయన్ని విచారించేందుకు తమ కస్టడీకి కోరనుంది. దీంతో కేసు దర్యాప్తులో మరింత పురోగతి సాధించవచ్చని సీఐడీ భావిస్తోంది.

చంద్రబాబు, చినబాబు భూ దోపిడీ

టీడీపీ హయాంలో జరిగిన భారీ కుంభకోణాలకు మరో ఉదాహరణ అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాజెక్టు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారంగా మార్పులు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రులు లోకేశ్, పొంగూరు నారాయణ కలసి అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. వారి బినామీ లింగమనేని రమేశ్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మెలికలు తిప్పి సింగపూర్ కన్సల్టెన్సీ రూపొందించినట్లు మభ్యపుచ్చారు. అప్పటివరకు రూ.177.50 కోట్లుగా ఉన్న తమ 148 ఎకరాల మార్కెట్ విలువను అమాంతం రూ.877.50 కోట్లకు పెంచుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పూర్తయితే ఆ భూముల మార్కెట్ విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు పెరిగేలా పథకం వేశారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసిన భూములు వీటికి అదనం. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు కుంభకోణంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా చంద్రబాబు వాటా కల్పించారు. ఆ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉండటం గమనార్హం . లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను కొనుగోలు చేసినట్లు చూపించి ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించారు.

ఏ-1 చంద్రబాబు, ఏ-2 నారాయణ, ఏ-6 లోకేశ్

ఇన్నర్ రింగ్ రోడ్డు భూ కుంభకోణాన్ని సిట్ పూర్తి ఆధారాలతో బట్టబయలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడి (ఏ-1)గా చంద్రబాబు, ఏ-2గా నారాయణ, ఏ-6గా లోకేశ్‌పై కేసు నమోదు చేసింది. చంద్రబాబు, నారాయణ బినామీలు లింగమనేని రమేశ్‌ను ఏ-3గా, లింగమనేని రాజశేఖర్ ఏ-4గా, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ డైరెక్టర్ అంజని కుమార్‌ను ఏ-5గా పేర్కొంది.

చంద్రబాబు, నారాయణ ఆస్తుల అటాచ్

ఈ కేసులో చంద్రబాబు, నారాయణ బినామీల ద్వారా పొందిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. ఆ మేరకు సీఐడీ ప్రతిపాదనను ఆమోదిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్విడ్ ప్రోకో కింద లింగమనేని రమేశ్ నుంచి చంద్రబాబు పొందిన కరకట్ట నివాసంతోపాటు నారాయణ కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులను అటాచ్ చేయనుంది.

టీడీపీ బంద్ పూర్తి విఫలం

రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కనిపించని ప్రభావం



జనంతో కిటకిటలాడుతున్న విజయవాడలోని బీసెంట్ రోడ్డు

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన బంద్ పిలుపునకు ప్రజలెవరూ స్పందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు. ప్రజాజీవనం యథావిధిగా కొనసాగింది. చంద్రబాబు సొంత కంపెనీ హెరిటేజ్ కూడా మూతపడలేదు. కృష్ణాజిల్లా పెనమలూరులో హెరిటేజ్ పార్లర్‌ను ఉదయం నుంచి తెరిచే ఉంచారు. విజయవాడ సమీపంలోని పోరంకిలో ఉన్న రామోజీరావుకు చెందిన ప్రియా పచ్చళ్ల కంపెనీ కూడా మామూలుగానే పనిచేసింది. బంద్ సందర్భంగా దాన్ని మూయడానికి స్థానిక మేనేజర్లు ఇష్టపడలేదు. టీడీపీకి చెందిన సంస్థలు కూడా మూతపడకుండా పనిచేయడాన్ని బట్టి బంద్ పిలుపునకు అసలు ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్లా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు మామూలుగానే జరిగాయి. విద్యా సంస్థలు కూడా నడిచాయి. ఆర్టీసీ బస్సులు అన్ని ప్రాంతాల్లోనూ షెడ్యూల్ ప్రకారమే తిరిగాయి. ప్రైవేటు రవాణా వ్యవస్థ కూడా ఎప్పటి మాదిరిగానే నడిచింది.

దారి మళ్లించేందుకే అవాస్తవాలు ప్రచారం

- పక్కా ఆధారాలతోనే కేసు దర్యాప్తు
- స్పష్టం చేసిన సీఐడీ వర్గాలు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో పూర్తి ఆధారాలతోనే కేసు నమోదు చేసి మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేశామని సీఐడీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కేసు దర్యాప్తు ప్రక్రియలో అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ వాంగ్మూలం కేవలం ఒక భాగం మాత్రమేనని స్పష్టం చేశాయి. అంతకంటే చాలా విస్తృతంగా అన్ని కోణాల్లో పరిశోధించి పూర్తి ఆధారాలతోనే చంద్రబాబును అరెస్ట్ చేసినట్లు వెల్లడించాయి. తన వాంగ్మూలంతోనే చంద్రబాబును సిట్ అరెస్టు చేశానని చెప్పడం హాస్యాస్పదమని, పూర్తిగా ఫైళ్లు చూడకుండా ఆయన్ని ఎలా అరెస్ట్ చేస్తారని, తాను అప్రూవర్‌గా మారలేదని పీవీ రమేశ్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను సీఐడీ వర్గాలు ఖండించాయి. సీఐడీ ప్రత్యేక దర్యాప్తు విభాగం (సిట్) విచారణను ప్రభావితం చేసే ఉద్దేశంతో ఆయన అవాస్తవాలను ప్రచారంలోకి తెస్తున్నారని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా డిజైన్ టెక్ కంపెనీకి ప్రభుత్వ నిధులు మంజూరు చేయడాన్ని అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత అభ్యంతరం తెలిపారని సిట్ వర్గాలు వెల్లడించాయి. ఆమె అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు ఆదేశాలతో నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంటూ పీవీ రమేశ్ డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేశారని సిట్ తెలిపింది. అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.371 కోట్ల ప్రజాధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా షెల్ కంపెనీల ద్వారా మళ్లించినట్లు దర్యాప్తులో ఆధారాలతో సహా నిర్ధారణ అయ్యిందని పేర్కొంది. దర్యాప్తు కీలక దశలో ఉన్న తరుణంలో పీవీ రమేశ్ ఉద్దేశపూర్వకంగానే మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారంలోకి తెస్తున్నారని సిట్ స్పష్టం చేసింది. ప్రజల్ని అయోమయానికి గురి చేయడంతోపాటు దర్యాప్తును తప్పుదారి పట్టించాలన్నదే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. పీవీ రమేశ్ చెబుతున్నట్లుగా హాస్యాస్పదంగానో పేలవంగానో ఈ కేసును దర్యాప్తు చేయడం లేదని సిట్ పేర్కొంది. పక్కా ఆధారాలతో నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు చేస్తున్నందునే మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్‌ను న్యాయస్థానం సమర్థించి ఆయనకు రిమాండ్ కూడా విధించిందని సీఐడీ వర్గాలు తెలిపాయి.

5 రోజులు కస్టడీకి అప్పగించండి

ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ

- స్కిల్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ వ్యక్తులు, షెల్ కంపెనీల ద్వారా డబ్బు మొత్తం చంద్రబాబుకే చేరింది
- కీలక ఫైళ్లను మాయం చేసేశారు.. భారీ కుట్ర దాగి ఉంది
- అన్ని వివరాలు చంద్రబాబుకే తెలుసు.. వాటిని రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వండి
- ఏ షరతులు విధించినా అభ్యంతరం లేదు
- కౌంటర్ దాఖలుకు ఆదేశించిన ఏసీబీ కోర్టు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడును తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ సోమవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ స్కామ్ గురించి, మిగిలిన నిందితుల పాత్ర గురించి చంద్రబాబుకు చాలా విషయాలు తెలుసని, అందువల్ల ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందంటూ సీఐడీ డీఎస్పీ ఎం.ధనుంజయుడు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. కస్టడీకి ఇచ్చే సమయంలో ఎలాంటి షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ నిధుల మళ్లింపు, లబ్ధిదారులు ఎవరన్న విషయాలు చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. నిధుల దుర్వినియోగంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీనే అంతిమ లబ్ధిదారులని తెలిపారు. స్కామ్ జరిగిన తీరును ఈ పిటిషన్‌లో వివరించారు. 'ఈ స్కామ్ వెనుక కొందరి ఆర్థిక పరమైన దుష్ప్రవర్తన, లోతైన కుట్ర దాగి ఉంది. వీటి వెనకు అసలు కారణాలన్నింటినీ చంద్రబాబు నుంచి తెలుసుకోవాల్సిన అవసరం దర్యాప్తు సంస్థకుంది. అధికార బాధ్యతలను పక్కన పెట్టి వ్యక్తుల లబ్ధి కోసం భారీ, లోతైన కుట్రకు పాల్పడ్డారు. మాకు కావాల్సిన సమాచారాన్ని చంద్రబాబు నుంచి రాబట్టినప్పుడే ఈ ఆర్థిక మోసం పూర్తిగా బయటపడుతుంది. ఈ స్కామ్‌కు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను మాయం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన లబ్ధిదారులు నారా చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడు, గంటా సుబ్బారావు, డాక్టర్ లక్ష్మీనారాయణ. మాయం చేసిన ఫైళ్లు ఎక్కడ ఉన్నాయన్న విషయాలను చంద్రబాబును విచారించి రాబట్టాల్సి ఉంది. షెల్ కంపెనీల ద్వారా, పలువురు వ్యక్తుల సాయంతో మొత్తం డబ్బు తిరిగి చంద్రబాబుకే చేరింది. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలను చంద్రబాబు నుంచి రాబట్టాల్సి ఉంది. చంద్రబాబును అరెస్ట్ తరువాత విచారించాం. అయితే ఆయన విచారణకు ఏ మాత్రం సహకరించలేదు. అందువల్ల చంద్రబాబును 5 రోజుల పాటు మా కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఏసీబీ ప్రత్యేక కోర్టు దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదిని ఆదేశించింది. కౌంటర్ దాఖలు తరువాత ఈ వ్యాజ్యంపై విచారణ జరుపుతామని తెలిపింది.

జైల్లో ఉండను మా ఇంట్లో ఉంటా

▶ మొదటి పేజీ తరువాయి

కస్టడీ పిటిషన్‌పై విచారణ జరుపుతామని తెలిపింది.

బీపీ, షుగర్ ఉంది..: అంతకు ముందు హౌస్ రిమాండ్ పిటిషన్‌పై సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబుకున్న ప్రాణహాని రీత్యా ఆయనకు కేంద్రం జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించిందన్నారు. ఆయన ప్రాణాలకు పలుమార్లు బెదిరింపులు కూడా వచ్చాయన్నారు. జైలులో చంద్రబాబు భద్రతపై ఆయన సందేహం వ్యక్తం చేశారు. అంతేకాక చంద్రబాబు వయస్సు 73 ఏళ్లని, షుగర్, బీపీలతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నారని కోర్టుకు నివేదించారు. ఒకవేళ బెయిల్ ఇవ్వకపోతే ఆయనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్‌లో ఉంచాలని అభ్యర్థించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి దర్యాప్తు అధికారులు ఎన్నడూ చంద్రబాబు ఇంట్లో సోదాలు నిర్వహించలేదని, ఎలాంటి డాక్యుమెంట్లను జప్తు చేయలేదని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబుకు వ్యతిరేకంగా ఈ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు ఉండే అవకాశం లేదన్నారు. హౌస్ రిమాండ్‌లో ఉంచితే సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేయడం జరగదన్నారు. వాదనల సందర్భంగా సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను ఆయన ఉదహరించారు.

జైలులోనే భద్రత ఎక్కువ...: అనంతరం సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ హౌస్ రిమాండ్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హతే లేదన్నారు. చంద్రబాబు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో హౌస్ రిమాండ్ పిటిషన్ నిరర్థకమైందన్నారు. చంద్రబాబు కోరుతున్న హౌస్ రిమాండ్ అభ్యర్థన అసాధారణమన్నారు. వాస్తవానికి హౌస్ రిమాండ్ ప్రస్తావన ఏ చట్టంలో కూడా లేదన్నారు. అందువల్ల హౌస్ రిమాండ్ మంజూరు చేయడానికి వీల్లేదని వాదించారు. చంద్రబాబుకు ప్రస్తుతం ఉన్న భద్రత కంటే జైలులో ఇంకా ఎక్కువ భద్రత ఉందని వివరించారు. జైలులో ఆయన భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జైలులో చంద్రబాబు భద్రతకు వచ్చిన ముప్పేమీ లేదన్నారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేదనేందుకు ఎలాంటి వైద్య రికార్డులను కోర్టు ముందు ఉంచలేదన్నారు. అరెస్ట్, రిమాండ్ సమయంలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు డాక్టర్లు తేల్చారన్నారు. జీవన శైలి సంబంధ వ్యాధులకు సాధారణ మందులు తీసుకుంటే సరిపోతుందన్నారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉన్నారు కాబట్టే అరెస్ట్‌కు ముందు ఆయన చాలా క్రియాశీలకంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తూ బహిరంగ సభల్లో పాల్గొంటున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. హౌస్ రిమాండ్‌కు పంపితే సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేయడం ఉందని చంద్రబాబు చెబుతున్నారని, అయితే వాస్తవానికి ఆయన ప్రోద్బలంతోనే ఇద్దరు కీలక వ్యక్తులు విదేశాలకు పరారయ్యారని తెలిపారు. వారు దర్యాప్తునకు దొరకకుండా ఉండేందుకే అలా చేశారన్నారు. దర్యాప్తులో జోక్యం చేసుకోకుండా, సాక్షులను ప్రభావితం చేయకుండా, సాక్ష్యాలను తారుమారు చేయకుండా ఉండేందుకే జ్యుడీషియల్ కస్టడీ విధిస్తారని, ఇప్పుడు చంద్రబాబుకు హౌస్ రిమాండ్ ఇస్తే ఆ సదుపాయాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఈ కోర్టు చంద్రబాబుకు ప్రత్యేక గది, ఇంటి భోజనం, మందులు, తగిన భద్రత కూడా కల్పించాలని జైలు అధికారులను ఆదేశించిందని తెలిపారు. చంద్రబాబుకు ఎలాంటి ప్రాణహాని లేదని సుధాకర్‌రెడ్డి చెప్పారు. బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయకుండా హౌస్ రిమాండ్ కోసం పట్టుబడుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు తీర్పులను ఉదహరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం మధ్యాహ్నం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. ఈ సమయంలో చంద్రబాబు న్యాయవాది లూథ్రా జోక్యం చేసుకుని ఉదయమే తీర్పు వెలువరించాలని పట్టుబడ్డారు. అయితే ఉదయం అనేక కేసులో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా విచారించాల్సిన బాధ్యత తమపై ఉందని కోర్టు గుర్తు చేసింది.

తొలి రోజు గడిచిందిలా..

- పొద్దున్నే యోగా... పత్రికల పఠనం
- ఫ్రూట్ సలాడ్‌తో అల్పాహారం
- లంచ్‌లో బ్రౌన్ రైస్, బెండకాయ ఫ్రై, పన్నీర్, పెరుగు
- ఆహారమంతా కాన్వాయ్‌లోని ప్యాంట్రీ కార్ నుంచే..
- ప్రత్యేక గది.. ఓ సహాయకుడు .. గది వద్దే 1+4 భద్రత
- ఇదీ జైలులో రిమాండ్ ఖైదీ 7691 చంద్రబాబు తొలి రోజు
- నేడు ములాఖత్‌లో కలవనున్న కుటుంబ సభ్యులు



సెంట్రల్ జైలు లోపల చంద్రబాబు నాయుడు

సాక్షి, అమరావతి, సాక్షి, రాజమహేంద్రవరం: పొద్దున్నే యోగా.. కాసేపు పత్రికల పఠనం... ప్రత్యేకంగా తెప్పించిన ఆహారం... రెండు సార్లు వైద్య పరీక్షలు.. మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పూర్తి స్థాయి భద్రత నడుమ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా తొలిరోజు గడిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టై రిమాండ్ ఖైదీ 7691గా ఉన్న ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా, పూర్తి భద్రతతో కూడిన ప్రత్యేక గదిలో ఉంటున్నారు. సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు నిద్ర లేచారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ప్రత్యేకంగా సహాయకుడు.. వంటకు ప్యాంట్రీ కార్

న్యాయస్థానం ఆదేశాలతో జైలు అధికారులు చంద్రబాబుకు స్నేహ బ్యారక్‌లో ప్రత్యేక గదిని ఆదివారం రాత్రే కేటాయించారు. అందులో వెస్ట్రన్ మోడల్ టాయిలెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చంద్రబాబుకు ప్రత్యేకంగా ఓ సహాయకుడిని అందుబాటులో ఉంచారు. చంద్రబాబు జిల్లాల పర్యటనల్లో ఆయన కాన్వాయ్‌లో ఉండే ప్రత్యేక ప్యాంట్రీ కార్‌ను జైలుకు సమీపంలో ఉంచారు. నారా లోకేష్ రాజమహేంద్రవరంలోనే ఓ టీడీపీ నేత ఇంటి వద్ద మకాం వేసి చంద్రబాబుకు అవసరమైనవన్నీ సమకూరుస్తున్నారు. ఉదయం అల్పాహారంగా ఫ్రూట్ సలాడ్‌తో పాటు వేడినీళ్లు, బ్లాక్ కాఫీని పంపారు. మధ్యాహ్న భోజనంలో 100 గ్రాముల బ్రౌన్ రైస్, బెండకాయ వేపుడు, పన్నీర్ కూర, పెరుగు పంపించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో టీ తాగేందుకు వేడినీళ్లు అందజేసినట్లు తెలిసింది. ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం, మధ్యాహ్న భోజనం అనంతరం చంద్రబాబుకు రెండు సార్లు వైద్య పరీక్షలు చేశారు. ఆయన ఉంటున్న స్నేహ బ్యారక్‌కు ఎదురుగానే జైలుకు సంబంధించిన ఆస్పత్రి ఉండటంతో అక్కడ వైద్య పరీక్షలు చేపట్టారు. రాత్రి కూడా ప్యాంట్రీ కార్ నుంచే పుల్కాలు, పెరుగు తెప్పించి ఆహారాన్ని అందించారు.

నిరంతరం 1 + 4 భద్రత

జైలు అధికారులు చంద్రబాబు భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయన ఉన్న జైలు గది వద్ద 24 గంటలపాటు విధులు నిర్వహించేలా 1 + 4 భద్రతను వినియోగించారు. జైలు లోపల, చుట్టుపక్కల పూర్తి స్థాయిలో పటిష్ట బందోబస్తు కల్పించారు. కట్టుదిట్టమైన భద్రతతోపాటు జైలులో ఉన్న సీసీ కెమెరాల ద్వారా భద్రతను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో పూర్తిస్థాయి భద్రత నడుమ ఉన్నారు.

తొలిరోజు ములాఖత్‌లు లేవు

సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబును తొలిరోజు ఎవరూ కలవలేదు. జైలు నిబంధనల ప్రకారం వారానికి రెండు ములాఖత్‌లను అనుమతిస్తారు. సోమవారం ములాఖత్ కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రహ్మణి, కుమారుడు లోకేష్ మంగళవారం ఆయన్ను ములాఖత్‌లో కలిసేందుకు జైలు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు.

చంద్రబాబు సీట్లో బాలయ్య

టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం

సాక్షి, అమరావతి: చంద్రబాబు అరెస్టయి జైల్లో ఉండటంతో ఆయన బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సోమవారం సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. టీడీపీని ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు లాక్కున్న తర్వాత పార్టీలో నందమూరి కుటుంబం ఎప్పుడూ కీలకపాత్ర పోషించలేదు. తొలిసారి.. చంద్రబాబు తర్వాత పార్టీని ఎవరు నడపాలి? ఎలా నడపాలి? అనే చర్చ మొదలైంది. తన కొడుకు లోకేశ్‌ను చంద్రబాబు ప్రమోట్ చేసినా క్యాడర్, నేతలు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో తొలిసారి బాలకృష్ణ మంగళగిరి పార్టీ కార్యాలయానికి వచ్చి చంద్రబాబు సీట్లో కూర్చుని పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహనరావు, యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు ఎన్ని రోజులు జైల్లో ఉండే పరిస్థితి ఉంది, ఈ సమయంలో పార్టీని ఎవరు నడపాలనే దానిపై చర్చ జరిగింది.



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ నేతలతో సమావేశమైన బాలకృష్ణ

రామోజీ, శైలజతో పాటు మరో 13 మందికి నోటీసులు

కౌంటర్ల దాఖలుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీరావు, శైలజా కిరణ్‌లతో పాటు ఆ సంస్థకు చెందిన పలువురు కీలక వ్యక్తులు, ఉద్యోగులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ గత నెల 28న జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ అప్పీళ్లలో ప్రతివాదులుగా ఉన్న మార్గదర్శి చైర్మన్ చెరుకూరు రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్, ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు వైస్ ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఇలా మొత్తం 15 మందికి నోటీసులు జారీచేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని వీరందరినీ ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఇన్నాళ్లకు న్యాయం, ధర్మం గెలిచింది: పేర్ని నాని



సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కుంభకోణంలో ప్రధాన నిందితుడైన చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించి, జైలుకు పంపడంతో ఇన్నాళ్లకు న్యాయం గెలిచింది, ధర్మం గెలిచిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు మాజీమంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు. చంద్రబాబు సిగ్గుపడకుండా.. వేళ్లూపుకుంటూ జైలుకు వెళ్లారంటూ ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 45 ఏళ్లుగా ఎన్నో స్కాములు చేస్తూ.. స్టేల మీద నెట్టుకొస్తూ.. ప్రతి వ్యవస్థలోనూ, తాను ఏర్పాటుచేసుకున్న స్లీపర్ సెల్స్ ద్వారా బయటపడుతూ, సమాజానికి మాత్రం చంద్రస్వామిజీ నీతులు చెబుతూ వచ్చారంటూ విమర్శించారు. 2014–19 మధ్యలో జరిగిన అన్ని కుంభకోణాలపై విచారణ జరుపుతామని స్పష్టంచేశారు.


● భాషారత్న జ్ఞాపికతో...

అక్షర కుసుమం

వాచస్పతి కుసుమారెడ్డి

కొండూరు కుసుమారెడ్డి... ఏడున్నర దశాబ్దాల జీవనయానంలో ఆమె కలం నుంచి ఇరవై రచనలు జాలువారాయి. ఓనమాలు దిద్దిన నాటి నుంచి నేటి వరకు అక్షరంతో మమేకమై సాగుతున్న సాహిత్యసేవకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అధికార భాషా దినోత్సవం' సందర్భంగా (ఆగస్టు 29) ఆమెను 'భాషారత్న' పురస్కారంతో గౌరవించింది. ఆ విశేషాలను, తన సాహిత్య ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారామె.

''మాది నెల్లూరు జిల్లా, కావలి పట్టణం. మా నాన్న జయరామిరెడ్డి హైస్కూల్ హెడ్‌మాస్టర్, అమ్మ శంకరమ్మ గృహిణి. ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు కావలిలో చదివాను. గుంటూరు, నల్లపాడు (ఆంధ్ర విశ్వవిద్యాలయం)లో పీజీ చేసిన తర్వాత ఎంఫిల్‌కి హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చాను. లింగ్విస్టిక్స్‌లో పీజీ డిప్లమో, రెండు పీహెచ్‌డీలు ఉస్మానియాలోనే చేశాను. వారణాసి, సంపూర్ణానంద సంస్కృత యూనివర్సిటీ నుంచి డీలిట్ చేసి 'వాచస్పతి' బిరుదు పొందాను. ఉస్మానియాలో 1974లో విద్యార్థిగా అడుగు పెట్టిన నేను 1979లో లెక్చరర్‌నయ్యాను. పదోన్నతులతో ప్రొఫెసర్ హోదాలో తెలుగు శాఖాధిపతిగా విధులు నిర్వర్తించి 2008లో రిటైరయ్యాను. ఆ రిటైర్‌మెంట్ ఉస్మానియా నుంచి మాత్రమే. ఆ మరునాటి నుంచి ట్రిపుల్ ఐటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) బాధ్యతలు స్వీకరించాను. ట్రిపుల్ ఐటీ రూపకల్పన నుంచి ఆరేళ్లపాటు ఆ విధుల్లో ఉన్నాను. ఇప్పుడు కూడా ఉద్యోగపరంగా విశ్రాంత జీవితమే కానీ, చదవడానికి రాయడానికి విశ్రాంతి తీసుకోలేదు. విషయశోధన చేస్తూనే ఉన్నాను, రాస్తూనే ఉన్నాను. పంతొమ్మిది గ్రంథాలు ప్రచురితమయ్యాయి. ఐసీహెచ్‌ఆర్ నుంచి 'సీనియర్ అకడమిక్ ఫెలో' అందుకున్న రచన (కల్చరల్ లైఫ్ ఆఫ్ తెలంగాణ ట్రైబ్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు డాన్స్, మ్యూజిక్ అండ్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్) తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రచురణ దశలో ఉంది.

అన్నీ అధ్యయన భరితాలే!

నేను కాలక్షేపం కోసం ఏదీ రాయలేదు. కాలక్షేపంగా చదువుకోవడానికీ రాయలేదు. ప్రతిదీ సమగ్రమైన పరిశోధన, శాస్త్ర పూర్వక అధ్యయనంతో రాసినవే. నా రచనలన్నీ జీవితగమనానికి సూచికలవంటివే. నా పర్యవేక్షణలో 30 మందికి పైగా విద్యార్థులు పీహెచ్‌డీలు చేశారు. నేను పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలతోపాటు, నా విద్యార్థులకు గైడ్ చేస్తున్న క్రమంలో నాకు ఓ విషయం స్పష్టంగా తెలిసి వచ్చింది. అప్పటి వరకు పరిశోధన చేసే వాళ్లకు ఒక మెథడాలజీ లేదు. ఆ లోటును భర్తీ చేయడానికి ఆచార్య ఎం. కులశేఖరరావుతో కలిసి 'సాహిత్య పరిశోధన పద్ధతులు' రాశాను. ఇలాగే నా ప్రతి రచన వెనుక బలమైన కారణం, ఉపయుక్తత ఉన్నాయి. తంజావూరులోని సరస్వతి మహల్ గ్రంథాలయం ప్రభావం నా రచనల మీద ఎక్కువగా ఉంది. నెల రోజుల పాటు అక్కడే ఉండి తాళపత్ర గ్రంథాలను అధ్యయనం చేసి నోట్స్ రాసుకున్నాను.

రంగాజమ్మ స్ఫూర్తి!

ఎంఫిల్ అంశంగా రంగాజమ్మను తీసుకోవడానికి బలమైన కారణమే ఉంది. ఆమె ఎనిమిది భాషల్లో ప్రావీణ్యం ఉన్న తెలుగు కవయిత్రి. కనకాభిషేక గౌరవం అందుకున్న ఏకైక మహిళ. తంజావూరు నాయక రాజుల ఆస్థానంలో ఆమెకి గొప్ప స్థానం ఉండేది. నా మీద ఆమె ప్రభావం కూడా ఉందనే చెప్పాలి. ఆమెలాగే నేను కూడా నా రంగంలో విశేషంగా కృషి చేయాలని, అత్యున్నత స్థాయికి చేరాలనే ఆకాంక్ష నాకు తెలియకుండానే కలిగింది. సంస్కృతంలో డీలిట్ చేయడం ద్వారా వాచస్పతి బిరుదు పొందిన తొలి తెలుగు వ్యక్తినయ్యాను. ఇప్పటికీ ఆ బిరుదు సాధించిన ఏకైక తెలుగు మహిళను నేనే.

> **రోజుకు పదిగంటలు!**
>
> బోధన వృత్తిలో ఉన్నంత కాలం నా దిన చర్య ఒకక్రమంలో సాగింది. నాలుగు గంటలు పాఠాలు చెప్పడానికి, రెండు గంటలు ప్రిపరేషన్‌కి. ప్రయాణం ఒక గంట. ఈ ఏడు గంటలు ఉద్యోగం కోసం. ఇవన్నీ పూర్తయిన తర్వాత మూడు గంటల సేపు పుస్తకాలు చదవడానికి, రాసుకోవడానికి పట్టేది. రోజుకు దాదాపు పది గంటలు అక్షరాల మధ్యనే గడిచేది. మా తమ్ముడి భార్య వాణి నాకు ఇంటి బాధ్యతలేవీ లేకుండా చూసుకునేది. నాకు సన్మానాలు జరుగుతుంటే తనకే జరిగినంత సంతోషపడేది. నా కోసం అతిథులు వస్తే తన పుట్టింటి వాళ్లు వచ్చినంత సంబరపడుతూ వాళ్లకు అన్నీ అమర్చి పెట్టేది. మా నాన్న కవి అనే విషయం ఆయన పోయిన తర్వాత కానీ మాకు తెలియలేదు. ఆయన పుస్తకాలన్నీ తీసి సర్దుతుంటే 'రుద్రీయము' చేతిరాత ప్రతి దొరికింది. కాకతీయ రాజు రుద్రదేవుడి చరిత్రను ఆయన పద్యకావ్యంగా రాశారు. ఆ పుస్తకాన్ని పరిష్కరించి ప్రచురించడం, ఆయన కవి అనే విషయాన్ని ప్రపంచానికి తెలియచేయడం నాకు అత్యంత సంతోషకరమైన జ్ఞాపకం.


● విజయవాడ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పురస్కార ప్రదానం సందర్భంగా...

జ్ఞానం భావితరాలకు అందాలి!

వార్తా పత్రికల్లో వ్యాసాలు రాశాను. వ్యక్తిత్వ వికాసం క్లాసులకు మూలం మన భగవద్గీత. ఒక్కో శ్లోకాన్ని నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఉదాహరణలతో రాసిన గీతాయోగం నన్ను యూనివర్సిటీ పరిధి నుంచి బయటకు తెచ్చింది. గీతాయోగం ద్వారా సాధారణ పాఠకులకు కూడా పరిచయమయ్యాను. మొత్తంగా నేను రాసిన పుస్తకాల లెక్క చెప్పగలను, కానీ ఎన్ని గ్రంథాలను చదివాననే ప్రశ్నకు సమాధానం నా దగ్గర ఉండదు. మన ప్రాచీన గ్రంథాల్లో గణితం, రాజనీతి, ధర్మ అర్థశాస్త్రాలు, వైద్యం, ధనుర్విద్య, ఖడ్గలక్షణ శాస్త్రాది యుద్ధ నైపుణ్యాలన్నీ సమగ్రంగా ఉన్నాయి. నృత్యకళ అత్యున్నత స్థాయిలో ఉండేది. చాలా నాట్యరీతులు అంతరించిపోయాయి. వాటిని వివరించే సాహిత్యం కూడా చేజారిపోతోంది. వాటి పునరుద్ధరణకు మార్గదర్శనం చేయగలిగిన రచనలు చేశాను. నాకు నేనుగా నిర్దేశించుకున్న లక్ష్యాలన్నింటినీ సాధించాను. భావితరాల కోసం ఓ బృహత్తర ప్రణాళిక నా మదిలో ఉంది. అది... మన ప్రాచీన గ్రంథాల్లో ఉన్న జ్ఞానాన్ని డిజిటలైజ్ చేసి ప్రాచీన సాహిత్య శాస్త్ర గ్రంథాలన్నింటితో ఒక డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉంది. మన ప్రాచీన గ్రంథాల పట్ల చాలామందికి ఆసక్తి ఉన్నప్పటికీ వృత్తి, ఉద్యోగాల కారణంగా తంజావూరు, ఇతర గ్రంథాలయాలకు వెళ్లి తాళపత్ర గ్రంథాలను, ప్రాచీన రచనలను అధ్యయనం చేయగలిగిన సమయం ఉండదు. అలాంటి వారికి ఈ ప్రయత్నం మేలు చేస్తుంది. అరచేతిలోని స్మార్ట్ ఫోన్‌లోనే చదువుకోవచ్చు. అమెరికా నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణులు ఒకరు ఫోన్ చేసి 'భీమఖండంలో ఒక శాస్త్రీయ విషయముందని, పరిశోధన కోసం ఆ పుస్తకం ఒక కాపీ కావాల'ని అడిగారు. డిజిటలైజ్ చేస్తే మన దేశం నుంచి అమెరికాకు పుస్తకాన్ని పంపించాల్సిన ప్రయాస అక్కరలేదు. వందేళ్లు దాటిన పుస్తకాలు కూడా ఆదరణకు నోచుకోకుండా పడి ఉన్నాయి. వాటన్నింటినీ భావితరాలకు అందించడానికి ఏమి చేయాలి, ఎలా చేయాలనే ప్రణాళిక సిద్ధం చేస్తున్నాను. ఇటీవల విక్రమ సింహపురి యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలిగా నియమించినట్లు అధికారులు ఫోన్ చేసి చెప్పినప్పుడు కూడా నా ఆలోచనలకు ఒక రూపం తీసుకురావచ్చనే ఉత్సాహం కలిగింది'' అన్నారు వాచస్పతి కొండూరి కుసుమారెడ్డి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫొటోలు : సీహెచ్ మోహనాచారి

సాఫ్ట్‌వేర్ చిన్నారి





● సీమర్ ఖురానా

చిచ్చర పిడుగుల్లాంటి పిల్లలు వయసు కంటే పెద్ద చదువులు చకచకా చదివేసి. డిగ్రీ పట్టాలు పొందేస్తుంటారు. అయితే అంతకన్నా చకచకా అడుగులు వేసింది సీమర్. డిగ్రీలు చదవడం కాదు... ఏకంగా వీడియో గేమ్‌నే రూపొందించింది ఈ ఆరేళ్ల సిసింద్రీ సీమర్ ఖురానా.

ప్రపంచమంతా టెక్నాలజీతోపాటు పరుగులు పెడుతోంది. అందుకే చిన్నా..పెద్దా తేడా లేకుండా అంతా స్మార్ట్ ఫోన్ల నుంచి కంప్యూటర్ల దాకా అన్నీ అవలీలగా వాడేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కోడింగ్ ద్వారా వివిధ రకాల అప్లికేషన్లు, గేమ్‌లు తయారు చేస్తుంటారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లలో కొంత మంది మాత్రమే వీటిని తయారు చేయగలరు. మిగతావారికి కోడింగ్ అంటే అర్థం కాని పెద్ద సబ్జెక్ట్‌గా చూస్తారు. అటువంటిది భారత సంతతికి చెందిన సీమర్ ఖురానా కోడింగ్‌ను మునివేళ్లతో పట్టి చకచక వీడియోగేమ్‌ను రూపొందించింది. అతిపిన్నవయసులో వీడియో గేమ్ రూపొందించి ప్రపంచంలోనే అతిపిన్న వయస్కురాలైన వీడియోగేమ్ డెవలపర్‌గా గిన్నిస్ రికార్డుల్లో నిలిచింది.

కెనడాలోని ఆంటారియోలో నివసిస్తోన్న భారత సంతతికి చెందిన పరాస్ ఖురానా కూతురే సీమర్. చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండే సీమర్ తన వయసు పిల్లలంతా వీడియోగేమ్‌లు ఆడుకుంటుంటే సీమర్ మాత్రం... తన సీనియర్లు చదివే పాఠాలు నేర్చుకోవడానికి ఆరాటపడేది. మ్యాథ్స్ అంటే మక్కువ ఎక్కువ ఉన్న సీమర్.. తన తరగతి కాకుండా పైతరగతి విద్యార్థులు చదివే లెక్కల పాఠాలు నేర్చుకోవాలనుకునేది. కానీ ఎవరూ నేర్పించేవాళ్లు కాదు. దీంతో యూట్యూబ్‌లో చూసి లెక్కలు నేర్చుకునేది. కిండర్ గార్డెన్ చదివే సీమర్ మూడోతరగతి లెక్కలు సులభంగా చేసేది. ఒకపక్క లెక్కలు చెబుతూనే కాగితాలతో క్రాఫ్ట్ తయారు చేసి ఆడుకుంటూ ఉండేది. ఇది గమనించిన సీమర్ తండ్రి కోడింగ్ క్లాసులను చూపించారు. కోడింగ్ నచ్చడంతో సీమర్ కోడింగ్ కూడా నేర్చుకోవడం మొదలుపెట్టింది. క్రమంగా కోడింగ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నం మొదలు పెట్టింది.

డాక్టర్ మాటలు విని...

సీమర్ అక్క ఆరోగ్యం పాడవడంతో ఫ్యామిలీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. అక్కను పరీక్షించిన డాక్టర్ జంక్‌ఫుడ్‌ని మానేయాలని చెప్పడంతో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూనే హెల్దీ, జంక్ ఫుడ్‌ల గురించి వీడియో గేమ్ తయారు చేయాలనుకుంది. దీనికోసం వారానికి మూడు క్లాసులకు హాజరవుతూ ఏడాదిలోపే కోడింగ్‌ను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఆ తరువాత 'హెల్దీఫుడ్ ఛాలెంజ్' పేరిట వీడియో గేమ్‌ను తయారు చేసింది. జంక్ ఫుడ్ వల్ల ఏర్పడే ముప్పు, ఆరోగ్యకరమైన, సమతుల ఆహారం ఎలా తీసుకోవాలో ఈ వీడియోగేమ్ వివరంగా చెబుతుంది. ఈ యాప్‌ను తయారు చేయడానికి స్కూలు అయిపోయిన తరువాత రోజుకి రెండు గంటలపాటు సమయాన్ని కేటాయించేది సీమర్. ఇలా తన పేరుని గిన్నిస్‌బుక్‌లో ఎక్కించుకుంది.

వీడియో గేమ్‌లే కాదు...

లెక్కలు, కోడింగ్‌తోపాటు డ్యాన్స్, జిమ్నాస్టిక్స్, కరాటేలు కూడా నేర్చుకుంటోంది. 'సీమర్స్ వరల్డ్' పేరుమీద యూ ట్యూబ్ ఛానల్ నడుపుతూ తన కొచ్చే వివిధ రకాల ఆటల ఐడియాలను షేర్ చేస్తోంది. టాలెంట్‌కు వయసుతో సంబంధంలేదనడానికి సిసలైన ఉదాహరణగా నిలుస్తోంది సీమర్.

ప్రకృతి సేద్యంతో రైతే రాజు!

సాగుబడి

పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 14 నుంచి

'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం నిజంగానే 'రైతును రాజు' గా మార్చుతుందంటున్నారు ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ టి. విజయకుమార్. ప్రపంచవ్యాప్తంగా రసాయనాల్లేకుండా జరుగుతున్న సాగు 1% కాగా, ఏపీలో 14% కావటం విశేషం. ఏటీఎం మోడల్‌లో 20 సెంట్లలో అనేక రకాల కూరగాయలు, పండ్లు సాగు చేస్తూ ప్రతి నెలా కనీసం రూ. 10-25 వేలు ఆదాయం పొందే మార్గం ఉంది. చిన్న, సన్నకారు రైతులకే కాదు, భూమిలేని వ్యవసాయ కార్మికులకూ ఇది వరం లాంటిదని ఆయన అంటున్నారు.. ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్ టి. విజయకుమార్‌తో 'సాక్షి సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు ముఖాముఖి


ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్ టి. విజయకుమార్

సాక్షి సాగుబడి: ఆంధ్రప్రదేశ్‌లో తామర తంపరగా విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం విశేషాలు..?

విజయకుమార్: ఏపీలో ప్రకృతి వ్యవసాయం ప్రభుత్వ సహకారం, మహిళా సంఘాల తోడ్పాటుతో విస్తృతంగా అమలవుతోంది. 2023 మార్చి నాటికి 3,800 గ్రామ పంచాయతీలు, 3 వేల రైతు భరోసా కేంద్రాల్లో విస్తరించింది. 8.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో పాల్గొంటున్నారు. అంటే, ఎన్‌రోల్ అయ్యారు. వీరిలో 2,70,000 మంది రైతులు పూర్తిగా రసాయనాలు వాడటం మానుకున్నారు. రైతుల ఎన్‌రోల్‌మెంట్ దృష్ట్యా మన దేశంలోనే ఇది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో పాల్గొనటం మరే దేశంలోనూ జరగటం లేదు.

ప్రకృతి వ్యవసాయ వ్యాప్తి క్రమంగా జరిగే పని. ఒక రైతుకు రెండెకరాలు ఉంటే.. ముందు అరెకరంలో ప్రయత్నిస్తారు. ఏ రైతూ రిస్క్ తీసుకోరు. అరెకరాలో సక్సెస్ సాధిస్తే.. తర్వాత సంవత్సరం విస్తీర్ణం పెంచుతారు. ఎంత ఖర్చయ్యింది, ఎంత దిగుబడి వచ్చింది, నికరాదాయం ఎంత వచ్చింది, భూమిలో మార్పేమి వచ్చింది.. ఇవీన్న చూసుకొని విస్తీర్ణాన్ని పెంచుకుంటారు. సగటున మా అనుభవంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో అన్ని విషయాలు అనుభవపూర్వకంగా అలవాటు చేసుకోవడానికి 4 ఏళ్లు పడుతుంది. అందుకని ఆ నాలుగేళ్లు ప్రభుత్వం తరఫున మేం వారికి మద్దతుగా నిలుస్తున్నాం. ఈ విధంగా 2,70,000 మంది రైతులు దాదాపు 1,40,000 హెక్టార్లలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

■ **ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది 3 జైవిక్ ఇండియా పురస్కారాలు వచ్చాయి. వీటితో పాటు.. వ్యక్తిగతంగా మీకు 'డా. ఎమ్మెస్ స్వామినాథన్ ప్రకృతి పరిరక్షణ పురస్కారం' లభించిన శుభ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు... జైవిక్ ఇండియా పురస్కారాల ప్రాధాన్యం ఏమిటి?**

అంతర్జాతీయంగా ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే సంస్థ 'ఐఫోమ్' ఈ జైవిక్ ఇండియా పురస్కారాలు ఇస్తుంటుంది. ఐఫోమ్‌కు ఐక్యరాజ్యసమితికి చెందిన ఎఫ్.ఎ.ఓ., తదితర సంస్థలతో సన్నిహిత సంబంధాలుంటాయి. ప్రతి సంవత్సరం అవార్డులు ఇస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ఇస్తున్న ప్రోత్సాహం, సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ఏపీ ప్రభుత్వానికి 2023లో ఉత్తమ రాష్ట్ర పురస్కారం ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతుకు, ఎఫ్‌పీఓకు కూడా ఇచ్చారు.

■ **ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది..?**

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో ఏపీ ప్రభుత్వానికి చాలా ప్రత్యేకతలున్నాయి. రైతు భరోసా కేంద్రాలన్నిటి పరిధిలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఇప్పుడు 28% రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని జిల్లాల్లో, అన్ని మండలాల్లోనూ ఈ కార్యక్రమం అమల్లో ఉంది. ముమ్ముందు గ్రామాలన్నిటికీ విస్తరించాలన్నది లక్ష్యం. ఏపీలో ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖనే సీఎం ఏర్పాటు చేయటం విశేషం. దీంతో మంచి ఊపొచ్చింది. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి.

■ **ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి ఏమిటి..?**

రీజనరేటివ్ అగ్రికల్చర్ అనండి, ఆర్గానిక్ అగ్రికల్చర్ అనండి.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4 దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నా ఇప్పటికీ చేస్తున్నది 1% మంది రైతులు మాత్రమే. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 14% మంది రైతులు ఎంతో కొంత విస్తీర్ణంలో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. తమకున్న పొలం మొత్తంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 5% ఉన్నారు. అందుకే ప్రపంచంలో ఏపీ అనుభవం ఎంతో విశిష్టమైనది. రైతులతో రసాయనాలు వాడే అలవాటు మాన్పించడం చాలా కష్టం. బలంగా ఉన్న మహిళా సంఘాల వ్యవస్థ ఇందులో పాల్గొనటం వల్ల రైతులకు క్షేత్రస్థాయిలో నైతిక మద్దతు ఇవ్వటం సాధ్యమైంది. ఈ సామాజిక తోడ్పాటు ఎంతో ఉపయోగపడుతోంది. సేద్యంలోనే కాదు, వైవిధ్యపూరితమైన ప్రకృతి పంటల దిగుబడులు కుటుంబాల ఆరోగ్యానికి చాలా అవసరమని మహిళలు గుర్తించటం కూడా ఇది వ్యాప్తి చెందడానికి ఉపయోగకరంగా ఉంది.

■ **ఏయే పంటల్లో అధిక దిగుబడి..?**

మా అనుభవంలో అన్ని పంటల్లోనూ ఫలితాలు బాగా వస్తున్నాయి. ఖర్చు తగ్గించడం, దిగుబడి పెంచటం, ఎక్కువ వర్షాలు పడినా/ వర్షాభావ పరిస్థితులొచ్చినా పంట తట్టుకునే శక్తి, చీడపీడలను తట్టుకునే శక్తి.. చాలా పంటల్లో అనుకున్న దానికన్నా దిగుబడులు రాబట్టిన సంఘటనలు చాలా ఉన్నాయి. గిరిజన ప్రాంతాల్లో రాగి పంట దిగుబడి ఎకరానికి వచ్చే దిగుబడి 400-600 కిలోల నుంచి 1200-1800 కేజీలకు పెరిగింది. ఖర్చు సగానికి సగం తగ్గింది. వరిలోనూ అంతర పంటలపై ప్రయోగాలు చేస్తున్నాం. గట్ల వెడల్పును పెంచి కూరగాయలు, పండ్ల మొక్కలు సాగు చేయమని.. పంటల వైవిధ్యం పెంచడానికి.. రైతులకు సలహా ఇచ్చాం.

■ **పవన్ సుఖదేవ్ అధ్యయనం గురించి..?**

పవన్ సుఖదేవ్ అంతర్జాతీయంగా పేరున్న పర్యావరణవేత్త. పర్యావరణంలో నోబెల్ వంటి టేలర్ అవార్డు గ్రహీత. వీరి జీస్ట్ సంస్థ స్వతంత్రంగా జరిపిన అధ్యయనంలో 11% అధిక దిగుబడి, 54% అధిక నికరాదాయం, పంటల వైవిధ్యం రెండింతలు పెరిగిందని వెల్లడైంది.

■ **మార్కెటింగ్‌లోకి అమూల్ ప్రవేశిస్తోందట..?**

అవును. ఏపీలో 80% విస్తీర్ణంలో పత్తి సహా 8 రకాల ఆహార పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. ఇప్పటికే టీటీడీ 12 రకాల ఆహారోత్పత్తుల్ని కొనుగోలు చేస్తోంది. బియ్యం, పప్పులు, వేరుశనగలు తదితరాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి అమూల్‌తో ఒప్పందం చేసుకోబోతున్నాం. మండల స్థాయిలో ప్రాసెసింగ్ సదుపాయాలు కూడా వస్తాయి. ఇది మార్కెటింగ్‌లో పెద్ద ముందడుగు అవుతుంది.



■ **ఏటీఎం మోడల్‌లో ఆశ్చర్యకరమైన ఫలితాలు ఎలా..?**

అవునండి.. నిజం. ప్రకృతి వ్యవసాయ విధానాలను సక్రమంగా అమలు చేస్తే రైతే రాజని రుజువు చేయొచ్చు. అది నిజంగా జరుగుతుంది. రైతులకు సంవత్సరానికి ఆదాయం ఒక్కసారే ఎందుకు రావాలి? ప్రతి రోజూ రావాలి.. ప్రతి వారం రావాలి.. అందుకు ఏటీఎం మోడల్ ఉపయోగపడుతుంది. అనంతపురం జిల్లాలో ఈ నమూనా తొలుత ప్రయత్నించి సత్ఫలితాలు సాధించాం. ఇప్పుడు రాష్ట్రంలో అన్ని జిల్లాలకూ విస్తరింపజేస్తున్నాం. 85%గా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు, భూమి లేని వ్యవసాయ కార్మికులకు పెరటి తోటలు/ఇంటి పంటలుగా సాగుకు కూడా ఏటీఎం మోడల్ ఒక వరం లాంటిది. 20 సెంట్లను కౌలుకు తీసుకొనైనా సాగు చేస్తే.. ప్రతినెలా ప్రతి రైతూ రూ.10,000 నుంచి 25,000 సంపాయించే అవకాశం ఉందని మా అంచనా.

'సాక్షి టీవీ'లో ఇటీవల ప్రసారమైన ఈ ఇంటర్వ్యూ పూర్తి వీడియోను యూట్యూబ్‌లో చూడటానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చెయ్యండి.

మొక్క పైనే పిచికారీ చేసే రోబో!

- పొలం మొత్తంలో కాకుండా మొక్కలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి అక్కడ మాత్రమే పురుగుమందు చల్లే రోబోలు వచ్చాయి
- కృత్రిమ మేధతో నడిచే అత్యాధునిక 'స్పాట్ స్ప్రే రోబో'ను రూపొందించిన బెంగళూరు స్టార్టప్ నైకో రోబోటిక్స్
- మహారాష్ట్ర, కర్ణాటక రైతుల పొలాల్లో ఎకరానికి రూ.350 అద్దెతోనే పిచికారీ
- 60% పురుగుమందు ఆదా కావటంతో పాటు.. భూ/వాయు కాలుష్యం కూడా ఆ మేరకు తగ్గుతుంది.





పంటలపై చీడపీడలను అదుపు చేయడానికి పొలాల్లో విష రసాయనిక పురుగుమందులను పిచికారీ చేస్తుంటాం. అయితే, డ్రోన్ల ద్వారా చల్లినా, స్ప్రేయర్లతో చల్లినా.. పంట మొక్కలపైనే కాకుండా పొలం అంతటా నేలపైన కూడా పురుగుమందు పడుతూ ఉంటుంది. దీని వల్ల పురుగుమందు వృథా అవ్వటమే కాకుండా, భూసారం కూడా నాశనమవుతుంది. ఈ సమస్యలకు బెంగళూరుకు చెందిన స్టార్టప్ కంపెనీ నైకో రోబోటిక్స్ చక్కటి పరిష్కారం కనుగొంది. మొక్కలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి, వాటిపైన మాత్రమే పురుగుమందును పిచికారీ చేసే అధునాతన రోబోను రూపొందించింది. కృత్రిమ మేధతో నడిచే ఈ స్పాట్ స్ప్రేయర్ రోబోలపై ఆ సంస్థ పేటెంట్ కూడా పొందింది. తమిళనాడులో పుట్టిన జైసింహ అమెరికాలో బీటెక్ ఈసీఈ చదివి కువైట్‌లో ఏడేళ్లు పనిచేసి, స్వదేశానికి వచ్చేశారు. పిచికారీ పద్ధతులను ఆధునీకరిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి బెంగళూరు కేంద్రంగా 2015లో నైకో రోబోటిక్స్‌ను నెలకొల్పారు.

■ **ఈ రోబో ఎలా పనిచేస్తుందంటే..?**

ఈ రోబో ప్రత్యేకతలు ఏమిటంటే.. దీనికి 5 మీటర్ల పొడవైన రెక్కలు రెండు వైపులా ఉంటాయి. ఏకకాలంలో పది మీటర్ల వెడల్పున ఇది పిచికారీ చేయగలదు. ఈ రెక్కలకు కృత్రిమ మేధతో కూడిన కళ్లను అమర్చారు. ఈ కళ్లు మొక్కలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తాయి. మొక్కలు ఉన్న చోట రోబో రెక్కకు ఉన్న నాజిళ్లు తెరచుకొని పురుగుమందును పిచికారీ చేస్తాయి. మొక్క లేకుండా ఖాళీ నేల ఉన్న చోట రోబో రెక్కలకు ఉన్న నాజిళ్లు తెరచుకోవు. కాబట్టి అక్కడ పురుగుమందు పడదు.

■ **60% పురుగుమందు ఆదా**

ఈ రోబోతో పిచాకారీ చేస్తే.. 60% పురుగుమందు ఆదా కావటంతో పాటు.. భూ/వాయు కాలుష్యం కూడా ఆ మేరకు తగ్గుతుందని సంస్థ చెబుతోంది. గత ఏడాది నుంచి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పత్తి, సోయాబీన్స్, మిర్చి వంటి పంట పొలాల్లో పురుగుమందులు చల్లుతున్న ఈ ఏఐ రోబోలు అక్కడి రైతుల మనసులు చూరగొన్నాయని చెబుతున్నారు. ఎకరానికి రూ.350ల చొప్పున అద్దె చెల్లించి రైతులు తమ పొలాల్లో పురుగుమందులు పిచికారీ చేయించుకుంటున్నారు. అకోలాకు చెందిన పత్తి, సోయా రైతు యోగేశ్ రౌత్ తన 30 ఎకరాల్లో ఈ రోబో ద్వారా పురుగుమందులు పిచికారీ చేయించుకున్నారు. కూలీలతో పిచికారీ చేయిస్తే ఎకరానికి రూ.1200 ఖర్చయ్యేదని, ఈ రోబో ఉపయోగకరంగా ఉందని చెబుతున్నారు. ఇప్పటికే 500 మంది రైతులు లక్ష ఎకరాల్లో అద్దె రోబోలు పిచికారీ చేశాయట. పురుగుమందులనే కాదు ద్రవరూప ఎరువులు, సేంద్రియ ద్రావణాల పిచికారీకి కూడా ఈ రోబోలు ఉపయోగకరమే.


రాహుల్

వాన మధ్యలో మన పరుగుల వాన

వహ్వా... ఇది కదా ఆటంటే... దీని కోసమే కదా మన అభిమానులంతా ఆశలు పెట్టుకుంది... నేనున్నానంటూ వాన మళ్లీ మళ్లీ వచ్చేస్తున్నా ఇలాంటి ఒక్క మ్యాచ్ కోసమే కదా అందరం ఎదురు చూసింది... ఇందుకే కదా నిర్వాహకులు ఈ ఒక్క పోరు కోసం నిబంధనలు మార్చేసింది... రిజర్వ్ డే అంటూ పెట్టుకున్నందుకు తగిన న్యాయం చేస్తున్నట్లుగా భారత బ్యాటర్లు చెలరేగి వినోదం పంచారు. తొలి పోరులో విఫలమై పాక్ బౌలింగ్‌ను ఆడలేరంటూ వచ్చిన విమర్శలను చిత్తు చేస్తూ చెలరేగారు. పేలవ బౌలింగ్ తర్వాత కొండంత లక్ష్యానికి చేరువగా కూడా రాలేక పాక్ కుప్పకూలింది.

ఒక్కసారి లయ అందుకుంటే తాను ఎంత బాగా ఆడగలనో కోహ్లి చూపించాడు... గతంలోలాగా ఒక్క ఇన్నింగ్స్‌లో ఎన్నో రికార్డులు అందుకుంటూ ముందుకు సాగిపోతూ సచిన్ సెంచరీలకు సరిగ్గా రెండడుగుల దూరంలో నిలిచాడు... మరోవైపు ఫామ్, ఫిట్‌నెస్ చూపించుకోవాల్సిన స్థితిలో బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సెంచరీతో చెలరేగాడు. వీరి భాగస్వామ్యాన్ని విడదీయలేక పాక్ బౌలర్లు చేతులెత్తేశారు. గత మ్యాచ్‌లో టాప్-4ను తొందరగా పడగొట్టి ఆధిక్యం చూపించిన పాక్ పని పట్టేందుకు ఇప్పుడు టాప్-4 మాత్రమే సరిపోయారు.


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కోహ్లి

- కోహ్లి, రాహుల్ సెంచరీలు
- కుల్దీప్ యాదవ్‌కు 5 వికెట్లు
- భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తు
- 228 పరుగులతో టీమిండియా ఘన విజయం
- నేడు శ్రీలంకతో పోరు
- మ.గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

కొలంబో: వన్డే క్రికెట్‌లో పాకిస్తాన్‌పై భారత్ తమ ఆధిక్యాన్ని మరింత స్పష్టంగా ప్రదర్శించింది. ఆసియా కప్‌లో ఆసక్తిని రేపిన 'సూపర్-4' పోరులో టీమిండియాదే పైచేయి అయింది. సోమవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత్ 228 పరుగుల భారీ తేడాతో పాక్‌ను చిత్తుగా ఓడించింది. ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 147/2తో సోమవారం ఆట కొనసాగించిన భారత్ 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (94 బంతుల్లో 122 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (106 బంతుల్లో 111 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకాలతో చెలరేగారు. వీరిద్దరు మూడో వికెట్‌కు అభేద్యంగా 233 పరుగులు జోడించారు. ఈ జోడీ 32.1 ఓవర్లలోనే 7.25 రన్‌రేట్‌తో ఈ పరుగులు రాబట్టడం విశేషం. సోమవారం 25.5 ఓవర్ల పాటు బౌలింగ్ చేసినా పాకిస్తాన్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది. అనంతరం పాక్ 32 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. ఫఖర్ జమాన్ (27)దే అత్యధిక స్కోరు. గాయాల కారణంగా రవూఫ్, నసీమ్ షా బ్యాటింగ్‌కు దిగకపోవడంతో 8 వికెట్లకే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. కుల్దీప్‌కు 5 వికెట్లు దక్కాయి.

డబుల్ ధమాకా...

రిజర్వ్ డే రోజున కూడా భారత జట్టు తొలి రోజు తరహాలోనే తమ జోరు కొనసాగించింది. పాకిస్తాన్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కోహ్లి, రాహుల్ చక్కటి షాట్లతో చెలరేగారు. షాహీన్ సహా ఇతర బౌలర్ల పేలవ ప్రదర్శనకు తోడు గాయం కారణంగా రవూఫ్ సోమవారం అసలు బౌలింగ్‌కే దిగకపోవడం కూడా పాక్‌ను దెబ్బ తీసింది. ముందుగా 60 బంతుల్లో రాహుల్, ఆ తర్వాత 55 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. 40 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 251 పరుగులకు చేరింది. తర్వాతి పది ఓవర్లలో భారత జోడీ మరింతగా దూసుకుపోయింది. తర్వాతి 5 ఓవర్లలో జట్టు 49 పరుగులు రాబట్టి 300 పరుగుల మార్క్ అందుకుంది. నాలుగు బంతుల వ్యవధిలో రాహుల్ (100 బంతుల్లో), కోహ్లి (84 బంతుల్లో) ఖాతాలో శతకాలు చేరాయి. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 56 పరుగులు రాబట్టడం విశేషం. ఫహీమ్ వేసిన చివరి ఓవర్లో ఆఖరి మూడు బంతులను వరుసగా 4, 4, 6గా మలచి కోహ్లి ఘనంగా ఇన్నింగ్స్ ముగించాడు.

టపటపా...

ఛేదనలో మొదటి నుంచే తడబడిన పాకిస్తాన్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇమామ్ (9)ను అవుట్ చేసి బుమ్రా తొలి వికెట్ అందించగా, పాండ్యా బౌలింగ్‌లో బాబర్ (10) బౌల్డయ్యాడు. వాన విరామం తర్వాత తొలి ఓవర్లోనే రిజ్వాన్ (2)ను శార్దుల్ అవుట్ చేయడంతో పాక్ పరిస్థితి మరింత దిగజారింది. ఆ తర్వాత తక్కువ వ్యవధిలో ఫఖర్, సల్మాన్ (23) వెనుదిరిగారు. అతి కష్టమ్మీద 24.5 ఓవర్లలో 100 పరుగులకే చేరిన జట్టు ఆ తర్వాత వేగంగా ఓటమి దిశగా పయనించింది.

ఆగని వాన...

రిజర్వ్ డే రోజున కూడా వర్షం మ్యాచ్‌ను వెంటాడింది. వాన తెరిపినివ్వకపోవడంతో ఆట ఆరంభానికే చాలా సమయం పట్టింది. చివరకు 1 గంట 40 నిమిషాలు ఆలస్యంగా మ్యాచ్ మొదలైంది. ఆ తర్వాత పాక్ ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లు ముగిశాక వర్షం రాకతో ఆట నిలిచిపోయింది. ఈ సమయంలో మరో 1 గంట 12 నిమిషాల విరామం వచ్చింది.


కుల్దీప్ యాదవ్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఫహీమ్ (బి) షాదాబ్ 56; గిల్ (సి) సల్మాన్ (బి) షాహీన్ 58; కోహ్లి (నాటౌట్) 122; రాహుల్ (నాటౌట్) 111; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (50 ఓవర్లలో 2 వికెట్లకు) 356. వికెట్ల పతనం: 1-121, 2-123. బౌలింగ్: షాహీన్ అఫ్రిది 10-0-79-1, నసీమ్ షా 9.2-1-53-0, ఫహీమ్ 10-0-74-0, రవూఫ్ 5-0-27-0, షాదాబ్ 10-1-71-1, ఇఫ్తికార్ 5.4-0-52-0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ (బి) కుల్దీప్ 27; ఇమామ్ (సి) గిల్ (బి) బుమ్రా 9; బాబర్ (బి) పాండ్యా 10; రిజ్వాన్ (సి) రాహుల్ (బి) శార్దుల్ 2; సల్మాన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 23; ఇఫ్తికార్ (సి అండ్ బి) కుల్దీప్ 23; షాదాబ్ (సి) శార్దుల్ (బి) కుల్దీప్ 6; ఫహీమ్ (బి) కుల్దీప్ 4; షాహీన్ (నాటౌట్) 7; నసీమ్ (ఆబ్సెంట్ హర్ట్), రవూఫ్ (ఆబ్సెంట్ హర్ట్), ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (32 ఓవర్లలో ఆలౌట్) 128.

వికెట్ల పతనం: 1-17, 2-43, 3-47, 4-77, 5-96, 6-110, 7-119, 8-128. బౌలింగ్: బుమ్రా 5-1-18-1, సిరాజ్ 5-0-23-0, పాండ్యా 5-0-17-1, శార్దుల్ 4-0-16-1, కుల్దీప్ 8-0-25-5, జడేజా 5-0-26-0.

47 వన్డేల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. అగ్రస్థానంలో ఉన్న సచిన్ (49) శతకాలను అందుకునేందుకు మరో 2 సెంచరీలు దూరంలో మాత్రమే ఉన్నాడు.

5 వన్డేల్లో కోహ్లి 13 వేల పరుగులు పూర్తి చేసుకొని ఈ ఘనత సాధించిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. సచిన్‌కంటే 54 ఇన్నింగ్స్‌లు తక్కువగా ఆడి కోహ్లి ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ప్రేమదాస స్టేడియంలో అతనికి వరుసగా నాలుగు వన్డేల్లో నాలుగో సెంచరీ కావడం మరో విశేషం.

1 పాకిస్తాన్‌పై భారత్ తమ అత్యధిక స్కోరు (356)ను సమం చేసింది. 2005లోనూ వైజాగ్‌లో పాక్‌పై భారత్ 356 పరుగులు చేసింది.

5 వన్డేల్లో పాకిస్తాన్‌పై ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన ఐదో భారతీయ బౌలర్ కుల్దీప్ యాదవ్. గతంలో అర్షద్ అయూబ్ (5/21: 1988లో), సౌరవ్ గంగూలీ (5/16: 1997లో), వెంకటేశ్ ప్రసాద్ (5/27: 1999లో), సచిన్ టెండూల్కర్ (5/50: 2005లో) ఈ ఘనత సాధించారు.

24 తగ్గేదేలే...



జొకోవిచ్ ఖాతాలో 24వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్

- మార్గరెట్ కోర్ట్ 'ఆల్ టైమ్' రికార్డును సమం చేసిన సెర్బియా స్టార్
- నాలుగోసారి యూఎస్ ఓపెన్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్‌పై విజయం
- రూ. 24 కోట్ల 90 లక్షల ప్రైజ్‌మనీ సొంతం
- మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లోకి

న్యూయార్క్: 36 ఏళ్ల వయసు వచ్చినా తన ఆటను మరింత పదునెక్కిస్తూ సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నాడు. ఈ ఏడాది ఆడిన నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ ఫైనల్ చేరిన జొకోవిచ్ సీజన్‌లో చివరిదైన యూఎస్ ఓపెన్‌లో నాలుగోసారి చాంపియన్‌గా నిలిచాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం ఐదు గంటలకు ముగిసిన పురుషుల సింగిల్స్ విభాగం ఫైనల్లో రెండో సీడ్ జొకోవిచ్ 6-3, 7-6 (7/5), 6-3తో మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలిచాడు. 3 గంటల 16 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో జొకోవిచ్ తన అనుభవాన్నంతా రంగరించి పోరాడి పైచేయి సాధించాడు. విజేత జొకోవిచ్‌కు 30 లక్షల డాలర్లు (రూ. 24 కోట్ల 90 లక్షలు), రన్నరప్ మెద్వెదెవ్‌కు 15 లక్షల డాలర్లు (రూ. 12 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ గెలుపుతో జొకోవిచ్ ఖాతాలో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. అత్యధికంగా 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా ఆస్ట్రేలియా క్రీడాకారిణి మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు. అంతేకాకుండా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు.

కెరీర్‌లో 36వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న జొకోవిచ్‌కు తుది పోరులో మెద్వెదెవ్ నుంచి గట్టిపోటీనే ఎదురైంది. 30 లేదా 40 షాట్‌లతో కూడిన ర్యాలీలను చాలాసార్లు జొకోవిచ్ పాయింట్‌తో ఫినిష్ చేయగా... కొన్నిసార్లు మెద్వెదెవ్ సఫలమయ్యాడు. తొలి సెట్‌లోని రెండో గేమ్‌లోనే మెద్వెదెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను నిలబెట్టుకొని సెట్‌ను దక్కించుకున్నాడు. రెండో సెట్‌లో మాత్రం ఇద్దరూ ప్రతి పాయింట్‌కు నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో జొకోవిచ్ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లోని నాలుగో గేమ్‌లో మెద్వెదెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఈ సెర్బియా స్టార్ తన సర్వీస్‌లను కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.


మెద్వెదెవ్

ఫైనల్ గణాంకాలు

జొకోవిచ్		మెద్వెదెవ్
4	ఏస్‌లు	6
6	డబుల్ ఫాల్ట్‌లు	6
3/6	బ్రేక్ పాయింట్లు	1/3
38	విన్నర్స్	32
35	అనవసర తప్పిదాలు	39
37/44	నెట్ పాయింట్లు	16/22
118	మొత్తం పాయింట్లు	97

"మీ అందరి ముందు నిలబడి నేను 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గురించి మాట్లాడతానని ఏనాడూ ఊహించలేదు. ఇది నిజమవుతుందని కూడా అనుకోలేదు. కానీ గత రెండేళ్లలో కొత్త చరిత్ర సృష్టించే అవకాశం నా ముందు ఉందనిపించింది. అందివచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని అనుకున్నాను. నా శరీరం సహకరించినంత వరకు, నా శిక్షణ సిబ్బంది, కుటుంబసభ్యుల సహకారం ఉన్నంత వరకు ఈ జైత్రయాత్రను కొనసాగిస్తాను. అత్యున్నతస్థాయిలో ఉన్నప్పటికీ ఈ ఆటకు ఇప్పుడే వీడ్కోలు పలికే ఆలోచన లేదు. ఈ విజయాన్ని నా ఆప్త మిత్రుడు, మూడేళ్ల క్రితం హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయిన అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం కోబి బ్రయాంట్‌కు అంకితం ఇస్తున్నాను. యూఎస్ ఓపెన్ గెలిస్తే కోబి బ్రయాంట్ ఫొటో ఉన్న టీ షర్ట్‌ను ట్రోఫీ ప్రదానోత్సవంలో ధరించాలని అనుకున్నాను.

-జొకోవిచ్





జొకోవిచ్ 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్	ఫ్రెంచ్ ఓపెన్	వింబుల్డన్	యూఎస్ ఓపెన్
10	3	7	4

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేతలు (కనీసం 20)

జొకోవిచ్	(సెర్బియా)	24
మార్గరెట్ కోర్ట్	(ఆస్ట్రేలియా)	24
సెరెనా విలియమ్స్	(అమెరికా)	23
రాఫెల్ నాదల్	(స్పెయిన్)	22
స్టెఫీ గ్రాఫ్	(జర్మనీ)	22
ఫెడరర్	(స్విట్జర్లాండ్)	20

1 ఒకే ఏడాది మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిల్స్‌ను నాలుగుసార్లు చొప్పున (2011, 2015, 2021, 2023) సాధించిన తొలి ప్లేయర్‌గా జొకోవిచ్ నిలిచాడు.

96 జొకోవిచ్ కెరీర్‌లో గెలిచిన సింగిల్స్ టైటిల్స్. అత్యధిక సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో కానర్స్ (109 : అమెరికా), ఫెడరర్ (103 : స్విట్జర్లాండ్) తర్వాత జొకోవిచ్ మూడో స్థానంలో ఉన్నాడు.

'మన ఓపెనర్ల బ్యాటింగ్ ప్రశంసనీయం'

సునీల్ గావస్కర్

కొన్నిసార్లు మ్యాచ్‌లో ఓటమికంటే రద్దు కావడమే మంచిది. ఇరు జట్లూ పాయింట్లు పంచుకునే అవకాశం ఉంటుంది. గ్రూప్ దశలో పాకిస్తాన్‌తో భారత్ బ్యాటింగ్ చేసిన తర్వాత వర్షంతో మ్యాచ్ రద్దు కాగానే భారత అభిమానులందరూ కాస్త ఊరట చెందారు. ఒకవేళ నేపాల్‌తో మ్యాచ్ రద్దు అయినా సరే భారత్ సూపర్-4 దశకు అర్హత సాధించేది. అదే జరిగితే నెట్‌రన్‌రేట్ పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చేది. అలా చూసినా సరే 266 పరుగులు చేసిన భారత్ రన్‌రేట్ మెరుగ్గానే ఉండేది. సాధారణంగా ఎప్పుడూ కూడా భారత్, పాకిస్తాన్ జట్లు తర్వాతి దశకు చేరేలాగే గ్రూప్‌లు విభజిస్తున్నారు. ఐసీసీ ఈవెంట్లలో కూడా ఇరు జట్లు ఒకే గ్రూప్‌లో ఉంటే కనీసం ఒక పెద్ద బ్లాక్‌బస్టర్ మ్యాచ్ ఖాయంగా ఉంటోంది. శ్రీలంకపై భారత్ రికార్డు మెరుగ్గానే ఉంది. తర్వాతి మ్యాచ్‌లకు కూడా వాతావరణం కీలకంగా మారనుంది. ఆసియా కప్‌లో భారత్ 7 సార్లు, శ్రీలంక 6 సార్లు, పాకిస్తాన్ 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచాయని విషయాన్ని మరచిపోవద్దు. పాక్‌తో మ్యాచ్‌లో రోహిత్, గిల్ ఆకట్టుకునే ప్రదర్శనతో ప్రత్యర్థి బౌలింగ్ బలహీనతలను సమర్థంగా చూపించారు. గిల్ కొన్ని చూడచక్కటి షాట్లు ఆడగా మరో ఎండ్‌లో చెలరేగుతున్న నసీమ్ షా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొని రోహిత్ తన విలువను చూపించాడు. మ్యాచ్ రిజర్వ్ డేకు సాగడంతో భారత్ వరుసగా రెండు రోజులు మ్యాచ్‌లు ఆడాల్సిన పరిస్థితి వచ్చింది. వర్షం అడ్డుపడి అదృష్టవశాత్తూ అవకాశం దక్కడం కాకుండా... పూర్తి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి ఫైనల్‌కు చేరాలని ప్రతి అభిమాని కోరుకుంటాడు.



సినిమా


రజనీకాంత్

స్వాతంత్ర్య దినోత్సవానికి రూల్


అల్లు అర్జున్

తగ్గేదే లే అంటూ వెండితెరపైకి దూసుకొచ్చిన 'పుష్ప' తగ్గేదే లే రేంజ్‌లో వసూళ్లు సాధించాడు. అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మలి భాగం 'పుష్ప: ద రూల్' నిర్మాణంలో ఉంది. తొలి భాగంలో జంటగా నటించిన అల్లు అర్జున్, రష్మికా మందన్నా, కీలక పాత్రలు చేసిన ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు మలి భాగంలోనూ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2024 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు సోమవారం నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ తెలిపారు. తొలి భాగం అంచనాలు పెంచిన నేపథ్యంలో మలి భాగాన్ని ప్రత్యేక శ్రద్ధతో తెరకెక్కిస్తున్నారు సుకుమార్. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్.

రజనీ 171 షురూ

ఏడు పదుల వయసులో జోరుగా సినిమా తర్వాత సినిమా చేస్తున్నారు రజనీకాంత్. ఇటీవల విడుదలైన రజనీ 169వ చిత్రం 'జైలర్' బ్లాక్ బస్టర్ అయిన విషయం తెలిసిందే. 170వ చిత్రాన్ని 'జై భీమ్' ఫేమ్ దర్శకుడు టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో చేయనున్నారు. సోమవారం రజనీకాంత్ 171వ సినిమా ప్రకటన వెల్లడైంది. రజనీతో 'జైలర్'ని నిర్మించిన సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. గత ఏడాది కమల్ హాసన్‌తో 'విక్రమ్' వంటి బ్లాక్ బస్టర్ ఇచ్చి, ప్రస్తుతం విజయ్ హీరోగా 'లియో'కి దర్శకత్వం వహిస్తున్న లోకేశ్ కనగరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, ఫైట్స్: అన్బు-అరివు.


విరాట్ కర్ణ, ప్రగతి

మంచి కథతో పెదకాపు రూపొందింది
- విరాట్

''పెదకాపు 1' ట్రైలర్ చాలా బాగుంది. రవీందర్ రెడ్డి గారు తన బావమరిదిని, పైగా కొత్త హీరోని పెట్టి కోట్లు ఖర్చు పెట్టి సినిమా తీయడం మామూలు విషయం కాదు. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా తీసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్ వీవీ వినాయక్. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను వీవీ వినాయక్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ విడుదల చేయగా, నిర్మాత వై. రవిశంకర్, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. శ్రీకాంత్ అడ్డాల మాట్లాడుతూ– ''పెదకాపు' మా యూనిట్‌కి మరపురాని చిత్రంగా నిలిచి, 'పెదకాపు 2'కి ప్రస్థానం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''సినిమా మాట్లాడిన తర్వాతే నేను మాట్లాడతాను'' అన్నారు మిర్యాల రవీందర్ రెడ్డి. ''నాకింత మంచి కథ ఇచ్చిన శ్రీకాంత్, నిర్మించిన రవీందర్ రెడ్డిగార్లకు రుణపడి ఉంటా'' అన్నారు విరాట్ కర్ణ. కెమెరామేన్ ఛోటా కె. నాయుడు పాల్గొన్నారు.


సంయుక్తా మీనన్

డెవిల్స్ ఏంజిల్

కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'డెవిల్'. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. సోమవారం (సెప్టెంబర్ 11) ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా 'డెవిల్' చిత్రంలో సంయుక్త పోషించిన నైషధ పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'డెవిల్స్ ఏంజిల్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. ''తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను నవంబర్ 24న విడుదల చేస్తాం'' అన్నారు అభిషేక్ నామా.

మంచి సినిమాలను ప్రోత్సహించాలి
- 'దిల్' రాజు

''తెలుగు ప్రేక్షకులు మంచి చిత్రాలను ఆదరిస్తారని 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'తో మరోసారి నిరూపించారు. ఇలాంటి మంచి సినిమాలను అందరూ ప్రోత్సహించాలి. 'జవాన్' విడుదలైన రోజే వచ్చిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' నిలబడి, బలమైన వసూళ్లతో ముందుకెళ్తోంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నవీన్ పొలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పి. మహేశ్‌బాబు మాట్లాడుతూ– ''మా చిత్రాన్ని చిరంజీవి, మహేశ్‌బాబు, రవితేజ, రాజమౌళి, వంశీ పైడిపల్లి సమంత అభినందించడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''త్వరలో సక్సెస్ సెలబ్రేషన్స్, సక్సెస్ టూర్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు ప్రమోద్.



ప్రమోద్, 'దిల్' రాజు, మహేశ్‌బాబు .పి


అభినయ, సునీల్, ఎస్‌జే సూర్య, నితిన్, విశాల్, అధిక్

టీజర్.. ట్రైలర్ క్రేజీగా ఉన్నాయి
- నితిన్

''మార్క్ ఆంటోనీ' సినిమా ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్ క్రేజీగా ఉన్నాయి. ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది. ఈ చిత్రంతో విశాల్ మరో స్థాయికి వెళ్లాలి'' అని హీరో నితిన్ అన్నారు. విశాల్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మార్క్ ఆంటోనీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్. వినోద్ కుమార్ నిర్మించారు. ఎస్‌జే సూర్య, సునీల్, సెల్వరాఘవన్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా ఈ నెల 15న రిలీజవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మార్క్ ఆంటోనీ' ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు హీరో నితిన్. విశాల్ మాట్లాడుతూ–''నా మొదటి చిత్రం 'చెల్లమే' (ప్రేమ చదరంగం) విడుదలై సెప్టెంబర్ 10కి 19 ఏళ్లు అవుతోంది. ప్రేక్షకులు టికెట్ కొని నా సినిమాలు చూస్తున్నారు. ఆ డబ్బుతో నేను, నా ఫ్యామిలీ మాత్రమే బాగుండాలనుకోను. ఆ డబ్బు అందరికీ ఉపయోగపడాలనుకుంటాను. 'మార్క్ ఆంటోనీ'ని తెలుగులో వేణుగారు రిలీజ్ చేస్తున్నందుకు థ్యాంక్స్'' అన్నారు. ''ఇది తండ్రీ కొడుకుల కథ'' అన్నారు అధిక్. ''నా లైఫ్‌లో తమిళ సినిమా చేస్తానని అనుకోలేదు. నాకు రెండో అవకాశం ఇచ్చాడు అధిక్'' అన్నారు నటుడు సునీల్.

నిజాన్ని నిజాయితీగా చెప్పాం
- స్వాతి



''మంత్ ఆఫ్ మధు'లో మాకు తెలిసిన నిజాన్ని నిజాయితీగా చెప్పాం. శ్రీకాంత్ గారు అద్భుతంగా తీశారు. ఇది ఫీమేల్ సెంట్రిక్ సినిమా కాదు'' అని స్వాతి రెడ్డి అన్నారు. నవీన్ చంద్ర, స్వాతి రెడ్డి జంటగా శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 6న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో శ్రీకాంత్ నాగోతి మాట్లాడుతూ– ''ఈ చిత్రాన్ని మేమెంత ప్యాషనేట్‌గా తీశామో.. ప్రేక్షకులకు కూడా అంతే చక్కగా చేరువవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ చిత్రం 90 శాతం షూటింగ్‌ని వైజాగ్‌లో చేశాం'' అన్నారు యశ్వంత్ ములుకుట్ల.

సాక్షి బిజినెస్
మంగళవారం
12-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	528	67,127
నిఫ్టీ ▲	176	19,996

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	13,901	▲	139
డోజోన్స్	34,659	▲	82
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,497	▲	19
డాక్స్	15,801	▲	56
షాంఘై	3,143	▲	26
నికాయ్	32,468	▼	139

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
59,101	▲	26
బంగారం (99.5 స్వచ్ఛత)		
58,834	▲	27
వెండి (కిలో)		
71,028	▲	166

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.10	105.47
€	యూరో	ఎస్‌బీఐ	87.47	90.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.83	57.56
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.18	54.52
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.96	61.90
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

విదేశీ విభాగాల విక్రయంలో బైజూస్

1.2 బిలియన్ డాలర్ల రుణ చెల్లింపు ప్రణాళికలు

న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ 1.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9,956 కోట్లు) రుణ మొత్తాన్ని పూర్తిగా చెల్లించేసే ప్రయత్నాల్లో ఉంది. ఇందులో భాగంగా విదేశీ విభాగాలైన ఎపిక్, గ్రేట్ లెర్నింగ్ సంస్థలను విక్రయించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రెండింటి విక్రయంతో దాదాపు 800 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చుకోవచ్చని బైజూస్ భావిస్తున్నట్లు వివరించాయి. అలాగే వాటాల విక్రయం ద్వారా తాజాగా మరిన్ని పెట్టుబడులు కూడా సమీకరించడంపైనా కంపెనీ కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. 1.2 బిలియన్ డాలర్ల రుణాన్ని (టీఎల్‌బీ) మొత్తం మీద ఆరు నెలల వ్యవధిలో తీర్చేయొచ్చని బైజూస్ ఆశిస్తోంది. 2021 నవంబర్‌లో విదేశీ ఇన్వెస్టర్ల నుంచి బైజూస్ ఈ రుణాన్ని తీసుకుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-9-2023	
విశాఖ	510-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
11-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.30



- సరికొత్త శిఖరాలపైకి సూచీలు
- ఇంట్రాడే, ముగింపులో కొత్త రికార్డులు
- సూచీలకు ఏడోరోజూ లాభాలే
- ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఇన్వెస్టర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన క్షణం సాక్షాత్కారమైంది. మార్కెట్ విశ్లేషకుల నిరీక్షణకు తెర దించుతూ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సూచీ తొలిసారి 20,000 పాయింట్లను ముద్దాడింది. 1996 ఏప్రిల్ 21న 1000 పాయింట్లతో మొదలైన ప్రయాణం సెప్టెంబర్ 11న చరిత్రలో సువర్ణాధ్యాయంగా మారింది. అయితే నిఫ్టీ 20 వేల స్థాయిని నిలుపుకోలేకపోవడం కాస్త నిరాశ పరిచింది.

> జీ–20 శిఖరాగ్ర సదస్సు ముగింపు మరుసటి రోజు నిఫ్టీ 20,000 స్థాయి అందుకోవడం సంతోషకరం. భారతీయుల సామర్థ్యం, ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం ఈ శుభపరిణామం.
> – ఎన్‌ఎస్‌ఈ ఎండీ ఆశిష్ చౌహాన్

నిఫ్టీ స్థాయి	అందుకున్న తేదీ
1,000	ఏప్రిల్ 1996
5,000	సెప్టెంబర్ 2007
10,000	జూలై 2017
15,000	ఫిబ్రవరి 2021
20,000	సెప్టెంబర్ 2023

రైల్వే షేర్లు రయ్..

20 శాతం పెరిగిన ఇర్కాన్..

భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఎకనమిక్ కారిడార్ ఏర్పాటు వార్తలతో దేశీయంగా రైల్వేస్ సంబంధ షేర్లు సోమవారం 20% వరకు ఎగిశాయి. ఇర్కాన్ ఇంటర్నేషనల్ 19.97%, రైల్ వికాస్ నిగమ్ 16.40%, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ 9.98%, ఎన్‌సీసీ లిమిటెడ్ 3.77% పెరిగాయి. రైలు, రోడ్డు వంటి మార్గాల్లో దేశాల మధ్య కనెక్టివిటీని మెరుగుపర్చుకోవడం తదితర లక్ష్యాలతో జీ20 సదస్సు సందర్భంగా భారత్, అమెరికాతో పాటు పలు దేశాలు భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఎకనమిక్ కారిడార్ ఏర్పాటును ప్రతిపాదించాయి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కి దీన్ని ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. దీని కింద భారత్ నుంచి గల్ఫ్ ప్రాంతానికి తూర్పు కారిడార్, గల్ఫ్ ప్రాంతాన్ని యూరప్‌నకు అనుసంధానం చేస్తూ ఉత్తరాది కారిడార్‌ను అభివృద్ధి చేసే ప్రతిపాదనలు ఉన్నాయి.

లాభాలు ఎందుకంటే...

జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో 'ఢిల్లీ డిక్లరేషన్'తో సహా పలు దౌత్య విధానాలు అమలు పరచడంలో భారత్ విజయం సాధించడం దేశీయ మార్కెట్లో సానుకూల సంకేతాలు నింపింది. ఇటీవల 90 డాలర్ల పైకి చేరుకున్న బ్యారెల్ చమురు ధర దిగిరావడం కలిసొచ్చింది. అలాగే అమ్మకాలకు మొగ్గుచూపుతున్న విదేశీ ఇన్వెస్టర్లు రూ.1473 కోట్ల షేర్లను కొని నికర కొనుగోలుదారులుగా నిలిచారు. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(ఒక శాతం)తో పాటు బ్యాంకింగ్ రంగాల షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ద్రవ్యోల్బణం దిగిరావొచ్చనే అంచనాలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపుపై తగ్గిన ఆందోళనలు, చైనాలో బ్యాంకుల రుణాల వృద్ధి పెరగడం తదితర అంశాలు భారత ఈక్విటీ మార్కెట్‌ను సరికొత్త శిఖరాలపై చేర్చాయి.

20,000 అద్భుతాన్ని అందుకుని.. వెనక్కి

దేశీయంగా నెలకొన్న సానుకూలతలతో ఉదయం సెన్సెక్స్ 209 పాయింట్లు లాభపడి 66,808 వద్ద, నిఫ్టీ 70 పాయింట్లు పెరిగి 19,890 వద్ద ట్రేడింగ్ మొదలయ్యాయి. మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఆటో షేర్లు రాణించడంతో సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 573 పాయింట్లు బలపడి 67,172 వద్ద, నిఫ్టీ 188 పాయింట్లు దూసుకెళ్లి 20,008 జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. సరికొత్త శిఖరాలకు చేరుకున్నాక స్వల్ప లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా సెన్సెక్స్ 528 పాయింట్లు లాభపడి 67,127 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 176 పాయింట్లు బలపడి 19,996 వద్ద నిలిచింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నిఫ్టీ 50 షేర్లకు గానూ కోల్ ఇండియా 1.15%, బజాజ్ ఫైనాన్స్ 0.28%, ఓఎన్‌జీసీ 0.27%, ఎల్‌అండ్‌టీ 0.18% షేర్లు మాత్రమే నష్టపోయాయి. అత్యధికంగా అదానీ పోర్ట్స్ 7% రాణించాయి. ఈ సూచీ ఏడు రోజుల్లో నిఫ్టీ 561 పాయింట్లు పెరిగింది.
- ఈ ఏడాది జూన్ 28న 19,000 పాయింట్లని అందుకున్న నిఫ్టీకి 20 వేల స్థాయిని చేరుకునేందుకు 52 ట్రేడింగ్ సెషన్ల సమయం పట్టింది.
- సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రమే 0.25% నష్టపోయాయి. గడిచిన ఏడు రోజుల్లో 2,296 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.14.67 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.324.26 లక్షల కోట్లకు చేరింది.
- గత వారాంతంలో ఆర్‌బీఐ అదనపు నగదు నిల్వల నిష్పత్తిని దశల వారీగా రద్దు చేస్తున్నట్లు చేసిన ప్రకటనతో పీయస్‌యూ బ్యాంకుల షేర్లకు భారీ డిమాండ్ లభించింది.
- రత్నవీర్ ప్రెసిషన్ ఇంజనీరింగ్ షేరు లిస్టింగ్ రోజే 37% లాభపడింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.98)తో పోలిస్తే 31% ప్రీమియంతో రూ.128 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో మరింత కొనుగోళ్ల మద్దతు లభించడంతో 37% ర్యాలీ చేసి ఇంట్రాడే గరిష్టం రూ.134 వద్ద స్థిరపడింది. ఎక్స్చేంజీలో మొత్తం 16.98 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి.
- రిషిభ్ ఇన్‌స్ట్రుమెంట్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర(రూ.441)తో పోలిస్తే 4% స్వల్ప లాభంతో రూ.460 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో స్వల్పంగా 6% పెరిగి రూ.470 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 0.39% స్వల్ప లాభంతో రూ. 443 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,681 కోట్లుగా నమోదైంది.

ఐటీఐ 'స్మాష్' ల్యాప్‌టాప్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికమ్యూనికేషన్స్ పరికరాల తయారీలో ఉన్న ప్రభుత్వ రంగ ఐటీఐ లిమిటెడ్ స్మాష్ బ్రాండ్ పేరుతో ల్యాప్‌టాప్‌లు, మైక్రో పర్సనల్ కంప్యూటర్ల విభాగంలోకి ప్రవేశించినట్టు ప్రకటించింది. ఇంటెల్ కార్పొరేషన్‌తో కలిసి అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో వీటిని తయారు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇంటెల్ ఐ3, ఐ5, ఐ7 తదితర ప్రాసెసర్లతో ఉపకరణాలు రూపుదిద్దుకున్నాయని ఐటీఐ పేర్కొంది. 'స్మాష్ ఉత్పత్తులను ఇప్పటికే మార్కెట్లో ప్రవేశపెట్టాం. ఏసర్, హెచ్‌పీ, డెల్, లెనొవో వంటి ఎంఎన్‌సీ బ్రాండ్స్‌తో పోటీపడి అనేక ఆర్డర్లు దక్కించుకున్నాం. 12,000 పైచిలుకు పీసీలను కస్టమర్లు వినియోగిస్తున్నారు' అని సంస్థ సీఎండీ రాజేశ్ రాయ్ తెలిపారు. కాగా, తాజా ప్రకటన నేపథ్యంలో ఐటీఐ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో సోమవారం 20 శాతం ఎగసి రూ.149.40 వద్ద స్థిరపడింది.

రిలయన్స్ రిటైల్‌లో కేకేఆర్ రూ. 2,069 కోట్ల పెట్టుబడులు

1.42 శాతానికి వాటాలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కేకేఆర్ తాజాగా రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్)లో రూ. 2,069.50 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా సంస్థలో తన వాటాలను 1.17 శాతం నుంచి 1.42 శాతానికి పెంచుకోనుంది. ఆర్‌ఆర్‌వీఎల్ మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ విషయాలు వెల్లడించింది. ఆర్‌ఆర్‌వీఎల్ విలువను రూ. 8.361 లక్షల కోట్లుగా (సుమారు 100 బిలియన్ డాలర్లు) లెక్కగట్టి, కేకేఆర్ ఇన్వెస్ట్ చేస్తున్నట్లు పేర్కొంది. 2020లో ఆర్‌ఆర్‌వీఎల్‌లో కేకేఆర్ రూ. 5,550 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. రిలయన్స్ రిటైల్‌లో 1 శాతం వాటా కోసం ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ఇటీవలే రూ. 8,278 కోట్లు పెట్టుబడులు పెట్టిన సంగతి తెలిసిందే. రిలయన్స్ రిటైల్ వ్యాపార కార్యకలాపాలకు ఆర్‌ఆర్‌వీఎల్ హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది.

గ్రీన్‌ప్లై ప్రచారకర్తగా జూనియర్ ఎన్‌టీఆర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హానికారక ఉద్గారాలను తగ్గించే జీరో ఎమిషన్ ప్లైవుడ్ ఉత్పత్తులకు ప్రచారకర్తగా నటుడు జూనియర్ ఎన్‌టీఆర్‌ను నియమించుకున్నట్లు గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్ (జీఐఎల్) సీఈవో మనోజ్ తుల్సియాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో కొత్త వాణిజ్య ప్రచార ప్రకటనలను రూపొందించినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా ప్లైవుడ్ పరిశ్రమ 4.5 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా, అందులో సంఘటిత రంగం వాటా 30 శాతం వరకు ఉంటుందని సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయం రూ. 1,800 కోట్లుగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 2,200 కోట్ల వరకు అంచనా వేస్తున్నట్లు మనోజ్ చెప్పారు. ప్రస్తుతం తమకు గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎండీఎఫ్, ప్లైవుడ్ తయారీ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. టర్కీకి చెందిన సంస్థతో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేస్తున్న ప్లాంటు వచ్చే ఏడాది వ్యవధిలో అందుబాటులోకి రాగలదని మనోజ్ చెప్పారు.

భవిత
గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)–ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. యూపీఎస్సీ దేశవ్యాప్తంగా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాలు భర్తీచేయనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 167
» **విభాగాలు:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీఈ/బీటెక్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.01.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ముందుగా పార్ట్-1, పార్ట్-2 అప్లికేషన్ పూర్తిచేయాలి.
» **ఎంపిక విధానం:** స్టేజ్-1(ప్రిలిమినరీ) ఎగ్జామ్, స్టేజ్-2(మెయిన్)ఎగ్జామ్, స్టేజ్-3 (పర్సనాలిటీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.09.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.09.2023 నుంచి 03.10.2023 వరకు
» **ప్రిలిమినరీ/స్టేజ్-1 పరీక్షతేది:** 18.02.2023.
» **వెబ్‌సైట్:** upsc.gov.in

తెలంగాణలో 5089 టీచర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించి టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) నోటిఫికేషన్ విడుదలైంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5089
» **పోస్టుల వివరాలు:** ఎస్‌జీటీ-2575, స్కూల్ అసిస్టెంట్-1739, లాంగ్వేజ్ పండిట్-611, పీఈటీ-164.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఈడీ,టెట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల వయో సడలింపు వర్తిస్తుంది. దివ్యాంగులకు పదేళ్ల వయసు సడలింపు ఉంటుంది.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) పద్ధతిలో జరుగుతుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.09.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023
» **కంప్యూటర్ బేస్డ్ టెస్టులు:** 20.11.2023 నుంచి 30.11.2023 వరకు
» **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

అనంతపురం జిల్లాలో 52 పారా మెడికల్ పోస్టులు

అనంతపురంలోని సెకండరీ హెల్త్ డైరెక్టర్ కార్యాలయం.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్ 2-02, థియేటర్ అసిస్టెంట్-07, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-02, ల్యాబ్ అటెండెంట్-01, పోస్ట్ మార్టం అసిస్టెంట్-03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్లు/జీడీఏ-26, ఆఫీస్ సబార్డినేట్-01, ప్లంబర్-05, రేడియోగ్రాఫర్-01, ఎలక్ట్రీషియన్-01, డెంటల్ టెక్నీషియన్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, సర్టిఫికేట్ కోర్సు, డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసెస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2023.
» **వెబ్‌సైట్:** www.ananthapuramu.ap.gov.in

నిర్మల్ జిల్లాలో 15 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

నిర్మల్ జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం .. నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.52,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా/రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, ఐడీఓసీ(ఎఫ్25), నిర్మల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2023.
» **వెబ్‌సైట్:** https://nirmal.telangana.gov.in

ఢిల్లీ పోలీస్ కొలువుల పిలుపు

» 7,547 కానిస్టేబుల్ పోస్ట్‌లకు ఎస్‌ఎస్‌సీ ప్రకటన
» ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» మూడంచెల్లో ఎంపిక విధానం
» వేతన శ్రేణి రూ.21,700-రూ.69,100

పోలీస్ కొలువుల అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ఢిల్లీ పోలీస్ శాఖలో 7,547 కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్) పోస్టల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ తత్సమాన అర్హతతో ఈ పోస్టులకు పోటీపడొచ్చు. మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఢిల్లీ పోలీస్ ఉద్యోగాలు, ఎంపిక విధానం, రాత పరీక్ష వివరాలు, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..

యూనిఫామ్ వేసుకుని పోలీస్ శాఖలో విధులు నిర్వహించాలని కోరుకునే యువత దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉంటారు. అలాంటి వారికి ఢిల్లీ పోలీస్ శాఖలో కొలువులు చక్కటి మార్గంగా చెప్పొచ్చు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువులో చేరితే.. చక్కటి వేతనంతోపాటు భవిష్యత్తులో పదోన్నతులు కూడా పొందొచ్చు.



మొత్తం పోస్టులు 7,547

ఢిల్లీ పోలీస్ కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) నోటిఫికేషన్ ద్వారా మొత్తం 7,547 పోస్టలను భర్తీ చేయనున్నారు. మహిళలకు, మాజీ సైనికోద్యోగులకు వేర్వేరుగా ఖాళీల వివరాలను పేర్కొన్నారు. అవి.. కానిస్టేబుల్ ఎగ్జిక్యూటివ్ (పురుషులు)–4,453 పోస్టలు; కానిస్టేబుల్ ఎగ్జిక్యూటివ్(పురుషులు–ఎక్స్ సర్వీస్‌మెన్, ఎస్‌సీ, ఎస్‌టీ బ్యాక్‌లాగ్)-266 పోస్టలు; కానిస్టేబుల్ ఎగ్జిక్యూటివ్(పురుషులు–ఎక్స్‌సర్వీస్‌మెన్ కమెండో)–337 పోస్టలు; కానిస్టేబుల్ ఎగిక్యూటివ్(మహిళలు)–2,491.

అర్హత

- 30.09.2023 నాటికి ఇంటర్మీయెట్, తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు: జూలై 1, 2023 నాటికి నాటికి 18–25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

మొత్తం 7,547 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నాలుగు అంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్.

తొలి దశ రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలి దశలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తారు. గంటన్నర వ్యవధిలో నాలుగు విభాగాల్లో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ 50 ప్రశ్నలు–50 మార్కులు; రీజనింగ్ 25 ప్రశ్నలు –25 మార్కులు;న్యూమరికల్ ఎబిలిటీ 15 ప్రశ్నలు –15 మార్కులు; కంప్యూటర్ ఫండమెంటల్స్ ఎంఎస్ ఎక్సెల్,ఎంఎస్ వర్డ్,కమ్యూనికేషన్,ఇంటర్నెట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, వెబ్ బ్రౌజర్స్ నుంచి 10 ప్రశ్నలు–10 మార్కులకు ఉంటాయి.ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

రెండో దశలో పీఈ అండ్ ఎంటీ

- తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పొందిన మార్కుల ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 20 మందిని(1:12 నిష్పత్తిలో) చొప్పున తదుపరి దశ ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం–ఆయా వర్గాలకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు కల్పించిన నేపథ్యంలో.. ఫిజికల్ ఈవెంట్స్‌లో కూడా వయో వర్గాల వారీగా నిబంధనల్లో సడలింపు ఇచ్చారు.
- పరుగు పందెంలో ఉత్తీర్ణత సాధించిన వారికే లాంగ్ జంప్, హై జంప్ ఈవెంట్లు నిర్వహిస్తారు. ఈ రెండు ఈవెంట్లను గరిష్టంగా మూడు అవకాశాల్లో విజయం సాధించాల్సి ఉంటుంది.

ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్

ఫిజికల్ ఈవెంట్స్ పూర్తి చేసుకున్న వారికి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు కనీసం 170 సెంటీ మీటర్ల ఎత్తు కలిగుండాలి. అదే విధంగా ఛాతి విస్తీర్ణం 81 సెంటీ మీటర్లు ఉండాలి. శ్వాస పీల్చినప్పుడు నాలుగు సెంటీ మీటర్లు విస్తరించాలి. మహిళా అభ్యర్థులకు కనీస ఎత్తును 157 సెంటీ మీటర్లుగా నిర్దేశించారు.

తుది ఎంపిక

ఎంపిక ప్రక్రియలో చివరగా మెడికల్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఈ దశలో అభ్యర్థుల ఆరోగ్య ప్రమాణాలను పరిశీలిస్తారు. మొత్తం నాలుగు దశల్లోనూ అభ్యర్థులు చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు.

ప్రారంభ వేతనం

అన్ని దశల్లో విజయం సాధించి నియామకం ఖరారు చేసుకున్న వారికి ప్రారంభ వేతనం రూ.21,700–రూ.69,100 లభిస్తుంది. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ పరీక్షలు, పనితీరు ఆధారంగా.. భవిష్యత్తులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 30, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణకు అవకాశం:** అక్టోబర్ 3,4 తేదీల్లో
- **రాత పరీక్ష తేదీ:** నవంబర్ 14–డిసెంబర్ 5 మధ్యలో ఉంటాయి.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

ప్రిపరేషన్ పక్కాగా

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో మంచి స్కోర్ సాధించేందుకు భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపైనా దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

రీజనింగ్

ఈ విభాగంలో టాప్ స్కోర్ కోసం వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

కంప్యూటర్ ఫండమెంటల్స్

ఈ విభాగంలో రాణించేందుకు వర్డ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి టూల్స్, అదే విధంగా ఎక్సెల్ షీట్స్, ఇంటర్నెట్ కమ్యూనికేషన్ టూల్స్(ఈ-మెయిల్ బేసిక్స్, ఈ-మెయిల్ రైటింగ్, సెండింగ్/రిసీవింగ్ తదితర) అంశాలపై ప్రాక్టీస్ చేయాలి. వెబ్ బ్రౌజింగ్‌కు సంబంధించి యూఆర్‌ఎల్,హెచ్‌టీటీపీ, ఎఫ్‌టీపీ, వెబ్‌సైట్స్, బ్లాగ్స్, బ్రౌజింగ్ సాఫ్ట్‌వేర్స్, సెర్చ్ ఇంజన్స్, చాటింగ్, వీడియో కాన్ఫరెన్స్ తదితర ఆన్‌లైన్ రిసోర్సెస్‌పై అవగాహన పెంచుకోవాలి.

సమాంతర ప్రిపరేషన్

ప్రస్తుతం పలువురు అభ్యర్థులు రాష్ట్ర స్థాయిలోని ఆయా పోలీస్ నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న సంగతి తెలిసిందే. వీరు వీటితోపాటు ఢిల్లీ పోలీస్ ఎగ్జామినేషన్‌కు కూడా ఉపయుక్తంగా ఉండేలా సమాంతర ప్రణాళిక రూపొందించుకోవాలి. ఫలితంగా ఒకే సమయంలో రెండు పరీక్షలకు పోటీ పడే సన్నద్ధత లభిస్తుంది. సిలబస్‌లోని అంశాలు దాదాపు ఒకే విధంగా ఉండటం కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు.

క్లుప్తంగా...

తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవంగా సెప్టెంబరు 17 వేడుకలు

పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబరు 17న ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఆరోజు పబ్లిక్‌గార్డెన్ సెంట్రల్ లాన్‌లో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, ఇతర ప్రతినిధులు పాల్గొని గౌరవ వందనం స్వీకరించటంతోపాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. జిల్లాల వారీగా ఎవరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలో, వారి పేర్లతో కూడిన జాబితాతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కామాఖ్య ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు



సాక్షి, హైదరాబాద్‌: అస్సాంలోని కామాఖ్య అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో మరోమారు బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని, తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు కవిత వెల్లడించారు. సోమవారం గౌహతిలోని కామాఖ్య అమ్మవారి ఆలయంలో కవితకు అర్చకులు స్వాగతం పలికారు. నాలుగేళ్ల క్రితం కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్నానని, మళ్లీ దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

పోలీసులను పాజిటివ్ కోణంలో చూపండి

తెలుగు చిత్ర పరిశ్రమను కోరిన డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్‌: ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తారని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. పోలీసులతోపాటు వారి కుటుంబాలు కూడా ఎంతో త్యాగం చేస్తున్నాయని, అయితే ఈ విషయాలపై సమాజానికి పెద్దగా అవగాహన ఉండటంలేదని పేర్కొన్నారు. సినిమాల్లో పోలీస్ పాత్రలను పాజిటివ్ కోణంలో చూపాలని డైరెక్టర్లు, నిర్మాతలను కోరారు. సోమవారం ఇక్కడ జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'మార్పునకు ఉత్ప్రేరకంగా సినిమా'అన్న అంశంపై నిర్వహించిన సెమినార్‌లో డీజీపీ మాట్లాడారు.'భారత్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ హిందీ చిత్ర పరిశ్రమ కంటే పెద్దది. ఇక్కడి సినిమా డైరెక్టర్లు, సీనియర్ నటులు, నిర్మాతలు సమాజాన్ని జాగృతం చేసే చిత్రాలు చేసేందుకు రిస్క్ తీసుకోండి. సమాజాన్ని చైతన్యవంతం చేసే అతిపెద్ద శక్తి చిత్ర పరిశ్రమకు ఉంది'అన్నారు. సమాజసేవలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారన్నారు. ఒకప్పుడు కుటుంబం అంతా కలిసి చిత్రాలు చూసేందుకు వెళ్లే వాళ్లమని డీజీపీ గుర్తు చేసుకున్నారు. తాను చిన్నతనంలో చూసిన చిత్రాలను, వాటి విశేషాలను పంచుకున్నారు.

మూడేళ్లలో 428 శాతం పెరిగిన డిజిటల్ లావాదేవీలు

- యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా చిన్న మొత్తంలో చెల్లింపులకు అవకాశంతో అత్యధికుల మొగ్గు
- ఆగస్టులో రూ.10 బిలియన్ల ట్రాన్సాక్షన్ల నమోదుతో రికార్డ్
- కోవిడ్ మహమ్మారి కాలం నుంచి మూడేళ్లలో క్రమంగా లావాదేవీల పెరుగుదల
- 2023–24లో (ఏప్రిల్–జూలైల మధ్య) చెల్లింపులు రూ.ట్రిలియన్లలో..
- ఆర్‌బీఐ డేటా ఆధారంగా వెల్లడించిన నివేదిక



యూపీఐ ట్రాన్సాక్షన్ల జోరు.. డెబిట్ కార్డులు బేజారు!

సాక్షి, హైదరాబాద్‌: డిజిటల్ లావాదేవీలతో మనోళ్లు దుమ్మురేపుతున్నారు. యూపీఐ పేమెంట్స్ అనేది అత్యంత ప్రజాదరణ పొందిన డబ్బు బదిలీ (మనీ ట్రాన్స్‌ఫర్)గా నేడు అవతరించింది. అందుకే మునుపెన్నడూ లేనంత స్థాయిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ట్రాన్సాక్షన్ల జోరు కొనసాగుతోంది. మూడు, నాలుగేళ్ల కిందట ప్రధానంగా బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డులతో అత్యధికంగా పలు రకాల లావాదేవీలు, ఆర్థిక కార్యకలాపాలు జరిగిన విషయం తెలిసిందే. కోవిడ్ మహమ్మారి కాలం తెచ్చిన మార్పు చేర్పులతో డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగాన్ని తోసిరాజని యూపీఐ లావాదేవీలు ఇప్పుడు అగ్రపీఠాన్ని అధిరోహించాయి.

→ యూపీఐ ద్వారా... చిన్న మొత్తంలో కొనుగోళ్లు, ఇతరత్రా చెల్లింపులకు అవకాశం ఉండడంతో వాటివైపే అత్యధికుల మొగ్గు చూపుతున్నట్టు స్పష్టమైంది. రోజువారీ నిత్యావసర కొనుగోళ్ల మొదలు, మార్కెట్‌లో వివిధరకాల వస్తువుల కొనుగోలుకు యూపీఐ చెల్లింపు విధానాన్ని మెజారిటీ వినియోగదారులు అనుసరిస్తున్నారు. గత మూడేళ్లలో 428 శాతం యూపీఐ ట్రాన్సాక్షన్లు పెరగ్గా, గత నెలలో (ఆగస్టులో) రూ.పది బిలియన్ల (బిలియన్ = 100 కోట్లు) ట్రాన్సాక్షన్ల నమోదుతో తొలిసారి రికార్డ్ సృష్టించాయి.

కీలకాంశాలు

→ 2020 జూలైలో డెబిట్‌కార్డుల ద్వారా చేసిన చెల్లింపులు రూ.2.81 ట్రిలియన్లు కాగా. 2023 జూలైలో అవి రూ.3.15 ట్రిలియన్లకు... అంటే 11.96 శాతం వృద్ధిని మాత్రమే నమోదుచేశాయి.


→ ఇదే సమయంలో యూపీఐ చెల్లింపులు అనేవి రూ.2.90 ట్రిలియన్ల నుంచి రూ.15.33 ట్రిలియన్లకు.. అంటే 428 శాతం పెరుగుదలను రికార్డ్ చేశాయి

→ మరోవైపు క్రెడిట్‌కార్డుల ద్వారా చెల్లింపులు కూడా పెరుగుతున్నాయి

→ 2020 జూలైలో రూ.0.45 ట్రిలియన్ల చెల్లింపులతో పోల్చితే 2023 జూలై నాటికి అవి రికార్డ్ స్థాయిలో రూ.1.45 ట్రిలియన్లకు చేరుకున్నాయి

→ కష్టమర్లు చెల్లిస్తున్న పద్ధతుల్లో భారీ మార్పుల వస్తున్నా డెబిట్‌కార్డుల వినియోగం పూర్తిగా కనుమరుగయ్యే అవకాశాలు లేవు. మార్కెట్‌లో వాటి స్థానం పదిలమని నిపుణుల అంచనా.

గత 4 ఏళ్లలో యూపీఐ, డెబిట్, క్రెడిట్ చెల్లింపులు ఇలా...



20 బిలియన్లకు చేరుకున్నా ఆశ్చర్యం లేదు

చిన్న చిన్న మొత్తాల్లో చెల్లింపులు పెరగడం, ఫోన్ ద్వారా యూపీఐ లావాదేవీల వెసులుబాటుతో.. సంప్రదాయ చెల్లింపు పద్ధతిగా ఉన్న కస్టమర్ల డెబిట్‌కార్డుల వినియోగం అనేది బాగా తగ్గింది. దీనిని బట్టి వచ్చే 18–24 నెలల కాలంలో యూపీఐ లావాదేవీలు నెలకు రూ.20 బిలియన్లకు చేరుకున్నా ఆశ్చర్యపడక్కర లేదు.

–సునీల్ రంగోలా, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్, హెడ్ –స్ట్రాటజీ.ఇన్నోవేషన్, అనాలిటిక్స్, వరల్డ్‌లైన్ ఇండియా

మూడేళ్లుగా డిజిటల్ లావాదేవీలు

కోవిడ్ నుంచి మూడేళ్లుగా క్రమంగా డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. ఎంతగా అంటే.. 2023–24 ఆర్థికసంవత్సరంలో (ఏప్రిల్–జూలైల మధ్య) చెల్లింపుల విషయానికొస్తే..క్రెడిట్‌కార్డుల ద్వారా రూ.5.57 ట్రిలియన్లు, డెబిట్‌కార్డులతో రూ.13 ట్రిలియన్లు, యూపీఐ ద్వారా రూ.59.14 ట్రిలియన్ల (ట్రిలియన్ = లక్ష కోట్లు)లో జరిగినట్టు వెల్లడైంది. ఆర్‌బీఐ డేటా ఆధారంగా రూపొందించిన నివేదికలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. కరోనా తెచ్చిన మార్పులతో భారతీయులు అనుసరిస్తున్న వ్యయం తీరులో మార్పులు వచ్చినట్టుఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

వాగులో చిక్కుకుని ఏడు గంటలు నరకయాతన

- తీవ్రంగా శ్రమించి సురక్షితంగా కాపాడిన గ్రామస్తులు
- దుందుభి వాగులో చిక్కుకున్న ఇద్దరు మహిళలు
- మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో ఘటన





వాగులో చిక్కుకున్న సుగుణమ్మ, మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

మిడ్జిల్: ఊహించని విధంగా వచ్చిన వరదతో ఇద్దరు మహిళలు వాగులో చిక్కుకుపోయి.. 7 గంటల పాటు నరకయాతన అనుభవించారు. ఎట్టకేలకు అధికారులు, గ్రామస్తులు తీవ్రంగా శ్రమించి.. చివరికి ప్రాణాలు కాపాడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని చిల్వేర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తోటికోడళ్లు నీలమ్మ, సుగుణమ్మ పని మీద దుందుభి వాగు అవతల ఉన్న ఆవంచ గ్రామానికి సోమవారం ఉదయం 10 గంటలకు వెళ్లారు. పని ముగించుకొని తిరిగి 12 గంటలకు చిల్వేర్‌కు వస్తుండగా వాగు మధ్యలోకి రాగానే ఎగువన కురిసిన వర్షాలతో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగింది. దీంతో వారు ముళ్ల చెట్లను పట్టుకొని కేకలు వేయడంతో పశువుల కాపరులు గమనించి గ్రామస్తులు, పోలీసులు, అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ రాజునాయక్, సీఐలు జములప్ప, వెంకట్, ఎస్ఐ శివకృష్ణనాయుడు వాగు వద్దకు చేరుకుని తాడు సాయంతో ఆ మహిళలను తీసుకువచ్చేందుకు యత్నించారు. కానీ వరద ఉధృతికి ఆ ప్రయత్నం విఫలం కావడంతో 5.30 గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రం నుంచి బోటును తెప్పించారు. బోటులో సాంకేతిక లోపం ఏర్పడటంతో మరమ్మతు చేసి వాగు మధ్యలో చిక్కుకున్న మహిళల దగ్గరకు చేరుకున్నారు. మహిళలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్డీఓ అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య గ్రామానికి చేరుకుని మహిళలను పరామర్శించారు. బాధిత మహిళలను చికిత్స నిమిత్తం 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

> **దేవుని దయతో బయటపడ్డాం..**
>
> వాగు మధ్యలోకి వచ్చాక నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో కంపచెట్లను పట్టుకొని నరకం అనుభవించాం. ఈత వచ్చిన కూడా మేం ముందుకు కదలలేకపోయాం. ఇక మేం బతుకు మీద ఆశలు వదులుకున్నాం. చివరికి అధికారుల కష్టం, దేవుడి దయతో సురక్షితంగా బయటపడ్డాం.
>
> – సుగుణమ్మ, నీలమ్మ

దొరకని ఆధార్ లింక్

- నిలిచిపోయిన వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ ఆదాయానికి రూ.50 కోట్ల గండి!

సాక్షి, హైదరాబాద్‌: ఈకేవైసీ సర్వర్ డౌన్ కావడంతో సోమవారం రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల సేవలు నిలిచిపోయాయి. ఉదయం రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి సాయంత్రం వరకు సాంకేతిక సమస్యలతో ఆధార్ సర్వర్ లింకు దొరకలేదు. కార్డ్ సాఫ్ట్‌వేర్ సరిగానే ఉన్నప్పటికీ ఆధార్ సర్వర్ లింక్ దొరకని కారణంగా వ్యవసాయేతర రిజిస్ట్రేషన్ కార్యకలాపాల్లో భాగమైన ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదు. సమస్యను పరిష్కరించే సమయానికి సాయంత్రం కావడంతో చివర్లో ఒకట్రెండు మినహా రాష్ట్రంలోని 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లావాదేవీలు జరగలేదు. దీంతో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.50 కోట్ల మేర గండి పడి ఉంటుందని అంచనా. సోమవారం సాయంత్రానికే సాంకేతిక సమస్యలు పరిష్కారమయ్యాయని, మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు యధావిధిగా జరుగుతాయని ఆ శాఖ అధికారులు తెలిపారు.

సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తకు శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు



సాక్షి, హైదరాబాద్‌: పరిశోధన రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్(సీడీఎఫ్‌డీ) శాస్త్రవేత్త డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. సీడీఎఫ్‌డీలోని ల్యాబొరేటరీ ఆఫ్ సెల్ డెత్ అండ్ సెల్ సర్వైవల్ అధిపతిగా వ్యవహరిస్తున్న సుబ్బారెడ్డి కణ జీవశాస్త్రవేత్త. శరీర క్రియలకు అత్యంత కీలకమైన ప్రొటీన్ల మధ్య సమాచార వినిమయంపై పరిశోధిస్తున్నామని, సాధారణ స్థితిలో.. లేదా వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఈ సమాచార మార్పిడిలో ఏదైనా తేడాలు ఉన్నాయా? అన్నది కూడా తమ అధ్యయనంలో భాగమని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు. కణాల లోపల కూడా ప్రొటీన్లు ఎలా మాట్లాడుకుంటాయో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామయని అన్నారు. కేన్సర్ కణాలపై ఎక్కువగా దృష్టి పెట్టామని, ఫలితాల ఆధారంగా భవిష్యత్తులో కేన్సర్‌కు మరింత సమర్థచికిత్స అందించే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. డాక్టర్ ఎం.సుబ్బారెడ్డి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం గతంలోనూ కేన్సర్ కణితులను అణచివేసే ఓ జన్యువును నియంత్రించే ప్రొటీన్‌ను గుర్తించడంలో విజయం సాధించారు.

2017లో స్కోపస్ యంగ్ సైంటిస్ట్ అవార్డు

కెనడాలోని మనిటోబా యూనివర్సిటీ నుంచి 2007లో బయోకెమిస్ట్రీలో పీహెచ్‌డీ పట్టా పొందిన ఎం.సుబ్బారెడ్డి ఆ తరువాత అమెరికాలోని యేల్ యూనివర్సిటీలోని జున్‌జీ చెన్ లాబొరేటరీలో పోస్ట్ డాక్టోరల్ శిక్షణ పొందారు. అనంతరం 2009లో భారత్ తిరిగి వచ్చిన ఎం.సుబ్బారెడ్డి సీడీఎఫ్‌డీలో ఎల్‌సీడీసీఎస్ అధిపతిగా పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ–వెల్‌కమ్ ట్రస్ట్ అలయెన్స్‌లో 2016 నుంచి సీనియర్ ఫెలోగానూ వ్యవహరిస్తున్నారు. గుహా రీసెర్చ్ కాన్ఫరెన్స్ సభ్యులైన ఈయన ఇప్పటికే దేశంలోనే అత్యున్నత శాస్త్ర పురస్కారం 'నేషనల్ బయోసైన్స్ అవార్డు'గ్రహీత కూడా. నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ స్కోపస్ యంగ్ సైంటిస్ట్ అవార్డును 2017లో అందుకున్నారు. అదే సంవత్సరం ఎల్‌సెవియర్ అవార్డునూ చేజిక్కించుకున్నారు.

ఎన్నికలెప్పుడైనా 'ఈసీ' సిద్ధం

- సన్నద్ధతలో భాగంగా అన్ని బ్యాలెట్ యూనిట్లు, కౌంటింగ్ యూనిట్, వీవీప్యాట్‌ల తనిఖీ
- రాష్ట్రంలో మొత్తం 34891 పోలింగ్ కేంద్రాలు..



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది, 33 జిల్లాల్లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్‌లు అన్నింటినీ పూర్తిగా సిద్ధం చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి వచ్చినా, విడివిడిగా ఎన్నికలు వచ్చినా సరే అవసరమైన సరంజామా మొత్తం సిద్ధం చేసుకున్నారు. ఓటింగ్ యంత్రాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటింగ్‌లో కీలకమైన బ్యాలెట్ యూనిట్ కౌంటింగ్ యూనిట్, వీవీ ప్యాట్‌లకు అవసరమైన పవర్‌ప్యాక్‌లు, థర్మల్ పేపర్ రోల్స్, పేపర్ సీల్స్.. తదితరాలన్నింటినీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం ఇప్పటికే సేకరించినట్లు సమాచారం. తొలి దశ పరిశీలన కోసం మొత్తం 72,933 బ్యాలెట్ యూనిట్లు, 57,691 కౌంటింగ్ యూనిట్లు, 56,745 వీవీ ప్యాట్ యంత్రాలను సిద్ధం చేసి పెట్టారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రదర్శన కేంద్రాలు జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో 28, రిటర్నింగ్ అధికారిస్థాయిలో 83 సిద్ధం చేశారు. అలాగే ఈవీఎం మొబైల్ వ్యాన్‌లు 125ని రెడీ చేశారు.

ఈవీఎంలపై అనుమానాలపై ఈసీ అసంతృప్తి..

దేశంలో 2004 నుంచి పూర్తిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వాడుతున్నప్పటికీ .. ఇప్పటికీ ఇంకా వాటి పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కోర్టుల్లో సవాల్ చేస్తూ పిల్‌లు వేయడంపై ఎన్నికల సంఘం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. సుప్రీం కోర్టులో ఇటీవల ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పిల్ వేసిన అంశంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా పిటిషన్‌దారులపై మండి పడిన విషయాన్ని ఎన్నికల సంఘం గుర్తు చేస్తోంది. ఈవీఎంలపై పిల్ వేసిన పిటిషన్‌దారులకు పలు హైకోర్టులు కూడా జరిమానాలు విధించాయని చెబుతోంది.

అప్పుడు హాజరుకాకుండా అనుమానాలు లేవనెత్తవద్దు

అన్ని రాజకీయ పార్టీల సమక్షంలోనే తొలిదశ పరీక్షలు నిర్వహిస్తామని, ఆ సమయంలో వారు హాజరుకాకుండా ఆ తరువాత అనుమానాలు లేవనెత్తడం సరికాదని ఈసీ వ్యాఖ్యానించింది. అన్ని పక్షాలు కూడా ఈవీఎంలతో ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి.. ఆ తరువాత ఓడిపోగానే ఈవీఎంలను నిందించడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పలుమార్లు కోర్టులకు పూర్తిస్థాయిలో వివరణలతో అఫిడవిట్‌లు దాఖలు చేసిన అంశాన్ని ఎన్నికల సంఘం గుర్తు చేసింది.

ఓటర్ల జాబితా సవరణ వేగంగా జరగాలి: వికాస్‌రాజ్ ఆదేశం

ఓటర్ల జాబితా సవరణల ప్రక్రియను వేగంగా, పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించారు. లింగ నిర్ధారణకు సంబంధించిన అంశాలు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, అత్యధిక ఓటర్లు ఉన్న కేంద్రాలు, పురాతన పోలింగ్ కేంద్రాలు, ఇతర సున్నిత అంశాలు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి పరిష్కారానికి వీలుగా సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎపిక్ కార్డుల తయారీని కూడా వేగవంతం చేయాలన్నారు. కాన్ఫరెన్సులో అడిషనల్ సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.



పుస్తకం 1,00,100 పేజీలు 19.4 అడుగుల ఎత్తు

గిన్నిస్ రికార్డు సాధించిన ఖమ్మంవాసి



గిన్నిస్ ధ్రువపత్రం అందుకుంటున్న జావీద్

ఖమ్మం అర్బన్: ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు బోధన, పరిశోధనకు ఉపయోగపడే అంశాలతో ఖమ్మం జిల్లావాసి భారీ పుస్తకం రూపొందించి గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కాడు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లికి చెందిన డాక్టర్ ఎండీ జావీద్ హైదరాబాద్‌లోని ప్రిన్స్‌టన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీ డీన్‌గా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే 60కిపైగా పరిశోధనాపత్రాలు రాసిన ఆయన 11 అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. వివిధ దేశాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడంతోపాటు పలు అంశాలపై తొమ్మిది పేటెంట్లు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈఎస్ఎన్ పబ్లికేషన్స్, లండన్ స్కూల్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ భాగస్వామ్యంతో ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థుల కోసం నాలుగేళ్లపాటు శ్రమించి 1,00,100 పేజీల పుస్తకాన్ని రూపొందించారు. జావీద్ ఎడిటర్‌గా రూపొందిన ఈ పుస్తకం ఎత్తు 19.4 అడుగులు. దీంతో గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డ్స్ బాధ్యులు పరిశీలించి ఇటీవల చెన్నైలో జరిగిన సమావేశంలో అవార్డు ప్రకటించారు. ఇక అగ్రికల్చర్ హబ్‌ను స్థాపించిన జావీద్ సాంకేతిక సాయంతో వ్యవసాయాభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తుండగా, కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్, మేవార్ యూనివర్సిటీ నుంచి అకడమిక్ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన తండ్రి ఎండీ గౌస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి గృహిణి. ప్రస్తుతం జావీద్ వైద్యరంగానికి సంబంధించి ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ పత్రాలను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పరీక్షించి వ్యాధులను నిర్ధారించడంపై పరిశోధిస్తున్నారు.

వంతెన లేదు.. అంబులెన్స్ రాదు

- ఎడ్లబండిపై మృతదేహం తరలింపు
- ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల అవస్థలు



ఇంద్రవెల్లి: వాగుపై వంతెన లేక.. అంబులెన్స్ వచ్చే దారిలేక ఎడ్లబండిపై మృతదేహాన్ని తరలించాల్సి వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హర్కపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మామిడిగూడ(జి) గ్రామంలో సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన వృద్ధురాలు మెస్రం సావిత్రిబాయి (65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక.. అత్యవసరమైతే ఇబ్బంది అవుతుందనే కారణంతో ఆమెను 15 రోజుల క్రితం మండలంలోని డోంగర్‌గామ్ గ్రామంలో ఉంటున్న కూతురు యేత్మబాయి ఇంటికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాలుగు రోజుల క్రితం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి విషమించి సోమవారం ఆమె మృతి చెందింది. అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని మామిడిగూడ(ఏ) గ్రామం వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు సౌకర్యం లేక పోవడం, గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో ఎడ్లబండిపై మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

డోలీపై జ్వరపీడితుడి తరలింపు



వంతెన కూలి గిరిజనుల కష్టాలు

ఏటూరునాగారం: కొండాయి వద్ద వంతెన తెగిపోవడంతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మల్యాల గిరిజనుల కష్టాలు అన్నీఇన్నీ కావు. గ్రామానికి చెందిన పూనెం దూలయ్య అనే వ్యక్తి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. అమ్మతల్లి సోకడంతో ఆరోగ్యం క్షీణించింది. వైద్యసాయం అందే పరిస్థితి లేదు. కొండాయి వద్ద వంతెన తెగిపోవడంతో రవాణా సౌకర్యాల్లేవు. దీంతో గిరిజనులు మంచాన్ని డోలీగా మార్చి మల్యాల నుంచి వంతెన వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం తరలించారు. వాగువద్ద ఉన్న పడవలో దాటించి ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.

బస్సు చోరీ చేసి.. ప్రయాణికుల్ని ఎక్కించుకుని..



తంగళ్లపల్లి(సిరిసిల్ల)/సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో చోరీకి గురైన ఆర్టీసీ అద్దె బస్సు రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులో ప్రత్యక్షమైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. సిద్దిపేట డిపోకు చెందిన అద్దె బస్సు (టీఎస్ 36 టీఏ 3336)ను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. అంతటితో ఆగకుండా నేరుగా సిద్దిపేట బస్టాండ్‌కు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని వేములవాడకు వచ్చాడు. ఇక్కడి నుంచి హైదరాబాద్ బోర్డుతో ప్రయాణికులను ఎక్కించుకుని బయల్దేరాడు. ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేసి, టికెట్ మాత్రం ఇవ్వలేదు. దీంతో అనుమానం వచ్చిన ప్రయాణికులు.. తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులోని ఎల్లమ్మ గుడి వద్దకు చేరుకోగానే డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో సదరు వ్యక్తి బస్సును అక్కడే వదిలేసి పరారయ్యాడు. వెంటనే ప్రయాణికులు డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడి పోలీసులు సిద్దిపేట పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గంభీరావుపేటకు చెందిన రాజుగా గుర్తించారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కొండచిలు'వల.. వల'



కొల్చారం (నర్సాపూర్): మెదక్ జిల్లా సంగాయిపేట పెద్ద చెరువులో చేపలు జారి పోకుండా మత్స్యకారులు కట్టిన వలలో కొండచిలువ చిక్కుకుంది. వలతాడు చుట్టేయడంతో బయటికి రాలేకపోయింది. మీటరున్నర పొడవున్న కొండచిలువ, దాదాపు 15 కిలోల వరకు బరువుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.